www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 మంగళవారం

# వెలుతురు

రంగారెడ్డి। 13, ఫిబ్రవరి 2024 తెలుగు దిన పత్రిక

సంపుటి: 5 సంచిక: 265, పేజీలు: 12, వెల: రూ.5/-

వెలుతురు TV NEWS

## కృష్ణా ప్రాజెక్టులు

# కేంద్రానికి అప్పగించం..

### కేసీఆర్ సభకు ఎందుకు రాలేదు..?

- దక్షిణ తెలంగాణ కృష్ణా జలాలపై ? ఆధారపడి ఉంది
- హరీశ్‌రావు సభలో పచ్చి అబద్ధాలు చెబుతున్నారు
- ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేది లేదు
- అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రజా ప్రభుత్వం పెట్టింది
- ప్రభుత్వం నిర్ణయాన్ని కేసీఆర్ స్వాగతిస్తున్నట్టా..?
- అసెంబ్లీకి హాజరు కానందున వ్యతిరేకిస్తున్నట్టా..?
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- ఏపీకి కృష్ణాజలాలను ధారపోసింది కేసీఆరే
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కేఆర్ఎంబీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్







**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు):** తెలంగాణ బడ్జెట్ సెషన్ వాడీవేడిగా జరుగుతోంది. కృష్ణా జలాలపై చర్చ జరిగింది. ఇలాంటి కీలక సమయంలో సభకు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రాకపోవడాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. దక్షిణ తెలంగాణ కృష్ణా జలాలపై ఆధారపడి ఉందని సీఎం పేర్కొన్నారు. హరీశ్‌రావు సభలో పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్ష నేత చర్చల్లో పాల్గొనకపోవడాన్ని తప్పుపట్టారు. కృష్ణా జలాలపై చర్చ జరుగుతుంటే ఒక వ్యక్తి ఫామ్ హౌస్‌కు పరిమితమయ్యారని కేసీఆర్ ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తిని కరీంనగర్ నుంచి తరిమికొడితే.. మహబూబ్‌నగర్ వాసులు ఎంపీగా గెలిపించారన్నారు. ఇంత ముఖ్యమైన అంశంపై మాట్లాడేందుకు కేసీఆర్ ఎందుకు రాలేదని నిలదీశారు. ఈ రోజు తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో కీలక ఘట్టంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దక్షిణ తెలంగాణ ప్రాణ ప్రదమైన కృష్ణా జలాలపై అసెంబ్లీలో ప్రజా ప్రభుత్వం చర్చ పెట్టిందన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేది లేదని అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రజా ప్రభుత్వం పెట్టిందన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని కేసీఆర్ స్వాగతిస్తున్నట్టా..? అసెంబ్లీకి హాజరు కానందున వ్యతిరేకిస్తున్నట్టా..? అని ప్రశ్నించారు. ఒకప్పుడు ఎంపీగా బిక్ష పెట్టిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రయోజనాలే పట్టని కేసీఆర్ కు తెలంగాణ ప్రయోజనాలు పడతాయా? అని నిలదీశారు. నీళ్లపై కీలక చర్చ జరుగుతున్నప్పుడు.. ఆ వ్యక్తి ఫాం హౌస్‌లో పడుకున్నారని కేసీఆర్ ను ఉద్దేశించి విమర్శించారు. మరోవైపు బీఆర్ఎస్ నేత సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుపై సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. పద్మారావును నిజమైన తెలంగాణ

మిగతా.. 2లో

### భారత మాజీ నౌకాధికారులకు

# విముక్తి

- భారత్‌కు అప్పగించిన ఖతార్
- దౌత్యపరంగా విజయం సాధించిన మోడీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 (వెలుతురు):** ఖతార్‌లో గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయిన ఎనిమిది మంది భారత నావికాదళ మాజీ అధికారులను అక్కడి ప్రభుత్వం విడుదల చేసింది. 18 నెలలుగా వీరు అక్కడి జైల్లో ఉన్నారు. వీరికి విధించిన మరణ దండనను ఇప్పటికే న్యాయస్థానం జైలు శిక్షగా మార్చిన



విషయం తెలిసిందే. తాజాగా దాని నుంచి కూడా విముక్తి కల్పించిన ఖతార్ భారత్‌కు అప్పగించారు. ఏడుగురు ఇప్పటికే దిల్లీ చేరుకున్నారు. ఖతార్ నిర్ణయాన్ని భారత ప్రభుత్వం స్వాగతించింది. దహ్రా గ్లోబల్ కంపెనీలో పనిచేస్తూ ఖతార్‌లో అరెస్టయిన ఎనిమిది మంది భారతీయ పౌరులను విడుదల

మిగతా.. 2లో

### జేఈఈ మెయిన్ సెషన్ -1

# తుది కీ విడుదల

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(వెలుతురు):** దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్షల తుది ఆన్సర్ కీ 2024 విడుదలైంది. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఈ పరీక్షలను నిర్వహించిన జాతీయ పరీక్షల సంస్థ సోమ వారం పేపర్ -1 'ఫైనల్ ఆన్సర్ కీ'ని విడుదల చేసింది. త్వరలోనే ఫలితాలను ఫలితాలను వెల్లడించనుంది. జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షకు దేశ వ్యాప్తంగా 12,95,617మంది రిజిస్ట్రేషన్ చేసు కోగా.. 12,25,529 మంది హాజరైన సంగతి తెలిసిందే.




# రాజ్యాంగ ఉల్లంఘన కాదు

- డిప్యూటీ సీఎంల నియామకంపై సుప్రీం వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(వెలుతురు):** రాష్ట్రాల్లో ఉపముఖ్యమంత్రులను నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. ఈ విధానాన్ని అవలంబించడం రాజ్యాంగ ఉల్లంఘన కాదని స్పష్టం చేసింది. డిప్యూటీ సీఎంల నియామకాన్ని సవాల్ చేస్తూ పబ్లిక్ పొలిటికల్ పార్టీ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడం రాజ్యాంగంలోని నిబంధనను ఉల్లంఘించడమేనని, దీని ద్వారా రాష్ట్రాలు తప్పుడు ఉదాహరణగా నిలుస్తున్నాయని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై తాజాగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఇది రాజ్యాంగ విరుద్ధమేమీ కాదని వెల్లడించింది."పార్టీ లేదా సంకీర్ణ ప్రభుత్వంలోని సీనియర్ నాయకులకు కాస్త ఎక్కువ

మిగతా.. 2లో



## నేడు మేడిగడ్డకు

# ప్రజాప్రతినిధులు

- సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల పర్యటన
- అక్రమాలను బయటపెట్టడమే లక్ష్యంగా యాత్ర
- వేలకోట్లు నీటి పాలయ్యాయని నేతల ఆరోపణ

**హైదరాబాద్,ఫిబ్రవరి12 (వెలుతురు):** కాళేశ్వరంప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ లోపాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు,

మిగతా.. 2లో

## అసెంబ్లీ సాక్షిగా...

# అవాస్తవాలు

- కాంగ్రెస్ చెప్పిన విషయాలు అవాస్తవాలు
- అవాస్తవాల పుస్తకం అని బుక్ పేరు రాయల్సింది
- అపెక్స్ కమిటీ మీటింగ్‌లో కేఆర్ఎంబీ కనిపించలేదు
- ఉత్తమ్ సత్యదూరమైన ప్రజెంటేషన్ ఇచ్చారు
- అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రి హరీశ్ రావు
- పవర్ ప్రెజెంటేషన్ మొత్తం ఇంగ్లీష్ లోనే..
- ఉత్తమ్ మాట్లాడేది మాకే అర్థం కాలేదు
- ప్రజలకు ఏం అర్థంమౌతుంది..?
- మీడియాతో చిట్ చాట్‌లో కేటీఆర్



**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు):** అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ అవాస్తవాలని ఆధారాలతో సహా తిప్పి కొట్టారు మాజీ మంత్రి హరీశ్ రావు. నల్లగొండ సభకు స్పందనగా మీరు ప్రాజెక్టులు అప్పజెప్పబోమని తీర్మానం చేయడం సంతోషమని.. తాము స్వాగతిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. అసెంబ్లీలో ప్రాజెక్టులపై మాట్లాడిన హరీశ్ రావు.. కృష్ణా ప్రాజెక్టుల అంశంపై కాంగ్రెస్ పార్టీ చెప్పిన విషయాలు వాస్తవాలు కాదని.. అవి అవాస్తవాలన్నారు. అవాస్తవాల పుస్తకం అని బుక్ పేరు రాయల్సింది అని అన్నారు. ప్రాజెక్టులు అప్పగించే విషయం నాటి ప్రభుత్వం ఒప్పుకున్నది అని అబద్ధాలు చెప్పింది. అవాస్తవాలు చెప్పింది అని మండిపడ్డారు. అవాస్తవాలను ఏంటనేవి సభలో తెలిపారు హరీశ్ రావు. అపెక్స్ కమిటీ మీటింగ్‌లో కేఆర్ఎంబీ కనిపించలేదు. ఎందుకంటే మ్యాటర్ సబ్ జుడిస్ అని ఉంది. రెండోది.. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ నోటిఫికేషన్ సవాలు చేయలేదన్నారు. దీనికి సాక్ష్యం రాహుల్ బొజ్జా రాసిన ఆధారం చుడోచ్చు. 15.07.2021 గెజిట్‌లో

మిగతా.. 2లో

# హుక్కాపై నిషేధం..

- తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం
- హుక్కా కేంద్రాలను నిషేధిస్తూ చట్టం
- పొగాకు ఉత్పత్తుల ప్రచారంపైనా రాష్ట్రం నిషేధం
- ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనభ



**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు):** తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. హుక్కాపై నిషేధం విధించింది. తెలంగాణలో హుక్కా కేంద్రాలను నిషేదించే సవరణ బిల్లును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున మంత్రి శ్రీధర్ బాబు బిల్లు ప్రవేశ పెట్టగా సభ ఆమోదించింది. బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు సభకు మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి యువతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సిగరెట్ పొగ కంటే హుక్కా మరింత హానికరమని చెప్పారు. యువతకు హుక్కా వ్యసనమయ్యే

మిగతా.. 2లో

# పిలిప్పీన్స్‌లో విరిగిపడిన కొండచరియలు

- 54 మంది మృతి, 32 మందికి గాయాలు



**పిలిప్పీన్స్,ఫిబ్రవరి12(వెలుతురు):** కొండచరియలు విరిగిపడి 54 మంది మృతి చెందిన ఘటన పిలిప్పీన్స్ లో జరిగింది. పిలిప్పీన్స్ లోని డావో ప్రావిన్సు మాకో టౌన్ లో బంగారు గని సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాద ఘటనలో 54 మంది మృతి చెందారు. మరో 32 మంది గాయపడ్డారు. కొండచరియలు విరిగిపడటంతో.. ఇళ్లు, వాహనాలు వాటికింద కూరుకుపోయాయి.

మిగతా.. 2లో

# దేశానికి సేవచేయడమే ముఖ్యం

- ఏ ఉద్యోగం చేస్తున్నామన్నది కాదు
- మా ప్రభుత్వంలో పారదర్శకంగా నియామకాల ప్రక్రియ
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(వెలుతురు):** నియామకాల ప్రక్రియను తమ ప్రభుత్వం పారదర్శకంగా మార్చిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం ఆయన 'రోజ్‌గార్ మేళా' కింద ఉద్యోగాలు పొందిన లక్షమందికిపైగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందించి మాట్లాడారు. తమ ప్రభుత్వం నియామక ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేస్తోందని పీఎం మోదీ అన్నారు. ప్రతి ఒక్క అభ్యర్థి తన సామర్థ్యం ప్రదర్శించేలా సమాన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఉద్యోగానికి అభ్యర్థి దరఖాస్తు చేసుకొన్నప్పటి నుంచి అపాయింట్‌మెంట్ లేఖను అందుకొనే వరకూ ఉన్న సమయాన్నిపూర్తిగా కుదించామన్నారు. గత ప్రభుత్వాలు నియామక ప్రక్రియల్లో జాప్యం చేసేవారన్నారు. దీంతో అవి సుదీర్ఘంగా సాగేవికావన్నారు. ఉద్యోగాల నియామకం సమయం సుదీర్ఘంగా ఉండడం వల్ల లంచాల వసూళ్లు వంటివి జోరుగా చోటు చేసుకొనేవని పీఎం మోదీ అన్నారు. తమ ప్రభుత్వం నియామకాలను పారదర్శకంగా చేపడుతోందన్నారు. దేశానికి యువత సేవ చేసేలా 2014 నుంచి వారికి సహకరించాలని తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నాని మోదీ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 'వికసిత్ భారత్' ప్రయాణంలో ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగిదీ కీలక పాత్రేనని

మిగతా.. 2లో



# భారత మాజీ నౌకాధికారులకు విముక్తి

(మొదటి పేజీ తరువాయి)
చేయడాన్ని భారత ప్రభుత్వం స్వాగతించింది. ఏడుగురు ఇప్పటికే స్వదేశానికి తిరిగి వచ్చారు. వీరి విడుదలకు వీలుగా 'ఎమిర్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ ఖతార్' తీసుకున్న నిర్ణయాన్ని మేము అభినందిస్తున్నాం అని విదేశాంగ శాఖ సోమవారం ప్రకటన విడుదల చేసింది. గూఢచర్యం ఆరోపణల కింద ఎనిమిది మంది భారత నౌకాదళ మాజీ సిబ్బందిని 2022లో ఖతార్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో కెప్టెన్లు సౌరభ్ వశిష్ట్, నవతేజ్ గిల్, కమాండర్లు బీరేంద్ర కుమార్ వర్మ, పూర్ణేందు తివారీ, సుగుణాకర్ పాకాల, సంజీవ్ గుప్తా, అమిత్ నాగ్‌పాల్, సెయిలర్ రాగేశ్ ఉన్నారు. వీరిలో సుగుణాకర్ విశాఖ వాసి. అక్కడి ప్రాథమిక కోర్టు రెండు మూడుసార్లు మాత్రమే విచారణ జరిపి మరణ శిక్షను ఖరారు చేసింది. దీన్ని రద్దు చేయించేందుకు భారత ప్రభుత్వం దౌత్యపరంగా తీవ్ర ప్రయత్నాలు చేసింది. దీంతో అప్పీలు చేసుకోవడానికి అక్కడి కోర్టు అనుమతించింది. ఎట్టకేలకు పూర్తి విచారణ జరిపిన న్యాయస్థానం మరణ దండనను జైలు శిక్షగా మారుస్తూ 2023 డిసెంబర్ 28న తీర్పునిచ్చింది. దీన్ని కూడా అప్పీలు చేసుకునేందుకు 60 రోజుల గడువిచ్చింది. దీంతో అందుబాటులో ఉన్న అన్ని న్యాయమార్గాలను వినియోగించుకున్న మన విదేశాంగ శాఖ వారి విడుదలకు విశేష కృషి చేసింది. అవన్నీ ఫలించి ఈరోజు వారు స్వదేశానికి చేరుకోవటంతో భారత్‌కు దౌత్యపరంగా గొప్ప విజయం లభించినట్లయింది. భారత ప్రభుత్వం నిరంతర ప్రయత్నాలు, ప్రత్యేకంగా ప్రధాని మోదీ చొరవ వల్లే తమ విడుదల సాధ్యమైందని ఢిల్లీకి చేరుకున్న నేవీ మాజీ అధికారులు అన్నారు. సోమవారం తెల్లవారుజామున విమానా శ్రయానికి చేరుకున్న వారు 'భారత్ మాతా కీ జై' నినాదాలు చేశారు. 'ఎట్టకేలకు క్షేమంగా ఇంటికి వచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఆయన వ్యక్తిగత జోక్యం లేకుంటే ఇది సాధ్యమయ్యేది కాదు. ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీకి కూడా నా కృతజ్ఞతలు' అని ఓ అధికారి అన్నారు. 'మోదీ జోక్యం చేసుకొని ఖతార్ ప్రభుత్వంతో ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం వల్లే మేం ఈరోజు మీ ముందున్నాం. ప్రధానికి, ఖతార్ ఎమిర్‌కు కృతజ్ఞతలు తెలియజేయడానికి నా దగ్గర మాటల్లేవు. వారిద్దరి మధ్య ఉన్న సత్సంబంధాలే మా విడుదలకు దారితీశాయని ఢిల్లీకి చేరుకున్న నావికాదళ మరో మాజీ అధికారి అన్నారు. గల్ఫ్ దేశమైన ఖతార్‌లో లక్షల సంఖ్యలో భారతీయులు వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్నారు. భారత్ పెద్ద ఎత్తున ఎల్ఎన్‌జీని అక్కడి నుంచే దిగుమతి చేసుకుంటోంది. దోహాకు గణనీయంగా ఎగుమతులు చేసే దేశాల్లో భారత్ ఒకటి. ఉగ్రవాదానికి ఊతమిస్తోందనే ఆరోపణలపై.. గతంలో సౌదీ, యూఏఈ, బహ్రెయిన్, ఈజిప్ట్ దేశాలు ఖతార్‌కు దారితీసే జల, వాయు, భూమార్గాలను దిగ్బంధించాయి. ఆ కష్ట సమయంలో కూడా మనదేశం నిర్మాణ సామాగ్రి, ఆహార సరఫరాలో దోహాకు లోటు చేయలేదు. ఇరుదేశాల మధ్య రక్షణ సహకార రంగ ఒప్పందాలున్నాయి.

## ఉద్యోగ నియామక
# పరీక్షల వయోపరిమితి పెంపు

**46 ఏళ్ల వరకు ఉద్యోగాలకు దరఖాస్తుకు అవకాశం**

హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు): ఉద్యోగ నియామక పరీక్షల వయోపరిమితి పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. 46 ఏళ్ల వరకు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే విధంగా వయో పరిమితి సడలింపుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా.. వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచి త్వరలోనే టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 నిర్వహిస్తామని శాసనసభలో ప్రకటించారు. కొన్ని నిబంధనల కారణంగా టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన ఆలస్యమైందని.. త్వరలోనే గ్రూప్-1 నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలో తాజాగా వయో పరిమితి 46 ఏళ్లకు పెంచాలని తీసుకున్న నిర్ణయంతో జీవో విడుదల చేశారు. టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే పూర్తి చేయగా.. సుప్రీంకోర్టులో కేసు కొంత వరకు అడ్డంకిగా మారింది. దీంతో తాజాగా ఆ కేసును ప్రభుత్వం ఉపసంహరించుకునేందుకు సిద్ధమవ్వడంతో.. గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలకు లైన్ క్లియరైంది. పేపర్ లీకేజీతో మొదటి సారి గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దయ్యగా.. రెండోసారి నిర్వహించిన ప్రిలిమినరీకి అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోకపోవడంతో అక్రమాలకు అవకాశం ఉండటంతో పాటు ఓఎంఆర్ షీట్ల సంఖ్యలోనూ తేడాలున్నాయని అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టు ఆ పరీక్షను రద్దు చేయగా.. గత ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్లింది. తాజాగా ప్రభుత్వం ఈ కేసును ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకుంది. అప్పట్లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం 503 పోస్టులతో.. మరో 60 పోస్టులను కలిపి మొత్తం 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇవ్వడంలో ఆ అప్పీల్ అడ్డంకిగా మారింది. దీంతో ఈ నెల 19న ఇదే అంశంపై సుప్రీంకోర్టులో అప్పీల్‌పై విచారణ జరగనుంది. కొత్త సర్కారు ఇప్పటికే ఆ అప్పీల్‌ను విత్‌డ్రా చేసుకుంటామని పేర్కొంటూ పిటిషన్ వేసింది. ఈ నెల 19న పిటిషన్ విత్‌డ్రాకు కోర్టు అంగీకరిస్తే.. ఆ వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల కేసు
# విచారణ వాయిదా..!

హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు): గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా సిఫారసు చేస్తూ గవర్నర్‌కు నామినేట్ చేసింది. అయితే, ఆ ప్రతిపాదనలను గవర్నర్ తిరస్కరించిన విషయం విధితమే. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండ రామ్, అమీర్ అలీఖాన్‌లను నామినేట్ చేయగా.. గవర్నర్ ఆమోదించారు. అయితే, దాసో శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణ ఇద్దరు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ నాయకులను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేశారంటూ గత ప్రభుత్వం ప్రతిపాదనలను గవర్నర్ తిరస్కరించారు. అప్పటి ప్రభుత్వం ఆర్టికల్ 171 ప్రకారం తమను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిందని.. దాన్ని తిరస్కరించే హక్కు గవర్నర్ లేదని వాదించారు. ఆ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా.. ఈలోపే కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించడం, గవర్నర్ ఆమోదం తెలపడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ మరోసారి హైకోర్టు తలుపుతట్టారు. పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా హైకోర్టులో సోమవారం వాదనలు కొనసాగాయి. కోదండరాం, అమీర్ అలీఖాన్ వాదనలు వినిపించగా.. హైకోర్టు విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది.

# హుక్కాపై నిషేధం..

(మొదటి పేజీ తరువాయి)
అవకాశం ఉందన్నారు. హుక్కా అనేది సిగరెట్లతో పోల్చితే వెయ్యి రెట్లు హానికరం. ఒక సిగరెట్‌తో పోల్చితే, ఒక హుక్కా సెషన్‌లో దాదాపు 125 రెట్లు పొగ, 25 రెట్లు తారు , 2.5 రెట్లు నికోటిన్, 10 రెట్లు కార్బన్ మోనాక్సైడ్ విడుదలవుతుంది. ఒక్కసారి హుక్కాకు అలవాటు అయితే.. యువత దానికి బానిసలవుతారు. ఈ పోకడ ఇటీవల కాలంలో బాగా పెరిగింది. ఈ క్రమంలోనే తెలంగాణలోని యువత, ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ సర్కార్ హుక్కాను.. హుక్కా సెంటర్లను శాశ్వతంగా బ్యాన్ చేస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. హుక్కా నిషేధం బిల్లుపై సభలో ఎలాంటి చర్చ లేకుండానే అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఈ బిల్లు రాకతో.. ఇక నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హుక్కా సెంటర్లు క్లోజ్ అవ్వనున్నాయి. హుక్కా నిషేధం వెంటనే అమల్లోకి వస్తుంది. హుక్కాకు సంబంధించిన ఉత్పత్తులను కూడా అమ్మటం, కొనటం నేరంగా పరిగణించబడుతుంది. నాలుగోరోజు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాక కీలక బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది.తెలంగాణలో హుక్కా కేంద్రాలను నిషేధించే సవరణ బిల్లును సీఎం రేవంత్ రెడ్డి తరపున మంత్రి శ్రీధర్ బాబు బిల్లు ప్రవేశ పెట్టగా సభ ఆమోదం తెలిపింది. బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు సభకు మంత్రి శ్రీధర్ బాబు దన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ హుక్కా సెంటర్లపై నిషేదం అవసరమని అన్నారు. యువత ధూమపానానికి వ్యసనమయ్యే అవకాశం ఉందన్నారు. పొగకంటే హుక్కా మరింత హానికరమని చెప్పారు. అంతకుముందు దివగంత సభ్యులకు శాసనసభలో సంతాపం తెలిపారు. ఫిబ్రవరి 4న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనే హుక్కా నిషేధంపై నిర్ణయం తీసుకున్నా అధికారికంగా ప్రకటించలేదు. హుక్కా అనేది సిగరెట్లతో పోల్చితే వెయ్యి రెట్లు హానికరం.. ఒక్కసారి హుక్కాకు అలవాటు అయితే.. యువత బానిసలుగా మారిపోతారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రంలోని యువత, ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం. హుక్కాను.. హుక్కా సెంటర్లను శాశ్వతంగా నిషేధం విధిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టింది. హుక్కా నిషేధంపై బిల్లును సభలో ఎలాంటి చర్చ లేకుండానే అన్ని పార్టీలు ఒకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. ఈ బిల్లు రాకతో.. ఇక నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హుక్కా సెంటర్లు మూతపడనున్నాయి. హుక్కా నిషేధం అమల్లోకి వస్తుంది. హుక్కాకు సంబంధించిన ఎలాంటి ఉత్పత్తులను అమ్మటం, కొనటం నేరం.
సిగరెట్, పొగాకు సంబంధిత ఉత్పత్తులు, వినియోగానికి సంబంధించి యాడ్స్.. అంటే ప్రకటనలను కూడా తెలంగాణ రాష్ట్రంలో నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఈ మేరకు సోమవారం అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్ రెడ్డి తరపున మంత్రి శ్రీధర్ బాబు బిల్లును ప్రవేశపెట్టగా ఎలాంటి చర్చ లేకుండా సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించినందుకు తోటి సభ్యులకు మంత్రి శ్రీధర్ బాబు దన్యవాదాలు తెలిపారు. యువత ధూమపానానికి దూరంగా ఉండాలని ఇందుకు దూమపానం, పొగాకు సంబంధించి ఎలాంటి యాడ్స్ ను ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు నాలుగో రోజు ప్రారంభమయ్యాయి. అసెంబ్లీలో సోమవారం హుక్కా సెంటర్లపై నిషేదం విధిస్తూ బిల్లును ఆమోదించారు. పొగ కంటే హుక్కా మరింత హానికరమని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

# పిలిప్పీన్స్‌లో విరిగిపడిన కొండచరియలు

(మొదటి పేజీ తరువాయి)
గతవారంలో జరిగిన ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య రోజురోజుకూ పెరిగితోంది.ఘటనా ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, శిథిలాలను తొలగించే కొద్దీ మృతదేహాల సంఖ్య పెరుగుతున్నట్లు డావో ప్రావిన్సు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 300 మంది సిబ్బందితో సహాయక చర్యలు చేపడుతున్నా.. భారీ వర్షాలు, బురద కారణంగా రెస్క్యూ పనులకు ఆటంకం కలుగుతోందని పేర్కొంది. మళ్లీ కొండ చరియలు విరిగిపడే అవకాశాలు ఉండటంతో.. సహాయక సిబ్బంది ఆచితూచి వ్యవహరించాల్సి వస్తుందని తెలిపింది. ఈ ప్రమాదంలో మరో 63 మంది ఆచూకీ ఇంతవరకూ తెలియలేదని, వారిలో ఎవరూ బతికే అవకాశాలు లేవని అధికారులు చెబుతున్నారు.

# కృష్ణా ప్రాజెక్టులు కేంద్రానికి అప్పగించం..

(మొదటి పేజీ తరువాయి)
ఉద్యమకారుడిగా పేర్కొన్నారు. ఆయనకు ప్రతిపక్ష నాయకుడు చేస్తే బాగుంటుందన్నారు. 551 టీఎంసీల నీళ్లు తెలంగాణకు రావాలని.. ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారని.. ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ అనుకూలమా కాదా చెప్పాలి? అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువదీరిన తర్వాత ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం కోసం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారు. ఆ సమయంలో కేసీఆర్ తుంటికి శస్త్ర చికిత్స జరిగి విశ్రాంతి తీసుకున్నారు. అందువల్లే ఎమ్మెల్యేగా కూడా ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. ఇటీవల అసెంబ్లీకి స్పీకర్ గడ్డ ప్రసాద్ కుమార్ ఛాంబర్‌లో శాసనసభ్యుడిగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేశారు. ఇక ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హెూదాలో సభకు వస్తారని అందరూ భావించారు. కానీ రాలేదు. ఆ తర్వాత గవర్నర్ ప్రసంగం రోజు కూడా గులాబీ బాస్ అసెంబ్లీవైపు చూడలేదు. బీఏసీ మీటింగ్ కేసీఆర్, కడియం శ్రీహరి పేర్లను బీఆర్ఎస్ ఇచ్చింది. కానీ బీఆర్ఎస్ అధినేత బీఏసీ సమావేశానికి డుమ్మాకొట్టారు. హరీశ్ రావును పంపించారు. కానీ పేరు లేకపోవడం హరీష్ రావును బీఏసీ మీటింగ్ నుంచి బయటకు పంపారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజైన కేసీఆర్ శాసన సభకు వస్తారని భావించారు. అప్పుడు కూడా కేసీఆర్ గైర్హాజరయ్యారు. బడ్జెట్ పై జరిగిన చర్చలోనూ గులాబీ బాస్ పాల్గొనలేదు. ఇప్పుడు కృష్ణా జలాలపై కీలమమైన చర్చ జరుగుతున్న సమయంలో ఆయన రాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకే స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి.. కేసీఆర్ రాకపోవడాన్ని తప్పుపట్టారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేఆర్ఎంబీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణా జలాలు తెలంగాణకు ప్రధాన ఆధారమని.. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నాడు విఫలమైందని ధ్వజమెత్తారు. కృష్ణాజలాలపై గత ప్రభుత్వం సరైన వాదనలను వినిపించలేదన్నారు. ఏపీ ప్రభుత్వం అదనపు నీటిని తరలిస్తున్నా మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు. ఇన్ ఫ్లో తగ్గి.. డైవర్షన్ పెరిగిందన్నారు. పాలమూరు- రంగారెడ్డికి రూ.27,500 కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేదని విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో 1200 టీఎంసీలు డైవర్ట్ అయినట్లు పేర్కొన్నారు. 811 టీఎంసీలలో కేవలం 299 టీఎంసీలనే క్లెయిమ్ చేశారని.. అలాంటి బీఆర్ఎస్ 50 శాతం కావాలని మాట్లాడటం వింతగా ఉందన్నారు. చేసిందంతా చేసి.. నల్లగొండలో సభ పెడితే ఏం లాభం ఉంటుందని ప్రశ్నించారు.నీటి పంపకాల విషయంలో గత ప్రభుత్వం ఎలాంటి అబ్జెక్షన్ చెప్పకుండా మిన్నకుండిపోయిందన్నారు. ఏపీ సీఎం జగన్ కు.. నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ కృష్ణా జలాలను ధారపోశారని ఘాటు విమర్శలు చేశారు. ఇకపై సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా కృష్ణాజలాలను తరలించే ప్రసక్తే లేదన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పే ప్రసక్తే లేదన్నారు. కృష్ణాజలాలపై వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. నదీజలాల పంపకాల్లో అన్యాయం జరిగిందనే ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడితే.. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా అన్యాయమే జరుగుతుందని మంత్రి ఉత్తమ్ వాపోయారు. బీఆర్ఎస్ వచ్చాక కృష్ణాజలాల్లో మరింత అన్యాయం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో.. హరీష్ రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీకి వెళ్లి 299 టీఎంసీలు పంపకానికి ఒప్పుకుని.. నీటి వాటాలో తెలంగాణకు శాశ్వత నష్టం చేశారని దుయ్యబట్టారు. కృష్ణాజలాలపై ఏపీ సీఎం జగన్, కేసీఆర్ ఏకాంత చర్చలు జరిపారని.. ఈ విషయాన్ని స్వయంగా జగనే అసెంబ్లీలో చెప్పారన్నారు.
శ్రీశైలం నుంచి రోజుకు 3 టీఎంసీల నీరు ఏపీకి వెళ్తుందని, దీనిపై ఎప్పుడైనా కేసీఆర్ నోరువిప్పి మాట్లాడారా ? అని ప్రశ్నించారు. నాడు బీఆర్ఎస్ చేసిన ఘనకార్యంతో.. నేడు నాగార్జునసాగర్ డ్యాం ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు.

# అసెంబ్లీ సాక్షిగా... అవాస్తవాలు

(మొదటి పేజీ తరువాయి)
మాడిఫికేషన్ చేయాలని రాశారు. ఇక మూడవ అవాస్తవం.. 16వ కేఆర్ఎంబీ సమావేశంలో చెప్పింది ఏమిటి. ఆపరేషన్ ప్రోటోకాల్ కాకుండా ఒప్పుకోం అని స్పష్టం చేశారు. నాలుగవ అవాస్తవం రెండో అపెక్స్ కౌన్సిల్‌లో నీటి వాటా వ్యతిరేకించడం జరిగింది. ఈ విషయం పై 27 లెటర్స్ రాయడం జరిగిందని తెలిపారు హరీశ్ రావు. కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్‌పై వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.నల్లగొండలో బీఆర్ఎస్ సభ పెట్టడంతోనే.. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పజెప్పడంపై కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సత్యదూరమైన ప్రజెం టేషన్ ఇచ్చారని విమర్శించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి కలుగజేసుకుని మాట్లాడుతూ.. ఏపీ సీఎం జగన్ స్టేట్‌మెంట్ విన్నతర్వాత కేసీఆర్ తల ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు నల్లగొండ ప్రజలు చెప్పుతో కొట్టినట్లు సమాధానమిచ్చారని చెప్పారు. దీంతో మంత్రి వ్యాఖ్యలపై హరీశ్ రావు అభ్యంతరం తెలిపారు. పదేండ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తిపై అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాహుల్ గాంధీని చెప్పుతో కొడతామని తాము అనలేమా అని ప్రశ్నించారు. అమేథీలో రాహుల్‌ని కూడా ప్రజలు చెప్పుతో కొట్టినట్టేనా అని నిలదీశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సభాపతి ఏకపక్షంగా మంత్రి అవకాశం ఇవ్వడం తగదని విమర్శించారు. మంత్రి క్షమాపణలు చెబితేనే తాను మాట్లాడుతానని పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ రికార్డుల నుంచి మంత్రి వ్యాఖ్యలను తొలగిస్తానని ప్రకటించడంతో హరీశ్ రావు తన ప్రసంగాన్ని కొనసాగించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతు న్నాయి. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ మీడి యాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లా డుతూ.. ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ ప్రెజెంటేషన్ మొత్తం ఇంగ్లీష్ లోనే ఉందని, ఆయన తెలుగులో మాట్లాడకుండా.. ఇంగ్లీష్ మాట్లాడు తున్నారని, ఆయన మాట్లడేది మాకే అర్థం కావడం లేదు, తెలంగాణ ప్రజలకు ఏం అర్థంమౌతుందని ఆయన ప్రశ్నించారు.ఇదిలా ఉంటే.. కృష్ణా నది ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రానికి అప్పగించబోమంటూ తెలంగాణ అసెంబ్లీలో సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్మానాన్ని ప్రవేశపెట్టడంపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ఆసక్తికరంగా స్పందించారు. బీఆర్ఎస్ తలపెట్టిన 'ఛలో నల్గొండ ఎఫెక్ట్!' కారణంగా అధికార పార్టీ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతోందని వ్యాఖ్యానించారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సాధించిన తొలి విజయం ఇదని ఆయన అభివర్ణించారు. కృష్ణా నది ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రానికి అప్పగించడానికి నిరసనగా రేపు (మంగళవారం) నల్గొండలో బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన 'ఛలో నల్గొండ' ఒత్తిడి కారణంగానే కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతోందన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నేడు తీర్మానాన్ని ప్రవేశపెట్టనుందని కేటీఆర్ ప్రస్తావించారు. ఈ ట్వీట్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఫొటోని కేటీఆర్ జోడించారు.

# నేడు మేడిగడ్డకు ప్రజాప్రతినిధులు

(మొదటి పేజీ తరువాయి)
ఎమ్మెల్యేలు నేరుగా పరిశీలించనున్నారు. దాదాపు 80 మంది ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి ఆయన మంగళవారం మేడిగడ్డ బ్యారేజీ వద్దకు రానున్నారు. బ్యారేజీలో నిర్మాణ లోపాలు, కుంగుబాటుకు కారణాలను అధికారులు ఆయనకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నారు. ముఖ్యమంత్రి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు పెద్దఎత్తున రావడంతో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో మరింత అప్రమత్త మయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లోభాగంగా నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్ట్ దెబ్బతిన్న ప్రాంతాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించనున్నారు. మంగళ వారం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు కలిసి ఆయన స్వయంగా బ్యారేజీని పరిశీలించ నున్నారు. ప్రజల సమక్షంలోనే అధికారులు బ్యారేజీ దెబ్బతినడానికి కారణాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించనున్నారు. శాసనసభలో నీటిపారుదలశాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన ప్రభుత్వం... అందులో మేడిగడ్డ లోపాలను ప్రత్యేకంగా ఎత్తిచూపింది. నీటిపారుదల శాఖలో అవినీతి, అక్రమాలపై చర్చించనుంది.సభలో తాము చెప్పినవన్నీ నిజాలే అని నిరూపించేందుకే ఎమ్మెల్యేల బృందంతో సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ సందర్శించనున్నారు. కేవలం పేపర్ పై మాటలు చెప్పడం కాదని....తాము చేసిన ఆరోపణలను రుజువులతో సహా నిరూపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి గత సమావేశాల్లోనే సవాల్ విసిరారు. నీటిపారుదలశాఖపై జరిగే చర్చలో ప్రతిపక్షనేత కేసీఆర్ సైతం పాల్గొనాలని రేవంత్ రెడ్డి కోరారు. మేడిగడ్డ సందర్శనకు కేసీఆర్ తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అంతా రావాలని ఆయన రేవంత్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లతో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులంతా మేడిగడ్డ సంద ర్శనకు రానుండటంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. సరిహద్దు ప్రాంతం చత్తీస్ ఘడ్‌లో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉండటంతో మూడు అంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చే మార్గంలో కల్వ ర్టులు, రహదారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సీఎం హోదాలో తొలిసారి రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లాలో పర్యటిస్తుండటంతో పె÷-దదెఎత్తున అభిమానులు తరలివచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు అదనపు బలగాలను మోహరించారు. స్పెషల్ పోలీసులు అటవీప్రాంతంలోని గ్రామాలను జల్లెడపడుతున్నారు. మేడిగడ్డ సందర్శన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజాపాలన పేరిట సీఎం రేవంత్ రెడ్డి వారితో నేరుగా ముఖాముఖి నిర్వహించ నున్నారు. కేసీఆర్ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పై ఇప్పటికే విమర్శలు వచ్చాయి. అదంతా మేడిపండు చందంగా మారిందని తేలింది. కమీషన్ల కోసం నిర్మించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్రాజెక్ట్ లో భారీ లోపాలు బయటపడ్డాయి. అయితే వాటిని భూతద్దంలో చూపి ప్రజలను భయపెడుతున్నారని బిఆర్ఎస్ పార్టీ నేతలు మండిపడ్డారు. కనీసం ఇప్పటి వరకు టెక్నికల్ ఎంక్వైరీ కమిటీ ఎందుకు వేయలేదని వారు ప్రశ్నించారు. కేవలం ప్రాథమిక విచారణ ఆధారంగానే ప్రాజెక్టుపై రాజకీయం చేస్తూ దీన్ని పక్కన పెట్టే కుట్రలకు ప్రభుత్వం తెరలేపిందని ఆరోపించారు. కృష్ణానదిపై నిర్మించిన ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈనెల 13న నల్గొండలో బీఆర్ ఎస్ బహిరంగ సభ ఏర్పాటు చేసిన రోజే..కావాలని సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డపై దండయాత్రకు వెళ్తున్నారని వారు ఆరోపించారు.
ఇదిలావుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజాభవన్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. అసెంబ్లీలో ఇరిగేషన్‌పై శ్వేతపత్రం విడుదల నేపథ్యంలో ప్రజా ప్రతినిధుల సమావేశం ప్రత్యేకత సంతరించుకుంది. కృష్ణా జలాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ పవర్ పాయింట్ ప్రజంటేషన్ దాదాపు గంటకుపైగా జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజెంటేషన్ ద్వారా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మంత్రి ఉత్తమ్ వివరించారు.



ఉమ్మడి రాష్ట్రానికి కృష్ణ జలాల్లో వాటా శాతం ఎంత.. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ వాటా శాతం ఎంత ఉంది. గూగుల్ మ్యాప్ ద్వారా కృష్ణ పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల వివరాలను అధికారులు, మంత్రి ఉత్తమ్ వివరించారు. తెలంగాణలో కృష్ణ పరివాహక ప్రాంతం 68 శాతం ఉన్నా, రాష్ట్ర విభజన తర్వాత కేవలం 33 శాతం నీటి వాటాకు గత కేసీఆర్ ప్రభుత్వం ఎలా ఒప్పందం చేసుకుంది. శ్రీశైలం నుంచి గత పదేళ్లలో ఏపీ ప్రభుత్వం అనుమతులు లేకుండా చేపట్టిన ప్రాజెక్టు లను గూగుల్ మ్యాప్ ద్వారా మంత్రి ఉత్తమ్ వివరించారు.

# రాజ్యాంగ ఉల్లంఘన కాదు

(మొదటి పేజీ తరువాయి)
ప్రాధాన్యం ఇవ్వడానికి చాలా రాష్ట్రాలు ఉపముఖ్యమంత్రిని నియమించే పద్ధతిని అవలంబిస్తు న్నాయి. అయితే, అది కేవలం ఒక పేరు మాత్రమే. డిప్యూటీ సీఎంగా ఎవర్నైనా నియమించినా వారు కేబినెట్ మంత్రి హెూదా లోనే ఉంటారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వానికి ఉపముఖ్యమంత్రి మొట్టమొదటి, అత్యంత ముఖ్యమైన మంత్రిగా ఉంటారు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందకు రాదు" అని సీజేఐ ధర్మాసనం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రికి సహాయ సహకారాలు అందించేందుకు, సీనియర్లకు తగిన ప్రాధాన్యం కల్పించేందుకు చాలా రాష్ట్రాలు డిప్యూటీ సీఎంలను నియమిస్తుంటాయి. కొన్ని రాష్ట్రాల్లో ఒకరి కంటే ఎక్కువ ఉపముఖ్యమంత్రులు ఉన్న సందర్భాలున్నాయి. అయితే, వారికి కేబినెట్ మంత్రి హెూదాలోనే వేతనం, ఇతర సదుపాయాలు అందిస్తారు.

# దేశానికి సేవచేయడమే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)
మోదీ అన్నారు. నేడు కొత్తగా చేరుతున్న లక్షమంది ఉద్యోగులు మాకు నూతన శక్తిని అందిస్తారన్నారుత. వారు ఏ శాఖలో చేరారన్నది ముఖ్యం కాదు.. దేశానికి అంకిత భావంతో సేవ చేయడం కీలకమని మోదీ అన్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకొంటే ఈ పదేళ్లలో మేం 1.5 రెట్లు అదనంగా ఉద్యోగావకాశాలను కల్పించామని ప్రధాని తెలిపారు. యువతకు 10 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యంతో రోజ్ గార్ మేళా కార్యక్రమాన్ని ప్రధాని మోదీ అక్టోబర్ 2022లో ప్రారంభించారు. తాజాగా ఆయన 'కర్మయోగి భవన్'కు శంకుస్థాపన చేశారు. 'మిషన్ కర్మయోగి' కింద వివిధ వర్గాలను సమన్వయం చేసుకోవడానికి ఈ భవనాన్ని వినియోగించనున్నారు. సామర్థ్యాల పెంపునకు అవసరమైన సంకల్పాన్ని మిషన్ కర్మయోగి బలోపేతం చేస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రధాని తెలిపారు.

# రాహుల్ భారత్ జోడో న్యాయ యాత్ర షెడ్యూల్ మార్పు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(వెలుతురు): రాహుల్ భారత్ జోడో న్యాయ యాత్ర షెడ్యూల్ మార్పుకాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతోంది. ఈ నెల 16న ఉత్తరప్రదేశ్‌లోకి రాహుల్ యాత్ర ప్రవేశించనుంది. అయితే నెక్ట్స్ వీక్ నుంచి అక్కడ బోర్డు ఎగ్జామ్స్ ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదన్న ఆలోచనతో యాత్రను ముందుగానే ముగించాలని రాహుల్ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. యూపీలో ఫిబ్రవరి 22 నుంచి బోర్డు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 26 వరకు కొనసాగనున్న యాత్రను ఈ నెల 21కే ముగిసేలా రాహుల్ మార్పులు చేశారని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి అన్ను అవస్తీ ఓ ప్రకటనలో వెల్లడించారు.




## జ్యోతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు వివాహాలకు బియ్యం అందజేసారు

**సిద్దిపేట టౌన్ వెలుతురు ఫిబ్రవరి12:**
జ్యోతి స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో 8వ వార్డ్‌లోని నిరుపేద యువతి పెళ్లికి బియ్యం ఇవ్వడం జరిగింది. చిన్నకోడూరు మండల కేంద్రంలో జంగంపల్లి సత్తవ్వ సాయిలు గార్ల



రెండవ కుమార్తె ఆద్యశ్రీ అలియాస్ మౌనిక వివాహానికి క్వింటాల్ బియ్యం ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా పాండు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు స్వచ్ఛందసంస్థ అండగా ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి స్వచ్ఛంద సేవా సమితి ఫౌండర్ మరియు చైర్మన్ మందపాడు రూరల్ మండల ప్రెసిడెంట్ మచ్చారి సురేష్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ యాదవ్ మంద వనజ బాలరాజు హెడ్ కానిస్టేబుల్ నరహరి గుడిమల్ల సత్తయ్య మరియు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## బిజెపి నూతన మండల అధ్యక్షులకు శుభాకాంక్షలు చెప్పిన సంగప్ప

**నారాయణఖేడ్ వెలుతురు ఫిబ్రవరి 12:**
నారాయణఖేడ్ నియోజకవర్గం లో బిజెపి 8 మండలాలు మరియు ఖేడ్ టౌన్ అధ్యక్షులు గా నియమితులైన వారికి బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జెనవాడే సంగప్ప శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు చెప్పారు.
కాంగ్టీ మండల అధ్యక్షులుగా సంతోష్ రెడ్డి, సిర్గాపూర్ మండల అధ్యక్షులుగా గోపాల్ రెడ్డి, కల్హేర్ మండల అధ్యక్షుడుగా అనిల్ రెడ్డి, నారాయణఖేడ్ రూరల్ మండల





అధ్యక్షుడుగా దశరథ్, మున్సిపాలిటీ అధ్యక్షుడుగా రాజశేఖర్ గౌడ్, మనూర్ మండల అధ్యక్షుడిగా ఈశ్వరప్ప, నాగిల్ గిద్ద మండల అధ్యక్షుడిగా రాజశేఖర్ బిరాధర్, నిజాంపేట్ మండల అధ్యక్షుడిగా పొట్టి కృష్ణ ను బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఇటీవల నియమించారు. సంగప్ప ఇవాళ నారాయణఖేడ్లో నూతన మండల అధ్యక్షులతో సమావేశమై ఖేడ్లో పార్టీ బలోపేతంపై చర్చించారు. నారాయణఖేడ్ కు ఇప్పుడు చాకు లాంటి మండల అధ్యక్షులు ఉన్నారని, వీరి నాయకత్వంలో పార్టీ క్షేత్రస్థాయి నుంచి బలపడటం ఖాయం అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మండలాధ్యక్షుల నేతృత్వంలో లోక్ సభ ఎన్నికల్లో షెడ్ నుంచి భారీ మెజార్టీ అందిస్తామని సంగప్ప చెప్పారు. ఈ సమావేశంలో నిజాంపేట మాజీ మండల అధ్యక్షుడు కాశీనాథ్, పార్టీ సీనియర్ నాయకులు పట్నం మాణిక్, శంకర్ పాతిల్, శ్రవణ్, సాయి, సతీష్, ఏక్ నాథ్, సంతోష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## గుడాపూర్ వాసికి ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ ప్రధానం

**మునుగోడు వెలుతురు ఫిబ్రవరి 12:**
గుడాపూర్ గ్రామానికి చెందిన అక్కెనపల్లి నర్సింహ్మా, లింగమ్మ గార్ల కుమారుడు అయిన స్వామి 2019 వ సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ నిర్వహించిన AP రీసెర్చ్ సెట్ ప్రవేశ



పరీక్ష ద్వారా కెమిస్ట్రీ విభాగంలో Ph.D ప్రవేశం పొంది కఠోర పరిశోధనల అనంతరం 2023 ఆగష్టు నెలలో థీసిస్ సమర్పించబడింది. వీరి పరిశోధనలు డా".కె . సురేష్ బాబు మరియు ప్రొఫ్ . కె . బసవయ్య గార్ల పర్యవేక్షణలో జరిగింది. "మెటల్ ఆర్గానిక్ ఫ్రేంవర్క్బ బేస్డ్ మెటీరియల్స్ ఫర్ హైడ్రోజన్ జనరేషన్ అండ్ హైడ్రోజినేషన్ రియాక్షన్స్ " అను థీసిస్ సమర్పణ ఫలితాల అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫ్ . పి . జి . వి . డి . ప్రసాద్ రెడ్డి గారి చేతుల మీదుగా డాక్టరేట్ ప్రధానం చేయబడింది.

# బిఆర్ఎస్‌తో పొత్తు ఉండదు..

### వచ్చే ఎన్నికల్లో ఒంటరి పోరు
### బిజెపి కార్యదర్శి బండి సంజయ్ వెల్లడి

**కరీంనగర్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
తమకు ఎవరితోనూ పొత్తులు ఉండవని పొత్తులపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో ఒంటరిగా పోటీ చేస్తామని ఆయన అన్నారు. బిఆర్ఎస్తోఓ పొత్తులతో కలసి వెళతారన్న ప్రచారం జోరుగా సాగుతున్న వేళ ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ సింగిల్‌గానే పోటీ చేస్తుందని.. బీజేపీతో పొత్తు ఉంటుందని బీఆర్ఎస్ నేతలు సిగ్గు లేకుండా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే మూర్ఖకత్వపు పార్టీ తమది కాదన్నారు. ఒంటరిగా పోటీ చేస్తామని చెప్పుకునే దమ్ము బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. తెలంగాణలో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికలు రాగానే ప్రజలను మభ్యపెడుతున్నారని, ఎన్నికల్లో బీఆర్ఎస్‌ది మూడో స్థానమేనని, మూడో స్థానానికి వెళ్లే పార్టీతో పది స్థానాలు గెలిచే బీజేపీ పొత్తు పెట్టుకుంటుందా? అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కొత్త డ్రామాలు ఆడుతున్నాయని బండి సంజయ్ అన్నారు. ఇదిలావుంటే రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్లలో శ్రీ మార్కండేయ స్వామి వారి ఆలయం పవర్ ఫుల్ గా మారనుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. అయోధ్య శ్రీ రామ మందిరానికి ఎంతో మంది భక్తులు సహాయ సహకారాలు అందించారు.. అదేవిధంగా ఈ మార్కండేయ గుడికి కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శ్రీ శివభక్త మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామివారిని ఎంపీ బండి సంజయ్ దర్శించుకున్నారు. పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు, పద్మశాలి సంఘం నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి.. మొక్కులు చెల్లించుకున్నారు. సిరిసిల్ల పద్మశాలి నాయకుల ఆధ్వర్యంలో శ్రీ మార్కండేయ స్వామివారి ఉత్సవాలు, శోభాయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవాలయ నిర్మాణానికి భక్తులు అందరూ భాగస్వాములు అవ్వాలని కోరారు. గుడి నిర్మాణానికి తనవంతు సహాయం అందిస్తానన్నారు ఎంపీ బండి సంజయ్.




# అసెంబ్లీకి రాని కేసీఆర్ నల్గొండకు ఎలా వెళ్తారు..?

### అసెంబ్లీలో కృష్ణా జలాలపై చర్చ సందర్భంగా భట్టి

**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
అసెంబ్లీకి రాని వ్యక్తి.. మంగళవారం నల్గొండలో అసెంబ్లీకి వెళ్తావా అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం అసెంబ్లీలో కృష్ణా జలాలపై చర్చ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం చేసి పంపాలని కోరితే ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రాలేదని విమర్శించారు . అసెంబ్లీకి రాని వ్యక్తి రేపు బహిరంగ సభకు వెళ్తారా అంటూ నిలదీశారు. బీఆర్ఎస్ ఈఎన్‌సీ మురళీధరరావు తమకు అనుకూలంగా మాట్లాడారని ఆరోపించారు. పదవీ విరమణ చేసినా పదేళ్లపాటు బీఆర్ ఎస్ ప్రభుత్వాన్ని కొనసాగించారని విమర్శించారు. కృష్ణా జలాలపై చర్చ సందర్భంగా హరీశ్ రావు సభను తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రభుత్వంలో చాలా మంది బీఆర్ఎస్ ఏజెంట్లు ఉన్నారని వారిపై త్వరలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈఎన్సీ మురళీధరరావు చేత బీఆర్ఎస్ తమకు అనుకూలంగా మాట్లాడించిందని ఆయన ఆరోపించారు. రిటైర్ అయినప్పటికీ ఆయనను పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిందని విమర్శించారు.
ఆంధ్రప్రదేశ్‌లో రేయింబవళ్లు పనులు జరుగుతుంటే గత ప్రభుత్వం ప్రశ్నించలేదని అడిగారు. శ్రీశైలంలో ఫ్లడ్‌లైట్లు పెట్టి మరీ పనులు చేసిందని తెలిపారు. గోదావరి జలాలు, శ్రీశైలంలో మన భూభాగాలున్నాయని వాటి కోసం ఒప్పందాలు చేసుకున్నాం అనడం అర్థరహితం అన్నారు. తెలంగాణ నీళ్ల కోసమే పుట్టిందని, వాటి కోసమే పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. కనీసం ఇప్పుడైనా ఆ నీటిని సమర్థవంతంగా వాడుకోవడానికి ప్రయత్నం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం అడుగుతుంటే గతంలో జరిగినవి మళ్లీ గుర్తు చేసుకుని రాష్ట్రానికి అన్యాయం చేయకూడదని కోరారు.

# మేం పదవుల కోసం... పాకులాడే వాళ్లం కాదు

### "హరీశ్, కడియంలా మేము జీ హుజూర్ బ్యాచ్ కాదు
### హరీశ్‌ను మా పార్టీలోకి రమ్మంటున్నాం
### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
'మాజీ మంత్రి హరీశ్‌రావు.. రైట్ పర్సన్ ఇన్ రాంగ్ పార్టీ' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో చిట్‌చాట్‌గా ఆయన మాట్లాడారు. భారాసలో ఉన్నా హరీశ్‌కు ప్రయోజనం లేదని.. కాంగ్రెస్‌లోకి వస్తే తీసుకుంటామని చెప్పారు. ఇందుకు 25 మంది భారాస ఎమ్మెల్యేలతో పార్టీలోకి రావాలని షరతు పెట్టారు. అప్పుడు ఆయనకు దేవాదాయశాఖ ఇస్తామన్నారు. భారాస హయాంలో



చేసిన పాపాలను కడుక్కోవడానికి ఈ మంత్రి పదవి ఉపయోగపడుతుందని వ్యాఖ్యానించారు. "హరీశ్, కడియంలా మేము జీ హుజూర్ బ్యాచ్ కాదు. మేం పదవుల కోసం పాకులాడే వాళ్లం కాదు.. ప్రజల కోసం ఉండేవాళ్లం. ఉద్యమ సమయంలో పదవులను వదులుకున్న చరిత్ర మాది. భారాస చీప్ పాలిటిక్స్ మానుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో చీలిక తీసుకురావాలని చూస్తున్నారు. గతంలో మాకు ప్రతిపక్ష హోదా లేకుండా చేశారు. రాష్ట్రాన్ని కేసీఆర్ నాశనం చేశారు. ఇప్పుడు తెలంగాణను కాపాడుకునే బాధ్యత మాపై పడింది. భారాస నల్గొండ సభకు జనం వచ్చే అవకాశం లేదు.. అట్టర్ ఫ్లాప్ అవుతుంది. కేటీఆర్‌కు దమ్ముంటే పార్టీని నడపాలి. హరీశ్‌ను మా పార్టీలోకి రమ్మంటున్నాం.. ఆయన కష్టపడతారు.. అక్కడ భవిష్యత్ లేదు" అని చెప్పారు.

# ఒకే గొడుగు కిందికి క్లైమెట్, విద్యా రంగాలు

### దుబాయ్ కేర్స్ సంస్థతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ
### విద్యా రంగంలో మార్పులకోసం కసరత్తు

**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును దుబాయ్ కేర్స్ సంస్థ సీఈఓ, వైస్ చైర్మన్ తారిఖ్ అల్ గర్గ్ సోమవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. భారత విద్యా రంగానికి సంబంధించి కీలక చర్చలు జరిపారు. ప్రపంచ విద్యా వ్యవస్థ పురోగమనానికి తాము చేపడుతున్న చర్యల గురించి తారిఖ్ గర్గ్ రాష్ట్ర మంత్రికి వివరించారు. ఆయా దేశాల్లో విద్యాభివృద్ధి కోసం తమ సంస్థ సహాయ సహకారాలు అందిస్తోందని, వివిధ దేశాల ప్రభుత్వాలతో భాగస్వామ్యమయ్యి పనిచేస్తున్నామని తెలియజేశారు.మొదటి దశలో భాగంగా భారత్‌తో సహా 10 దేశాల్లో విద్యా రంగం వేగవంతంగా పురోగమించడం కోసం గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ యాక్సిలరేటర్ (జీఈఎస్ఈ)ను మొదలుపెట్టామని తారిఖ్ గర్గ్ వివరించారు.



విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి సాధికారత కల్పించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే, కాప్28 క్లైమెట్ ఎజెండాలో విద్యా ప్రాముఖ్యతను కేంద్ర స్థానంలో చేర్పించామని, క్లైమెట్ మరియు విద్యా రంగాలను ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలియజేశారు.
ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ. విద్యా రంగం మార్పుల కోసం పని చేస్తున్న దుబాయ్ కేర్స్ సంస్థ సీఈఓను కలుసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతల గురించి వివరించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తే ప్రభుత్వపరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.

# కృష్ణాపై విజయం సాధించాం : కెటిఆర్ ట్విట్టర్ ఆనందం

**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
కృష్ణా నది ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రానికి అప్పగించ బోమంటూ సోమవారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్న వేళ మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ఆసక్తికరంగా స్పందించారు. బీఆర్ఎస్ తలపెట్టిన 'ఛలో నల్గొండ ఎఫెక్ట్!' కారణంగా అధికార పార్టీ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతోందని వ్యాఖ్యానించారు.
ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సాధించిన తొలి విజయం ఇదని ఆయన అభివర్ణించారు. కృష్ణా నది ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రానికి అప్పగించడానికి నిరసనగా రేపు (మంగళవారం) నల్గొండలో బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన 'ఛలో నల్గొండ' ఒత్తిడి కారణంగానే కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్ట బోతోందన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నేడు తీర్మానాన్ని ప్రవేశపెట్టనుందని కేటీఆర్ ప్రస్తావించారు. ఈ ట్వీట్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఫొటోని కేటీఆర్ జోడించారు.



# సంపాదకీయం..

## విభజన సమస్యలకు చెల్లుచీటి!

ఎన్నికలకు మరెంతో సమయం లేదు. గత పదేళ్లుగా విబజన హామీలు గాలికి పోయాయి. ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. కనీసం అభివృద్ధి పనులను ప్రారంభించినా పరిస్థితి వేరుగా ఉండేది. తెలంగాణతో పోలిస్తే ఎపి ఓ రకంగా బాగా నష్టపోయింది. అక్కడ పదేళ్లుగా ఇద్దు ముఖ్యమంత్రులు మారినా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. కేంద్రాన్ని నిలదీసే స్థితిలో వైఎస్ జగన్ లేరు. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన షర్మిల విభజన హామీలపై గట్టిగానే నిలదీస్తున్నారు. ఎపి విభజన జరిగాక ఇరు రాష్ట్రాలకు కేంద్రం నిర్మాణాత్మక సహకారం అందించలేక పోయింది. ఎపి రాజధానిపై కేంద్రం చేతులెత్తే సింది. విశాఖ స్టీల్ ఆందోళనలను పట్టించుకోలేదు. కడప ఉక్కును పక్కన పెట్టారు. బయ్యారం ఉక్కు ఊసే లేదు. ఇక ఏంచేశారో చెప్పడానికి బిజెపి వద్ద ఏమీ లేదు. ఆత్మనిర్భరభారత్ పేరుతో మోడీ పదేపదే మాటలు వల్లిస్తున్నా ప్రయోజనం శూన్యం అని తేలింది. కనీసం ఉభయరాష్ట్రాల మధ్య సమస్యలను పట్టించుకోలేదు. ఇప్పటికే కృష్ణా, గోదావరి జలవివాదాన్ని కూడా సత్వరంగా పరిష్కరించాలన్న ఆలోచన ప్రయత్నం చేయడంలేదు. కెఆర్ఎంబికి ప్రాజెక్టులను అప్పగించుకునే ప్రయత్నం చేస్తోంది. నీటి వాటాలను సమంగా పంచితే వివాదాలు రావు. ఈ విషయంలో కూడా కేంద్రం పెద్దన్న పాత్ర పోషిండం లేదు. అలాగే విభజన హామీలపై మాత్రం కేంద్రం నోరు మెదపడం లేదు. దీనిపై ఈ రెండు రాష్ట్రాలు నేరుగానే పోరాడాల్సిన అవసరం వచ్చింది. సమస్యలను నాన్చకుండా త్వరగా పోరాడితేనే మంచిది. ఎన్నికల ముందు అయినా విబజన సమస్యలపై ఇరు రాష్ట్రాల నేతలు పోరాడాలి. ఎపిలో మాత్రం నేతలు నిలదీయలేక పోతున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కేంద్రంతో సయోధ్యతో ఉన్నా కూడా లాభం చేకూరడంలేదు. స్థానిక బిజెపి నేతలు కూడా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సమస్యలు ప్రస్తావించి సాధించే తెలివిని ప్రదర్శించడంలేదు. అక్కడ వైసిపిని, ఇక్కడ కాంగ్రెస్‌ను విమర్శించడంలో స్థానిక బిజెపి నేతలు బిజీగా ఉన్నారు. దూకుడు రాజకీయాలతో, వారు చేస్తున్న విన్యాసాలు అభాసుపాలు చేస్తున్నాయి. మొత్తంగా విభజన వల్ల తెలంగాణ కొంత పురోగమిస్తున్నా ఎపిలో మాత్రం అలాంటి ఛాయలు కానరావడం లేదు. నాయకత్వ లోపం కూడా కారణంగా భావించాలి. దీనికి తోడు ఎపిలో ఇతర ప్రాంతీయ పార్టీలు కూడా పెద్దగా ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో గత విభజన సమయంలో ఇచ్చిన హామీలను ముందుకేస్తే.. అసలు కేంద్రం ఎందుకిలా వ్యవహరించిందో అర్థం కావడం లేదు. విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం రాష్ట్రానికి ద్రోహం చేసినా వైసిపి, తెలుగుదేశం పార్టీలు పెద్దగా పోరాడడంలేదు. మోడీ బురిడీ కొట్టించి కాలయాపన చేయడంతో పదేళ్లు గడిపేశారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా కేంద్రం విధానాలపై రాజీపడకుండా ఎపి నేతలు పోరాడలేక పోతున్నారు. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న వైరుధ్యాల కారణంగా కేంద్రం లాభపడుతోంది. గతంలో దీర్ఘకాలం బిజెపితో టిడిపి సాగించిన పొత్తు రాజకీయాలు కూడా దీనికి ఒక కారణం. ఇకపోతే అధికారంలోకి రాకముందు జగన్ ఇచ్చిన అనేకానేక సమస్యలు ఆచరణకు నోచుకోలేదు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయడానికి, మూసేయడానికి వెనకాడలేదు. ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డి కూడా అదే పని చేస్తున్నారు. కృష్ణపట్నం జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం అదానీకి ధారాదత్తం చేసింది. గంగవరం పోర్టును అప్పగించేశారు. సహకార చెక్కర, పాలసంఘాలను రెండు పార్టీలు దెబ్బతీశాయి. అందువల్ల మౌలికమైన ఆర్థిక విధానాలలో ఇద్దరికీ తేడా లేదు. తెలుగు ప్రజల భావోద్రేకాలకు అనుగుణంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను మాటవరసకు వ్యతిరేకిస్తున్నప్పటికీ గట్టిగా నిలబడి తెగువతో పోరాటానికి ముందుకు రావటం లేదు. ప్రత్యేకహోదాను పక్కనపెట్టి ఇద్దరూ కీచులాడుకుంటున్నారు.

ఎన్నికలు వచ్చినప్పుడు సంక్షేమ పథకాలను పోటీలు పడి ప్రకటిస్తుంటారు. ప్రతిపక్షంలో ఉంటే ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఒక మాటగా వీరి తీరున్నది. నరేంద్రమోదీ నాయకత్వంలో బిజెపి రెండోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తికావస్తున్నా తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించకపోగా పొగపెట్టారు. ప్రస్తుత సందర్భంలో నరేంద్రమోదీ ఇకముందు ఏదో చేస్తారనో ఆశలు పెట్టుకుంటే అంతే సంగతలు. మళ్లీ ఎన్నికల్లో బిజెపి గెలుస్తుందన్న అంచనాలు ఉన్నాయి. మోడీని ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాల భవిష్యత్ అగమ్య గోచరంగా మారింది. అప్పటికీ ఇప్పటికీ ఆయన ధోరణి మారలేదు. కేంద్రమంత్రులు ఎందరు ఉన్నా వారంతా దమ్మీలే. అంతేగాకుండా అంతా నమో అంటూ స్మరించే స్థాయికి చేరుకునేలా చేశారు.

తనకంటూ ఒక ప్రత్యేక అభిమాన భక్తగణాన్ని దేశ విదేశాల్లో రూపొందించుకోవడం లోనూ మోడీ విజయం సాధించారు. అందుకే మోదీని తీవ్రంగా విమర్శించే వారిని మించి ఆయనను గుడ్డిగా సమర్థించేవారు ఎక్కువగా ఉన్నారు. భారతీయ జనతా పార్టీకి బలం తానే అన్న రీతిలో ఇప్పుడు పార్టీ పరిస్థితి తయారయ్యింది. మోదీ, ఆయన విధానాల పట్ల వ్యతిరేకత పెరుగు తున్నా దానిని ఆయన లెక్క చేయడం లేదు. ఆర్థిక విధానాలు సవ్యంగా ఉన్నాయని, ధరలు అదుపులో ఉన్నాయని, నిరుద్యోగం నియంత్రణలో ఉన్నదని చెప్పేందుకు విపరీతమైన ప్రచారాలు వివిధ రూపాల్లో సాగుతున్నాయి. మోదీ నిరంకుశ, ఏకపక్ష విధానాల వల్ల దేశ సమస్యలే కాదు..ఉభయ తెలుగు రాష్ట్రాలకు కూడా సమీప దూరంలో పరిష్కారం అవుతాయనడానికి లేదు. ప్రధానమంత్రి సమాఖ్య స్ఫూర్తితో పనిచేస్తున్నారనడానికి లేదు. రాష్ట్రాలను గౌరవిస్తున్నానని చెప్పుకోవడం మినహా వారిని గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నాలు ఎప్పుడూ కొనసాగిస్తుంటారు. మోదీ ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు కేంద్ర ఏజెన్సీలను అప్పుడప్పుడూ ప్రయోగి స్తూనే ఉంటారు. ఇకముందు కూడా ఇలాగే ఉంటారు. అలాగే ఉభయ రాష్ట్రాల సమస్యలను కూడా పట్టించుకుంటారన్న నమ్మకం కూడా లేకుండా పోయింది.

# అబద్ధాలతో వంచన

అసెంబ్లీలో కూడా అబద్దాలు చెప్పడం ద్వారా బిఆర్ఎస్ తన అహంభావాన్ని మరోమారు చాటుకుంది. కృష్ణా జలాల విషయంలో ఆ పార్టీ చేసిన వాదన పసలేనిది. గత పదేళ్ల పాలనలో అబద్ధాలు, అర్థ సత్యాలతో ప్రజలను మోసం చేశారు. తెలంగాణను దివాళా తీయిం చారు. ఓ నలుగురి కోసం మొత్తం తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టారు. అబద్దాలు ప్రచారం చేసి ప్రజలను నమ్మించారు. మేడిపండు చందంగా అభివృద్ధి డొల్ల అని తేలింది. అయినా బింకం చావలేదు. అహం వీడలేదు. అసెంబ్లీలో తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రెండు నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్‌నామ్ చేయాలన్న వాదాన్ని పాటించారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డా ..బంగారు తెలంగాణ.. కల సాకారం కాలేదు. తెలంగాణ ఏర్పడితే అంతా మంచే జరుగుతుందనుకున్న వారు మోసపోయారు. బలిదానాలు ఇచ్చిన వారి కుటుంబాల అతీగతీ లేదు. ప్రజలకు ఊరట దక్కలేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కలేదు. ఉపాధి కోసం ఎదురు చూసిన వారి కళ్లు కాయలు కాస్తున్నా పట్టించుకోలేదు. తెలంగాణ ఉద్యమ జెండా మోసిన వారంతా దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. ప్రగతి భవన్ సామాన్యులకు అందుబాటులో లేకుండా చేశారు. నాటి సిఎం కెసిఆర్‌ను కలవాలనుకుంటే కుదరదని శిలాశాసనం రాసారు. గతంలో ఉమ్మడి ఎపిలో సిఎంలను కలవాలనుకుంటే ఇంతగా ఇబ్బంది ఉండేది కాదు. జెండాలు మోసిన జర్నలిస్టులు అధోగతి పాలయ్యారు. వారిని పురుగుల కన్నా హీనంగా చూసారు. ఏ పని చేసినా ఓట్లు రాబట్టుకునే ఆలోచనలో నాటి తెలంగాణ ప్రభుత్వం నడిచింది. దానినే బంగారు తెలంగాణ అంటూ ఊదర గొట్టారు. ప్రధానంగా ధరణిపై వచ్చిన ఆరోపణలను సరిదిద్దుకునే ప్రయత్నం చయకుండా ఎదురుదాడికి దిగారు.



తప్పులు జరిగితే..ధరణి మొత్తం బాగాలేదని అంటున్నా రని ఎదురుదాడి చేసారు. అసెంబ్లీలో మంత్రులు దీనిపై వివరణ ఇచ్చి తప్పులు చెబితే ఒప్పుకోవడం కూడా చేతకావడం లేదు. సరిదిద్దుకుం టామని చెప్పలేకపోయారు. ఈ దశలో ఇప్పుడు రేవంత్ నాయకత్వంలో ఏర్పడ్డ ప్రజాపాలన గత వైఫల్యాలను ఎత్తి చూపుతోంది. గతంలో ప్రజలు ఎలా ఉన్నారో ఎప్పుడూ ఆరా తీయలేదు. అరాచకాలు ఎందుకు జరుగుతున్నాయో కనుక్కోలేదు. ఎపిలోనూ గత ఐదే ళ్లగా జగన్ పాలన కూడా అలాగే సాగింది. ఒక్క అవకాశం అంటూ గద్దె నెక్కిన జగన్ పాలన ఎలా ఉందో ప్రపంచమంతా చూస్తోంది. అవినీతి కేసుల్లో కూరుకుపోయిన ఓ నేత ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎవరు రోడ్డెక్కినా పోలీసులు కేసులు పెడుతున్నారు. లోకేశ్ పాదయాత్రను అడుగడుగునా.. అడ్డుకున్నారు. అమరావతి పై కేంద్రం ప్రకటనతో కిమ్మనడం లేదు. వైఎస్ వివేకా హత్య కేసుపైనా పెదవివిప్పడం లేదు. ఈ సమస్యలను నిలదీయాల్సిన బాధ్యతను ఇప్పుడు షర్మిల చేపట్టారు.

ఇకపోతే ఉమ్మడి ఎపిలో ఉన్న నీటి పంచాయితీలే మరింత ఎక్కువగా మళ్లీ మళ్లీ ఉత్పన్నం అవుతున్నాయి. ప్రజల అమాయకత్వాన్ని, అవసరాలను క్యాష్ చేసుకోవడం నేటి రాజకీయంగా మారింది. ప్రజలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి లోపించంది. ఒకప్పుడు జగనన్న వదిలిన బాణాన్ని అంటూ ప్రచారం చేసుకున్న షర్మిల ఇప్పుడు అన్న అక్రమాలను నిలదీస్తు న్నారు. నిజానికి ఎపిలో రాజన్నరాజ్యం నడవాలి. కానీ అక్కడంతా అరాచక రాజ్యం నడుస్తోంది. రాజధాని అన్నది లేకుండా...మూడు రాజధానులు ఉండాలన్న విపరీత ఆలోచనలు చేస్తున్న పాలకులు ఉన్నారు. రాజధాని లేకుండా రాజ్యం చేస్తున్నారు. అలా ఎందుకు చేస్తున్నారో షర్మిల ప్రశ్నించడంతో నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మొత్తంగా తెలంగాణ మాదిరి ఎపిలోనూ మంచి జరగాలని కోరుకుంటున్నారు.

# ఉరుముతున్న నిరుద్యోగం

ప్రపంచంలో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నా ఉరుముతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫలం కాలేకపోతున్నాయి. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తవుతాయి. స్వతంత్ర భారతం అనేక రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించినా భారత్‌లో తయారీ వంటి ఆకర్షణీయ నినాదాలిస్తున్నా తదనుగుణంగా ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో ముఖ్యంగా తయారీ రంగంలో మేటిగా నిలవలేక ఇంకా అనేక వస్తువులను చైనా తదితర దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఫలితంగా కోట్లాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రస్తుతం 5 వ స్థానంలో వున్న ఆర్థిక వ్యవస్థను వచ్చే 24 ఏళ్లలో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ప్రపంచంలో 3 వ స్థానానికి చేర్చడమే లక్ష్యంగా సంకల్పం చెప్పుకొని ఆ దిశగా కొన్ని చర్యలు చేపట్టారు. అయితే ఇవి లక్ష్య సాధనకు ఏ మేరకు ఉపకరిస్తాయనేదే ప్రశ్న. నిరుద్యోగ సమస్య తీవ్రత దృష్ట్యా పాలస్తీనా వివాదంలో ఇస్లామిక్ దేశాలతో పోరాడుతున్న

ఇజ్రాయెల్ దేశంలో వివిధ రంగాలలో ముఖ్యంగా నిర్మాణ రంగంలోకి పని చేయడానికి భారత యువత ఎగబడటం చూస్తే నిరుద్యోగ పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. ఇజ్రాయెల్ నిర్మాణ రంగంలో పని చేయడానికి 10 వేల మందికి పైగా ప్లంబర్లు, ఎలక్ట్రిషియన్లు, కార్పెంటర్లు, పెయింటర్ల వంటి వివిధ వృత్తులవారు అవసరం కాగా, ఆ పనుల్లో చేరడానికి తొలుత 25 కోట్ల జనాభా గల అతి పెద్ద రాష్ట్రం యుపి, హర్యానా యువకులు ఎగబడ్డారు. కాగా ఇజ్రాయెల్‌తో స్నేహ సుహృద్భావ సంబంధాలు నెరపుతున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం చొరవ తీసుకుని బిజెపి ఏలుబడిలోని యుపి, హర్యానాలో కార్మికుల రిక్రూట్‌మెంట్‌లో ఇజ్రాయెల్‌కు తమ సహకారాన్ని అందించింది. పాలస్తీనా సంఘర్షణలో ఇస్లామిక్ దేశాలు, ఇజ్రాయెల్ పరస్పరం బాంబు, క్షిపణి దాడులకు దిగడంతో అక్కడ భీతావహ పరిస్థితులు నెలకొన్నా అక్కడ పని చేయడానికి మన నిరుద్యోగ యువత పోటీపడుతున్నది. ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.1.40 లక్షల జీతం, రూ. 4 వేల వరకు బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఎంపిక జరుగుతున్న చోట్ల తొక్కిసలాట జరుగుతున్నది. ఆకలితో మరణించడం కంటే పనిచేస్తూ ప్రాణాలు పోగొట్టుకోవడానికి యువత సిద్ధపడటం నిరుద్యోగ తీవ్రతకు నిదర్శనం.

వివిధ దేశాలలో నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం గల కార్మికులకు మెరుగైన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండటంతో బతుకు కోసం ఆ దేశాలకు తరలి వెళ్ళడానికి యువత పోటీపడుతున్నారు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులు గల్ఫ్, తదితర దేశాలలో పని చేస్తూ తమ కుటుంబాలకు వేల కోట్ల రూపాయలు పంపి ఆదుకుంటున్నారు. దేశంలో తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలులేకే యువత విదేశాల బాట పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014లో అధికారంలోకి రావడానికి ముందు బిజెపి తమ ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. అయితే వాస్తవంగా జరిగింది వేరు. దేశంలో తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక కన్సల్టెన్సీలకు వేల కొద్దీ డబ్బు చెల్లించి మన యువత విదేశాలకు తరలి వెళుతున్నారు. ధనదాహంతో కొన్ని కన్సల్టెన్సీలు అవకాశాలు లేని దేశాలకు కూడా యువతను పంపడం, అక్కడికి చేరాక వారు అష్టకష్టాలు పడటం తెలిసిందే. కెనడా, అమెరికా వంటి దేశాలకు వెళ్లినవారికి సైతం తగిన ఉద్యోగాలు లభించక అర్ధాకలితో అలమటిస్తూ,

అప్పుల పాలై మళ్లీ స్వస్థలాలకు తిరిగి వస్తున్నవారు గణనీయంగా ఉన్నారు.

2022 అక్టోబర్ -2023 సెప్టెంబర్ మధ్య అమెరికాలో అక్రమంగా ప్రవేశించిన 96,917 మందిని గుర్తించి పట్టుకున్నట్లు అమెరికన్ కస్టమ్స్, సరిహద్దు భద్రతాదళం గణాంకాలు ఘోషిస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నా ఇది ఉద్యోగ, ఉపాధి కల్పించలేని అభివృద్ధిగా మిగిలిపోతున్నది. 2024-25లో మన దేశం 7.3% అభివృద్ధి సాధించగలదని ఇటీవల తాత్కాలిక బడ్జెట్ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. కోట్లాది యువతకు, శ్రామికులకు ఉద్యోగ, జీవనోపాధి అవకాశాలు కల్పించలేనిదిగా నిలవనుంది. నిరుపేదలు ఏ పని దొరికితే ఆ పనికి వెళుతూ జీవితాలు వెళ్ళదీస్తున్నారు. చదువుకున్న నిరుద్యోగ యువత మాత్రం తమ అర్హతలకు అనుగుణమైన ఉద్యోగాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. పనిచేసే వయసు గల యువతకు తగిన ఉపాధి అవకాశాలు లభించకపోతే అది వారిలో నైరాశ్యానికి , అశాంతికి దారితీసే ప్రమాదముంది. భారత ప్రభుత్వం రెండేళ్ల క్రితం సైన్యంలో చేరదలచిన యువతకు అగ్నిపథ్ పథకాన్ని ప్రకటించగా వేలాది మంది యువత ముందుకొచ్చారు. మామూలు సైన్యంలో ఇచ్చే జీత భత్యాలు,

పింఛను వీరికిరావు. బిజెపి ప్రభుత్వం ఎక్కువగా వాణిజ్య, పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నందున, అగ్నిపథ్‌లో శిక్షణ పొందినవారు ఐదేళ్ళ తర్వాత పరిశ్రమల వారికి రక్షకులుగా పని చేయాల్సి ఉంటుంది. 13 కోట్ల జనాభా గల పెద్ద రాష్ట్రంలో పరిమితమైన రైల్వే ఉద్యోగాలకోసం యువత ఎగబడడంతో అది హింసాకాండకు దారి తీసింది. ఆరేళ్ల క్రితం 35 వేల ఉద్యోగాల కోసం ప్రకటన రాగా కోటి మంది దరఖాస్తు చేశారు. నియామకాల్లో అవినీతి జరిగి ఆందోళనలకు దారి తీసింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 368 బంట్రోతు ఉద్యోగాలకు ప్రకటన చేయగా పిహెచ్‌డిలు, పోస్టు గ్రాడ్యుయేట్లు సహా 23 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దాదాపు 2 లక్షల పోస్టులకు దశలవారీగా నియామక ప్రక్రియ చేపట్టడం యువతకు ఆశాకిరణంగా కనిపిస్తోంది. తెలంగాణ ప్రభుత్వ 31 విభాగాల్లో మంజూరైన పోస్టులు 4,91,304. ప్రస్తుతం 3 లక్షల ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్నారు. స్కూలు విద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ, పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలలో దాదాపు 77% మంది పని చేస్తున్నారు. స్కూలు విద్యశాఖలో మంజూరైన పోస్టులు 1,37,651 కాగా, ప్రస్తుతం 1,13,853 మంది మాత్రమే పని చేస్తున్నారు. పోలీసు శాఖలో మంజూరైన పోస్టులు 98,384 కాగా, ప్రస్తుతం 61,212 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో మంజూరైన పోస్టులు 52,906 కాగా, ప్రస్తుతం 22,336 మంది పని చేస్తున్నారు.



ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి. దేశంలో మొత్తం నిరుద్యోగిత రేటు 6.6%. నగరాలు, పట్టణాలలో 15- 19 ఏళ్ల ఉద్యోగార్థులు రేటు అంతకు 3 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు 2023 జులై సెప్టెంబర్ గణాంకాలు ఘోషిస్తున్నాయి. నిరుద్యోగ సైన్యం నానాటికీ పెరిగిపోతుండడం అనేక సమస్యలకు దారితీస్తున్నది. 2014లో యువత కోటి ఆశలతో కమలం పార్టీకి ఓటేయడంతో నరేంద్ర మోడీ ప్రధానిగా కేంద్రంలో కమలనాథులు అధికారంలోకి వచ్చారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం మోడీ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యం కావాలి. అయితే అరకొర చర్యలు తప్పితే మోడీ ప్రభుత్వం ఈ రంగంలో పెద్దగా పురోగతి సాధించలేదు. ఉద్యోగాలు కల్పించినా కొన్ని అసంఘటిత రంగంలో పట్టణాలు, నగరాలలో అసంఘటిత రంగంలో రోజువారీ కూలీ పనులే, మహిళలే అధికం. 2019 -20లో 22 శాతంగా ఉన్న ఈ పనులు 2022 -23లో 24 శాతానికి పెరిగినట్లు పరిశీలనలో తేలింది. ఇవి హెల్పర్లు, గృహ పరిశ్రమలకు చెందినవే. పట్టణ యువత నైరాశ్యంతో ఉద్యోగాల కోసం వెదకడం మానేసినట్లు తేలింది. 2023 జులై సెప్టెంబర్‌లో ఉద్యోగుల చేరిక తగ్గింది. మూడు నెలల్లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంటి తుడుపుగా కొన్ని ఉద్యోగ నియామకాలు చేపట్టాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల డిఎస్‌సి ద్వారా నియామకాలను ప్రకటించింది. 2023 జులై నాటికి నిరుద్యోగిత రేటు 7.95 శాతంగా ఉన్నట్లు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఇండస్ట్రీ వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం 2015 నుండి ఇప్పటి వరకు 36,643 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసినట్లు ఆర్‌టిఐ ద్వారా సమాచారం లభించింది. మధ్యలో ప్రశ్నాపత్రాలు లీకై కొన్ని పరీక్షల రద్దుకు, ఉద్యోగాలు రావనే నిరాశతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడటం శోచనీయం. రేవంత్ రెడ్డి సిఎంగా కొత్తగా అధికారంలోకి

కాగా నరేంద్ర మోడీ పదేళ్ల పాలనలో 9 లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చినట్లు, అదే మోడీ ప్రభుత్వం సాధించిన ఘన విజయమని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అభివర్ణించారు. కానీ యుపిఎ పదేళ్ల పాలనలో ఇచ్చినది 6 లక్షల ఉద్యోగాలేనని కేంద్ర మంత్రి అంటున్నారు. యుపి ఎస్‌సి ద్వారా మోడీ ప్రభుత్వం 50,906 ఉద్యోగ నియామకాలు చేయగా, యుపిఎ హయాంలో ఇచ్చింది

45,431 ఉద్యోగాలేనని, ప్రస్తుత సిబ్బందికి భారీగా ప్రమోషన్లు కల్పించామని మంత్రి చెప్పారు. భారత ప్రభుత్వంలో మంజూరైన పోస్టులు 40 లక్షలు కాగా, ప్రస్తుతం 30 లక్షల ఉద్యోగులే పని చేస్తున్నారు. సివిల్ సర్వీసులలో 1,365 ఐఎఎస్, 703 ఐపిఎస్, 1042 ఇండియన్ ఫారెస్ట్ పోస్టులు, ఐఆర్ఎస్ పోస్టులు 301 ఖాళీగా వున్నాయి. హోం శాఖలో 1,14,245, సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్, ఢిల్లీ పోలీసు శాఖలలో గ్రూప్ ఎ పోస్టులు 3,075, గ్రూప్ బి పోస్టులు 15,861 పోస్టులు, గ్రూప్ సి లో 95,309 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రైల్వేలో 2.63 లక్షల పోస్టులు ఖాళీగా ఉండగా, ఇటీవల పలు దఫాలుగా 1.39 లక్షల పోస్టులు భర్తీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 8 లక్షల ఉద్యోగులు ఉన్నారు. వారిలో 5.6 లక్షల రెగ్యులర్, 1.3 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయాలలో పని చేస్తున్నారు. 2 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్నారు. యుపిలో 27 లక్షల ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లు, మహారాష్ట్రలో 17 లక్షలు, తమిళనాడులో 16 లక్షల ఉద్యోగులు, పెన్షనర్లు వున్నారు. బీహార్, రాజస్థాన్, జార?ండ్, ఢిల్లీ రాష్ట్రాలలో నిరుద్యోగులు అధికం. కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలు ఖాళీలు భర్తీ చేస్తే నిరుద్యోగులకు కొంతైనా ఊరట కలుగుతుంది. నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రైవేటు రంగంలో ఉద్యోగ కల్పనను ప్రోత్సహిస్తే మరి కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా సత్వర చర్యలు చేపట్టాలి.

# అక్షరాలకు ఊపిరి పోస్తున్నా...

జర్నలిస్ట్ అంటే కలం పట్టిన సైనికుడు, జర్నలిస్ట్ అంటే అక్షరాలను తూటాల్లా చేసుకుని, అవినీతి లొసుగులను బయటకులాగే వేటగాడు.. పొలంలో విత్తుని మొలకెత్తించడానికి రైతు తన శ్రమను ఎలా ధారపోస్తాడో, ఒక వార్తను సేకరించడానికి, విలేఖరి తన సర్వశక్తులూ ఉపయోగిస్తాడు.. అతనిది బ్రతుకు పోరాటం.. ఇతనిది మంచిని బ్రతికించాలనే ఆరాటం.. జర్నలిజం బ్రతుకు అక్షరాల వెంట పరిగెడుతుంది..




ఉరుకుల పరుగుల జీవితంలో, తన చుట్టూ ఎన్ని సమస్యలు చుట్టిముట్టినా తట్టుకుని సమాజంలో ఉన్న సమస్యలకి పరిష్కారం చూపించాలనే తపనతో, కనిపించిన ప్రతి దాంట్లో జర్నో కోణాన్ని వెతుక్కుంటాడు.. అలా రోజూ కామన్ మ్యాన్ లా ఆలోచించి జర్నీ మొదలు పెడతాడు జర్నలిస్టు... ఆ గడియారం ముల్లు ఒకటి నుండి పన్నెండుదాకా తిరిగితే.. జర్నలిస్టు లోకం చుట్టు తిరుగుతూ, 24 గంటలు అదే ధ్యాసలో బ్రతికేస్తాడు. పేరుకు అతనికి 8 గంటలే డ్యూటీ అయినా.. నిద్రపోనంత వరకు, బుర్ర మాత్రం సమాజం చుట్టే తిరుగుతూ ఉంటుంది.

తాను పడే వేదనలో, తన మెదడులో మెదిలో ఆలోచనల్లో బాస్ దగ్గర శభాష్ అనిపించుకోవాలంటే ఏలాంటి స్టోరీలు రాయాలి, కళ్ల ముందు ఉన్న సమస్యలకు పరిష్కారం చూపించేలా వాటిని ఎలా ప్రెజెంట్ చేయాలి, ఇందులో ఏ స్టోరీ పేలిపోతుంది. కంటికి కనిపించిన స్టోరీని ఏ యాంగిల్లో ప్రజంటేషన్ చేయాలి, అని బుర్ర వేడెక్కిపోయేలా ఆలోచిస్తుంటాడు. ఇలా ఆలోచించి ఆలోచించి అనారోగ్యం కొని తెచ్చుకుంటాడు.. తనకు తెలియకుండానే బాడీ మొత్తం స్లో పాయిజన్ ఎక్కించేసుకుంటాడు...

ఇలా అందరి గుండెచప్పుళ్లు వినే ఎందరో జర్నలిస్టులు.. తమ గుండెను మాత్రం కాపాడుకోలేక పోతున్నారు.. ఇకపోతే నేటి సమాజంలో జర్నలిజం అంటే దోపిడిలా మారింది. జర్నలిజం పేరు చెప్పుకుని జేబులు నింపుకుంటున్న చోరులను చూసి అక్షరాలు సిగ్గుపడుతున్నాయి.. అక్షరాలను ఆయుధాలుగా మార్చే చేతులు అవినీతిపనులకు అడ్డాగా మారుతుంటే కలం కూడా కన్నీరు కారుస్తుంది.. సోదరుల్లారా జర్నలిజం అంటే బ్రోకరిజం కాదు.. తూటా లేని తుపాకి లాంటిది. రక్తం చూడని కత్తి లాంటిది.. నేలను చదును చేసే నాగలి వంటిది.. కాబట్టి అక్షర యజ్ఞం చేయండి నిజాయితీగా జీవించండని ప్రతి అక్షరం అనుక్షణం జర్నలిస్టులను వేడుకుంటుంది.

కానీ ఈ వేదన నిజమైన జర్నలిస్టుకు మాత్రమే అర్థం అవుతుంది.. నువ్వు అనుకుంటావు అక్షరాలకు ఊపిరి పోస్తున్నా అని, కాని నీకో గుర్తింపును ఆ అక్షరాలే సంపాదిస్తున్నాయనే విషయాన్ని విస్మరించకు మిత్రమా.. ఎందుకంటే అమ్మకంటే అత్యుత్తమమైనది అక్షరం. ఆ అమ్మను పిలవాలంటే అక్షరమే తోడవ్వాలి మరి... ఇదే నిజమైన జర్నలిజం

- ముత్యం రాజేష్ గౌడ్
ఎస్ జె డబ్ల్యూ ఎచ్ ఆర్ సి మండల
డైరెక్టర్





## నా ఆత్మవిశ్వాసమే నా గమ్యం

కాలం చేసే ముళ్లకు
కన్నీటి పర్యంతం ఐనా
నా నీడను మార్చాగలదా.....
నా గుండెల్లో ఉన్న ఆవేదనను తీర్చాగలదా.....
కాలం అనే నీడలో నా ఆనందం వెతుకుతున్న
గమ్యం చేరే దారిలో ముళ్లపొదలు ఎన్ని ఉన్నా
నా ఆశయం ముందు కాలం తలవొంచక తప్పదు అనే ఆత్మ విశ్వాసమే
నా గమ్య స్థానం గా మలచుకొని
ఊహల్లో జీవనం గడిపేస్తున్నా గమ్యం దారిలో పయనిస్తున్నాను....... నా
ఆదర్శం ఇంకొకరికి ఆశయం కావాలని ఆశిస్తున్నా........
ఈ జీవన గమనం లో ఎందరు నన్ను వెలివేసిన
నా పయనం మాత్రం....... అన్వేషణ నే......
విశ్రమించక నా గమ్యం చేరే వరకూ
పోరాటానికి ఆయువు పోస్తూనే ఉంటా.....
వెక్కిరించినోడి గుండెలో ఫిగంగి నై...... నా ఆశయ సాధన కొరకు.....

- డాక్టర్ బాలు నిర్మల



## ఏపీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**మేడిపల్లి, వెలుతురు:** ఏపీఆర్ ఎన్రాప్ అధినేత అల్లం ప్రవీణ్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్రులు, సన్నిహితులు కేక్ కట్ చేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తన మిత్రుకు దన్య వాదాలు తెలియ జేస్తున్నాను అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎ.పాండు, పి.శ్రీనివాస్, కె.వామన్ రెడ్డి, పి.రాజారాం తదితరులు పాల్గొన్నారు.

## 'ఛలో నల్గొండ' సభను విజయవంతం చేద్దాం

**మంచాల్, వెలుతురు:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, ఉద్యమ రథసారథి కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ వనరులు సురక్షితంగా ఉన్నాయని, కానీ రెండు నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ పరిస్థితి నాటి సమైక్య పాలనను గుర్తు తెస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ..
కృష్ణా నదీ ప్రాజెక్టులు, నదీ జలాల హక్కుల పరిరక్షణకై బీఆర్ఎస్ పార్టీ గౌరవ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గారి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13 న అనగా..రేపు నిర్వహించనున్న 'ఛలో నల్లగొండ' భారీ బహిరంగ సభకు మీరు తప్పకుండా హాజరుకావాలి



## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

### కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ పామన భీమ్ భరత్

**శంకర్పల్లి, ఫిబ్రవరి 12 (వెలుతురు):** క్రీడలు శారీరక దృఢత్వం తో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని చేవెళ్ళ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీమ్ భరత్ అన్నారు. శంకర్పల్లి మున్సిపాలిటీలో ఆదివారం నిర్వహించిన






టోర్నమెంట్ లో భాగంగా బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు అనేవి మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానకి, అదే విధంగా వ్యక్తుల మధ్య ప్రేమానురాగాలకు దారితీస్తాయని అన్నారు. విద్యతోపాటు క్రీడలను కూడా జీవితంలో ఒక అలవాటుగా చేసుకోవాలని అన్నారు. యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అదేవిధంగా క్రీడల ప్రోత్సాహానికి తాను ఎప్పుడు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ సెటిల్ టోర్నమెంట్ లో భాగంగా మొదటి బహుమతిని సింగపురం వార్డుకు చెందిన మర్రి రామ్ రెడ్డి, ప్రభాకర్ మరియు రెండవ బహుమతిని మానిక్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మూడవ బహుమతి హరీష్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి గెలుపొందడం జరిగింది. విజేతలకు నగదు ప్రోత్సాహంతో పాటు శీల్డులను బహుకరించడం జరిగింది. ఈ క్రీడాకారులు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

**మేడిపల్లి, వెలుతురు:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమయిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది.. కూరగాయల షాప్ కు వెళ్లి వస్తానని చెప్పి బయటికి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో అదృశ్యమ బంధువులు స్థానిక పోలీస్ లను ఆశ్రయించింది. పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం... మేడిపల్లి పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహ హిల్స్ చెంగిచెర్లలోని బుల్లిగూడెంకు చెందిన ముద్దుల విజయ్ చక్రవర్తి (39) కుటుంబంతో స్థానికంగా నివాసం ఉంటున్నాడు.. గత నెల 27 వ తారీఖు నాడు మద్యాహ్నం కూరగాయ షాప్ కు వెళ్లి వస్తానని వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాలేదు.. తన దగ్గర ఉన్న సెల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ రావడంతో భయాందోళనకు గురైన అతని భార్య ముద్దుల ప్రశాంతి బంధువుల ఇండ్లలో వెతికారు.. కానీ ప్రయోజనం లేకపోవడంతో చివరిగా స్థానిక పోలీస్ లను ఆశ్రయించారు.. ఇంతకు ముందు కూడా తన భర్త ఇలాగే ఇంట్లో నుండి బయటికి వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చాడని బాధితురాలు తెలిపింది.. నల్లటి పాయింటు నల్లటి అంగి ధరించి ఇంట్లో నుండి బయటకు వెళ్లినట్టు భాదితురాలు తెలిపారు.. తన భర్త గురించి ఆచూకి తెలిసిన వారు మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో కానీ.. లేకుంటే 8712662702, 9441206383 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుపగలరని కోరారు.










# పగలే వెన్నెల.. జగమే ఊయల..

**బస్ స్టాండ్‌లో బార్ ...? బస్ స్టాండ్ నే బార్ గా మార్చుకున్న మందు బాబులు ..?**

**హైవే వైన్స్ ఎదుట మందుబాబుల హల్ చల్..**

**రాకపోకలకు మహిళలకు ఇబ్బందులు..**

**పోలీస్ గస్తీ బరువు ... ప్రజలకు భద్రత కరువు..**

**కూకట్‌పల్లి బాగ్ అమీర్ బస్టాండ్‌లో బహిరంగంగానే మద్యం సేవిస్తున్న ఏ మాత్రం పట్టించుకోని పోలీసులు...**

**కూకట్‌పల్లి, వెలుతురు:** కూకట్‌పల్లి బాగ్ అమీర్‌లోని బస్టాండ్ నే బార్‌గా మార్చి మద్యం ప్రియులు పట్టపగలే తూగుతున్నారు. కూకట్పల్లిలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న హైవే వైన్ షాప్ తో ప్రయాణికులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వైన్స్ పై అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఈ వైన్స్ కు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో మద్యం ప్రియులు తమ వాహనాలను రోడ్లపైనే గంటల తరబడి నిలిపివేసి దుకాణంలో మద్యం సేవిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ జాతీయ రహదారిపై ప్రయాణికులకు, మహిళలకు, విద్యార్థులకు, స్కూల్ బస్సులకు ఇబ్బందులు తప్పడం లేదు. కూతవేటు దూరంలో కూకట్ పల్లి మెట్రో స్టేషన్ ఉండడంతో ప్రయాణికులు, మహిళలు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై ప్రయాణించే వేల మంది ప్రయాణీకులకు రక్షణ కరువైంది. ఈ జాతీయ రహదారి గుండా నిత్యం వేల వాహనాలు రాకపోకలు సాగిస్తారు. సరిగ్గా అదే మార్గాన్ని అనుకొని ఆ బ్రాందీ షాపు ఉంది. పక్కనే పర్మిట్ రూమ్ ఉన్న మద్యం ప్రియులు రోడ్డుపైనే బహిరంగంగా మద్యం తాగి కబుర్లలో మునిగిపోతుంటారు. మద్యం కొనుగోలుకు వచ్చేవారు రోడ్డుపైనే బైకులను పార్కింగ్ చేస్తుంటారు. దీంతో ఆ రహదారి గుండా వెళ్లే వాహనాలకు ప్రజలు, మహిళలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కొందరు ఆకతాయిలు మద్యం మత్తులో మహిళలను ఈవిటీజింగ్ చేస్తున్నారు.

### బస్ స్టాండ్ లో బార్...?

బస్ స్టాండ్ లో రాత్రి పగలు అనే తేడా లేకుండా నిత్యం మందుబాబులు మద్యం సేవిస్తున్న అధికారులు చర్యలు తీసుకోవట్లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం ప్రియులు బహిరంగంగానే మద్యం సేవిస్తున్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ మద్యం మత్తులో ఏదైన జరిగితే బాధ్యులు ఎవరని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

సాక్ష్యాత్తు జాతీయ రహదారిపై బస్టాండ్ లోనే బార్ లా తలపిస్తున్న ఈ దృశ్యాలు చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మద్యం షాపులను నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు "మామూలుగా" వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

**వెలుతురు న్యూస్ కల్వకుర్తి నియోజకవర్గం:** కల్వకుర్తి నియోజకవర్గం సికెఆర్ గార్డెన్‌లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించిన భారత రాష్ట్ర సమితి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం విజయవంతం జరిగింది. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఏది ఏమైనా ప్రజలు మార్పు కోరుకున్నారు కాబట్టి మన పార్టీ ఓటమి చెందడం జరిగింది. ముఖ్య నాయకులు కార్యకర్తలకు అండగా ఉండి వారిని ఆదుకోవాలని సూచించారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పిన అధికారంలోకి రావడం జరిగింది అని తొందర్లోనే ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. సి.ఎల్. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే తెలంగాణ ప్రజలు తొందరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కొలుస్తారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నీళ్ల విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగిన కె.సి.ఆర్ నీళ్ల కోసం ఉద్యమం చేస్తారని తట్టుకునే శక్తి ఎవరికీ లేదని అన్నారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు ఈ కార్యకర్తల సమస్యలన్నిటికీ పార్టీ అండగా ఉంటుంది రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరిని అభ్యర్థిగా నిర్ణయించిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి.

రేపు జరగబోయే నల్లగొండ లో కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభకు కార్యకర్తలు నాయకులు భారీగా రావాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గంలోని బిఆర్ఎస్ సర్పంచులకు అందరికీ శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.







### కీర్తిశేషులు వడ్డేపల్లి నర్సింగ్ రావు జ్ఞాపకార్థం

## ఫంక్షన్ హాల్ నిర్మాణం...

### ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించిన శాసనసభ్యులు అరికెపూడి గాంధీ

**శేర్లింగంపల్లి వెలుతురు:** వివేకానందనగర్ కాలనీలోని వివేకానందనగర్ రిక్రియేషన్ సెంటర్ ఆవరణలో కీర్తిశేషులు వడ్డేపల్లి నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం సంగీత్ నగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు తనసొంత నిధులతో ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. సోమవారం శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వర్ రావు మాట్లాడుతూ తన తండ్రి, కీర్తిశేషులు వడ్డేపల్లి నర్సింగ్ రావు జ్ఞాపకార్థం ఫంక్షన్ హాల్ నిర్మించడం సంతోషంగా ఉందని అన్నారు. వివేకానంద నగర్ కాలనీ దినదిన అభివృద్ధి చెందుతున్న దృశ్య కాలనీవాసులు అందరికీ ఈ ఫంక్షన్ హాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాలనీ అభివృద్ధికి తోడ్పాటుతున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికంగా రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ దృశ్యా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. కాలనీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటా మని అన్నారు.

కాలనీ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తానని అన్నారు. కీర్తిశేషులు వడ్డేపల్లి నర్సింగ్ రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు నిర్మించిన ఫంక్షన్ హాల్ ను కాలనీ సభ్యులు ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, సెక్రటరీ నాదెళ్ల వెంకటేశ్వర రావు, శివ ప్రసాద్, కమిటీ సభ్యులు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




### నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన

## భాస్కర్ రెడ్డి

**నంగునూరు మండలం, వెలుతురు ఫిబ్రవరి12:** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా భాస్కర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇంతకు ముందున్న ఎస్సై మోహన్ రెడ్డి బదిలీపై వెళ్లడంతో నేను రావడం జరిగింది మండలంలోని శాంతిభద్రతలు పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి కలవవచ్చునని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జూదం అక్రమ మాధ్యం తదితరవాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

### జిల్లా ఉత్తమ అవార్డు పొందిన

# ఎంపీడీవోకి ఘన సన్మానం

**శంకర్‌పల్లి ఫిబ్రవరి 12 (వెలుతురు):**
శంకర్పల్లి మండల కార్యాలయంలో డి వార్మింగ్ కార్యక్రమం మండల అభివృద్ధి అధికారి అయిన వెంకయ్య అధ్యక్షతన జరిగింది. అయితే ఈ కార్యక్రమంలో పాఠశాలల్లోని విద్యార్థులకు డి వార్మింగ్ మందుల గురించి డాక్టర్ రేవతి వివరణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్, మహాలింగాపురం ప్రధానోపాధ్యాయులు నరహరి, కొత్తపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండలంలో ఉన్న వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం మండల అభివృద్ధి అధికారి అయిన వెంకయ్య 26 జనవరి




న జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ఉత్తమ జిల్లా అవార్డు ను అందుకొన్నారు. దీనికై ఈరోజు శంకర్పల్లి మండల ఉపాధ్యాయుల సన్మానం చేశారు.

కార్యక్రమంలో మహారాజ్ పేట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాహేర్ అలీ, కొత్తపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు, జన్వాడ ప్రాథమిక పాఠశాల ఇన్చార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు దేవేందర్ రెడ్డి, బుల్కాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వనజా రెడ్డి, ప్రాథమికోన్నత పాఠశాల మోకిలా ప్రధానోపాధ్యాయులు పద్మజ, ఎంపీ యుపిఎస్ ఉర్దూ మీడియం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు నౌషిన్ సుల్తానా, కొండకల్ తాండ ఉపాధ్యాయులు మరుపల్లి అశోక్, బాలమణి, ప్రణీత, విజయలత, రాజేశ్వరి, ఆరిఫ్ పాషా, రమేష్, జంగయ్య,అందరూ కలిసి మండల అభివృద్ధి అధికారి అయిన వెంకయ్యను పూలదండ, శాలువాతో సన్మానం చేయడం జరిగింది.

# బలమైన దేశం మోడీతోనే సాధ్యం

### - బోసుపల్లి ప్రతాప్

**దేవరకద్ర, వెలుతురు:**
పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గం లో కొండ ప్రశాంత్ రెడ్డి నివాసంలో సభ అధ్యక్షులుగా దేవరకద్ర అసెంబ్లీ కన్వీనర్ కురువ రమేష్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ గారు దేవరకద్ర అసెంబ్లీ ప్రబారి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... రానున్న పార్లమెంటు ఎన్నికలలో బిజెపి విజయమే లక్ష్యంగా పార్టీ సంస్థాగత




విషయాల గురించి మరియు గవ్ చల్ లో బస్తీ చలో అభియాన్ కార్యక్రమం, వాల్ రైటింగ్ , బస్సు యాత్ర 500 సంవత్సరాలు హిందువుల నిరీక్షణకు రామ మందిరం ,370 ఆర్టికల్ మొదలైన సాహసపేతమైన నిర్ణయాల వల్ల బలమైన దేశంగా మారుతుందని ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేయాలని బలమైన దేశం బలమైన నాయకుడు మోడీ ద్వారానే సాధ్యమైతుందని వారు అన్నారు. భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులతో చర్చించి ప్రణాళిక ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేతూరి బుడ్డన్న (పాలమూరు పార్లమెంట్ విస్తారక్), సాయిబాబా (దేవరకద్ర అసెంబ్లీ విస్తారక్),రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు,మండల అధ్యక్షులు,మండల ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న

# వాటి పరిష్కారానికి కృషి చేస్తాం..

### శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్

**శేర్లింగంపల్లి, వెలుతురు:** శేరిలింగంపల్లి నియోజకవర్గ హైదరనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీలో సోమవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పర్యటించారు. హైదరనగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్ కాలనీలో స్థానికంగా నెలకొన్న సమస్యలు స్థానిక కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్థానికంగా రోడ్ ఆనుకోని 80 అడుగుల



లోతు సెల్లార్ తీయడంవలన రోడ్ మరియు డ్రైనేజ్ వ్యవస్థ క్రుంగిపోవడం వల్ల కాలనీ వాసుల బ్రతుకు దినదిన గండంగా మారిందని, ప్రక్కన వున్న నివాస సముదాయాలు కూడా క్రుంగుతాయేమోనన్న భయాందోళనలతో కాలని వాసులు జీవిస్తున్నారని తెలుసుకున్న జగదీశ్వర్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని కన్‌స్ట్రక్షన్ కంపనీ వారు కనీస సంరక్షక భాద్యతలు తీసుకొని స్థానిక ప్రజలకు ఎదురయ్యే ఇబంధులు తొలగించాలని కోరారు, యుద్ధప్రాతిపదికన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని జి.హెచ్.ఎం.సి కమీషనర్,జోనల్ కమీషనర్ ఇతర అధికారులకు తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు,కూన సత్యం గౌడ్,కొడాలి రవి,కావూరి ప్రసాద్,శ్రీకాంత్,సాద మహేష్,రాజిరెడ్డి,మురళి,మోహన్ రెడ్డి,పరుచూరి వెంకటేశ్వర రావు,కొఠారి వెంకటేష్,మనేపల్లి సాంబశివరావు,రవి,శ్యామ్,వేమూరి సాంబశివరావు గౌతమి నగర్ కాలని వాసులు కుమారస్వామి, కృష్ణకాంత్,పరుచూరి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 12:**
**సోమవారం రోజున మన కార్పొరేటర్ శ్రీమతి మహాలక్ష్మి రామన్ గౌడ్ గారు నజీర్ బాగ్ బస్తీని సందర్శించి పబ్లిక్ టాయిలెట్స్ పనులను పరిశీలించారు, అవి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. బస్తీ వాసులు బిఆర్ఎస్ నాయకుడు మహేష్ , మరియు బస్తీ వాసులు పలుగొన్నారు.**







### మిషన్ రిక్రూట్‌మెంట్ - రోజ్‌గార్ మేళా

# 12వ విడత తెలంగాణలో నిర్వహణ

### కొత్తగా రిక్రూట్ అయిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన

### శ్రీ భగవంత్ ఖూబా, కొత్త మరియు పునరుత్పాదక ఇంధనం, రసాయనాలు మరియు ఎరువుల కోసం రాష్ట్ర మంత్రి,

### డా.ఎల్. మురుగన్, కేంద్ర సమాచార, ప్రసారాలు, మత్స్యశాఖ సహాయ మంత్రి

**హైదరాబాద్ వెలుతురు 12 ఫిబ్రవరి 2024:**
రోజ్‌గార్ మేళా పథకం కింద కొత్తగా చేరిన ఒక లక్షకు పైగా రిక్రూట్‌లకు నియామక పత్రాలను సోమవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 12వ విడత రోజ్‌గార్ మేళాను తెలంగాణలో నిర్వహించారు. కేంద్ర సమాచార, ప్రసారాలు, మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల సహాయ మంత్రి డాక్టర్. ఎల్.మురుగన్ ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ (ఎన్ఐఎస్ఏ) హైదరాబాద్‌లో కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.మురుగన్ ప్రసంగిస్తూ రాబోయే 25 సంవత్సరాలు భారతదేశానికి చాలా కీలకమని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చురుకైన నాయకత్వంలో, దేశం చారిత్రాత్మక వేగంతో అభివృద్ధి చెందుతోందని, ఆయన దార్శనికతతో 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని ఆయన అన్నారు. కొత్తగా చేరినవారు తమకు తాముగా తీర్చిదిద్దడంపై దృష్టి సారించే విధంగా ఆన్‌లైన్ మాడ్యూల్ అయిన కర్మయోగి ప్రారంభ ద్వారా శిక్షణ పొందే అవకాశాన్ని కూడా పొందుతారని ఆయన పేర్కొన్నారు.
హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) గ్రూప్ సెంటర్‌లో జరిగిన మరో కార్యక్రమంలో కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధనం, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీ భగవంత్ ఖూబా ముఖ్య అతిథిగా పాల్గొని తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. అభ్యర్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, రిక్రూట్‌మెంట్ చాలా సజావుగా, నిష్పక్షపాతంగా జరిగిందని అన్నారు. కొత్తగా రిక్రూట్ అయిన అభ్యర్థులు తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉద్యోగ బాధ్యతలను స్వీకరించి దేశానికి సేవ చేయాలని ఆయన కోరారు.
పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్ర బోర్డు (సిబిఐసి), ఆదాయపు పన్ను (ఐటీ), రైల్వేలు, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపిఎఫ్ఓ), వంటి వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సహా సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ,(సీపీడబ్ల్యూడి), భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బిఐ), పోస్టల్ డిపార్ట్‌మెంట్, ముగ్గురు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్పిఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్), ఐఐటీ హైదరాబాద్,ఎయిమ్స్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యుఓహెచ్) మొదలైన విభాగాల్లో ఉద్యోగాలు పొందిన దాదాపు 405 మంది అభ్యర్థులు రోజ్‌గార్ మేళాలో అపాయింట్‌మెంట్ లెటర్‌లను అందుకున్నారు.





### కోండం కవిత సంపత్ రెడ్డి మరియు THR కాలనీ అధ్యక్షులు నర్సింలు ఆధ్వర్యంలో

# ఉచిత వైద్య శిబిరం

**సిద్ధిపేట టౌన్, వెలుతురు ఫిబ్రవరి12:**
సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మరియు సురభి మెడికల్ కళాశాల మిట్టపల్లి వారు సిద్దిపేట పట్టణం 4వ వార్డు THR నగర్ కలనిలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్లో కోండం కవిత సంపత్ రెడ్డి మరియు THR కాలనీ అధ్యక్షులు గట్టు నర్సింలు గారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సురభీ హాస్పిటల్ PRO పరుశరాములు మాట్లాడుతూ సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచితంగా అందిస్తున్నటువంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు, అలాగె హాస్పటల్లో గల వైద్య సేవలను కూడా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సురభి హాస్పిటల్ మేనేజ్మెంట్ వెంకటేశ్వరరావు గారు, మరియు మర్కెటింగ్ ఇంచార్జీ చరణ్, సచిన్, రాకేష్ పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో గ్రామ ప్రజలు మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సుమారు 420 పై చిలుకు ప్రజలు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో రక్త పరీక్షలు,మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఆపరేషన్ అవసరం ఉన్న వారిని హాస్పిటల్ కి రెఫెర్ చేయడం జరిగింది.
జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, స్త్రీల వైద్య నిపుణులు, కంటి సంబంధిత వైద్య నిపుణులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు, సుమారు 15 మంది సీనియర్ డాక్టర్లు మరియు నర్సింగ్ స్టాఫ్, మార్కెటింగ్ మరియు సపోర్టింగ్ స్టాఫ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిఎంఎస్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి..

### - జిల్లా కన్వీనర్ పప్పుల సురేష్

**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 12:**
బి ఎం ఎస్ రాష్ట్ర 4 వ త్రై వార్షిక మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ పప్పుల సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విద్యార్థి భవన్ లో బి ఎం ఎస్ జిల్లా కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా గోదావరిఖని లో ఈ నెల 17 మరియూ 18 తేదీ లలో జరిగే రాష్ట్ర మహాసభలకు కరీంనగర్ జిల్లా నుండి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల అభివృద్ధి జరగాలి అంటే అది కేవలం బి ఎం ఎస్ తో మాత్రమే సాధ్యం అని స్పష్టం చేశారు. భారత దేశంలో రాజకీయాలకు అతీతంగా ఉన్న ఏకైక కార్మిక సంఘం బి ఎం ఎస్ అని అన్నారు. మహాసభలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. 93%ఉన్న అసంఘటిత రంగ




కార్మికుల కోసం ప్రభుత్వం ఆయా క్షేత్రంలో సంక్షేమ బోర్డు లను ఏర్పాటు చేయాలని తీర్మానం చేస్తామన్నారు. బిఎంఎస్ మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పసుల శ్రవణ్, తొర్తి శ్రీనివాస్, గజ్జెల హరికాంత్, నక్క అరుణ్, ఎండి సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులుగా కనకాల శ్యామ్ కుర్మ

### ఉపాధ్యక్షులుగా రావులకోల్ నరేష్ ప్రజాపతి ఎన్నిక

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 12:**
బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షునిగా తెలంగాణ రాష్ట్రం, మలక్ పెట్ నియోజక వర్గానికి చెందిన కనకాల శ్యామ్ కుర్మ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. నిన్న జరిగిన బీసీ యువజన సంఘం జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుని ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఉద్యమంలో అత్యంత క్రియాశీలకంగా పనిచేస్తూ, బీసీ విద్యార్థి, యువజన సమస్యలపై గత 15 సంవత్సరాలుగా పని చేస్తున్న శ్యామ్‌ను గుర్తించి జాతీయ అధ్యక్షునిగా బాధ్యతలు




అప్పగించినట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన శ్యామ్ కుర్మా మాట్లాడుతూ జాతీయస్థాయిలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో భాగంగా త్వరలోనే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పర్యటించి బీసీ యువజన సంఘం నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ, ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపచేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు, బీసీ యువజనుల సంక్షేమం కోసం చేస్తున్న తన కృషిని గుర్తించి, పోరాటాన్ని గుర్తించి జాతీయ బాధ్యతలు అప్పగించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్‌కు అయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు, అదేవిధంగా బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా రావులకోల్ నరేష్ కుమార్ ప్రజాపతిని ఈ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు...




# గాజా సరిహద్దులో ఇజ్రాయెల్ వైమానిక దాడి

### 63 మంది మృతి, పలువురికి గాయాలు

**గాజా,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** ఇద్దరు బందీలను కాపాడేందుకు దక్షిణ గాజాలోని రఫా సరిహద్దులో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 63 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఈ విషయాన్ని రఫా ఆస్పత్రి అధికారులు పేర్కొన్నారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారని తెలిపారు. అయితే, అంతకుముందు, యుద్ధంలో తొలిసారిగా హమాస్ దగ్గర బందీలుగా ఉన్న వారిలో ఇద్దరిని ఇజ్రాయెల్ సైన్యం కాపాడింది. రఫా నగరంలో అర్ధరాత్రి చేపట్టిన ఆపరేషన్‌లో వారిని రక్షించినట్లు ఇవాళ తెల్లవారు జామున ఐడీఎఫ్ వెల్లడించింది. ఇక, రఫాలో ఐడీఎఫ్, ఐఎస్ఏ (షిన్‌బెట్ సెక్యూరిటీ ఏజెన్సీ), పోలీసులు జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన ఫెర్నాండో సిమోన్ మార్మన్, లూయిస్ హర్ ను హమాస్ చెర నుంచి ఇజ్రాయెల్ సైన్యం కాపాడింది. వీరిని గతేడాది అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదులు నిర్ యిత్జక్ కిబుట్జ్ నుంచి కిడ్నాప్ చేశారని సైన్యం ప్రకటించింది. ప్రస్తుతం వారిద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని సైన్యం చెప్పుకొచ్చింది. అయితే, గాజాలో దాడుల తరువాత సుమారు 1.4 మిలియన్ల మంది రఫాలో నివసిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న తమ ప్రాంతంలోని అమాయక ప్రజలను ఇజ్రాయెల్ చంపేస్తుందని హమాస్ ఆరోపించింది. పాలస్తీనియన్లను చంపేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఇక, రాఫాకు ప్రజలు సురక్షితంగా చేరుకునేలా జాగ్రత్త తీసుకుంటానని ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు హామీ ఇచ్చారు. గాజా ప్రజలు ఈజిప్టుకు వెళ్లే విషయంలో కూడా ఉద్రిక్తత నెలకొంది. పాలస్తీనియన్లు తమ దేశంలోకి ప్రవేశించడం ఈజిప్టుకు ఇష్టం లేదు అని వెల్లడించింది.

# బీసీల ప్రయోజనాలను నెహ్రూ ఫ్యామిలీ అణచివేసింది

### బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్

**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** నెహ్రూ నుండి మొదలు పెడితే రాజీవ్ గాంధీ వరకు ఓబీసీ లకి, బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేశారన్నారు బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా మోడీ కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని ఎండగట్టారన్నారు. బీసీల ప్రయోజనాలను నెహ్రూ ఫ్యామిలీ అణచివేసిందని ఆయన మండిపడ్డారు. మోడీ ప్రశ్నలకి రాహుల్ గాంధీ తో సహా ఎవరు సమాధానం చెప్పలేదని, కాంగ్రెస్ అంబేద్కర్ ను అవమానించిన కాంగ్రెస్ ఇప్పుడు ఎస్సీ ఓట్ల కోసం తాపత్రయ పడుతున్నదన్నారు లక్ష్మణ్. మోడీ నీ రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు అవమానిస్తున్నారని, కర్పూరీ ఠాకూర్,చరణ్ సింగ్, పీవీ నరసింహా రావు కి భారత రత్న ఇవ్వడాన్ని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక పోతుందన్నారు లక్ష్మణ్. రామాలయ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఎందుకు బహిష్కరించింది చెప్పలేదని, హిందువులను ఆ పార్టీ అవమానించిందన్నారు ఎంపీ లక్ష్మణ్. హిందువుల ను, దేవి దేవతలను అవమంచడమే సెక్యులరిజం అని ఆ పార్టీ భావిస్తోందని ఆయన మండిపడ్డారు. అసదుద్దీన్ అసలైన మతతత్వ వాది అని, హిందత్వం కోసం



పనిచేస్తున్న ఏ వర్గాలను మోడీ ప్రభుత్వం విస్మరించలేదన్నారు లక్ష్మణ్. %దీ=వా% కేశవ రావు కూడా అయోధ్య రామ మందిరం పై పార్లమెంట్ లో చర్చిస్తే తప్పు పడుతున్నారన్నారు. వీళ్లకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ది చెప్పాలన్నారు. అయోధ్య పర్యాటక, ఆధ్యాత్మిక రంగంగా వెలుగొందుతోందని అన్నారు. రాముడు, రామసేతు మిథ్య అని కాంగ్రెస్ విమర్శలు చేస్తోందన్నారు. హిందువులను, హిందూ దేవుళ్లను విమర్శించడమే కాంగ్రెస్ లౌకిక వాదమని ఆరోపించారు. రాముడు మీద కాంగ్రెస్ అక్కసు వెళ్లగక్కిందని.. త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వం హిందుత్వం కోసం పని చేస్తుందనీ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ విమర్శిస్తున్నారన్నారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థుల ఎంపిక, బస్సు యాత్రలపై ఎన్నికల కమిటీ సమావేశాల్లో చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఎండగట్టడమే లక్ష్యంగా యాత్రలు నిర్వహిస్తామని లక్ష్మణ్ పేర్కొన్నారు.

# ప్రభుత్వం ఏర్పాటు దిశగా నవాజ్ షరీఫ్ ప్రయత్నాలు

**లాహోర్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** పాకిస్థాన్‌లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు దిశగా మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని 'పాకిస్థాన్ ముస్లిం లీగ్- నవాజ్ ' పార్టీ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు 'పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ 'తో జరుపుతున్న చర్చల్లో పురోగతి సాధించినట్లు కనిపిస్తోంది. పీపీపీ ఛైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ, అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీతో తమ అధ్యక్షుడు షెహబాజ్ షరీఫ్ ఆదివారం జరిపిన చర్చల్లో చాలా అంశాలపై సఖ్యత కుదిరినట్లు పీఎంఎల్-ఎన్ ప్రకటించింది. "రాజకీయ అనిశ్చితి నుంచి దేశాన్ని రక్షించేందుకు ఇరు పార్టీల మధ్య సూత్రప్రాయంగా అంగీకారం కుదిరింది" అని పేర్కొంది. త్వరలో జరగబోయే సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పీపీపీ నాయకత్వం వారి ప్రతిపాదనలను తమ ముందు ఉంచుతుందని పీఎంఎల్-ఎన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. యావత్ దేశ పరిస్థితిని సమీక్షించి.. ప్రస్తుతం నెలకొన్న రాజకీయ అనిశ్చితిని తొలగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. అలాగే భవిష్యత్‌లో రాజకీయ సహకారంపైనా వివరంగా చర్చించినట్లు వెల్లడించింది.



ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు తమ పక్షానే నిలిచారని చెప్పుకొచ్చింది. పీఎంఎల్-ఎన్‌తో కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించినట్లు పీపీపీ సైతం ధ్రువీకరించింది. ఆదివారం పాకిస్థాన్ ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఫలితాల ప్రకారం, 265 జాతీయ అసెంబ్లీ సీట్లకు జరిగిన ఎన్నికల్లో పీఎంఎల్-ఎన్‌కు 75 దక్కాయి. ఇమ్రాన్ సారథ్యంలోని పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (%ఠు×%) పార్టీ నుంచి స్వతంత్రులుగా పోటీచేసిన అభ్యర్థులు అత్యధికంగా 101 స్థానాలు సాధించారు. పీఎంఎల్-ఎన్ అధికారంలోకి రావాలంటే 54 సీట్లలో విజయం సాధించిన పీపీపీ మద్దతు తప్పనిసరి.

రెండు పార్టీలు కలిస్తే 129 సీట్లు అవుతాయి. 17 సీట్లు నెగ్గిన ఎంక్యూఎం-పీతోనూ నవాజ్ షరీఫ్ చర్చలు జరుపుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు 133 సీట్లు అవసరం. ఈ మూడు పార్టీలు కలిస్తే అధికారం సొంతమవుతుంది. ఈ పొత్తుకు ఇంకా ఎంక్యూఎం-పీ పచ్చజెండా ఊపలేదు.

# కాంగ్రెస్ సర్కార్ తీరుపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** కాంగ్రెస్ సర్కార్ తీరుపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తెలిపారు. జల హక్కుల కోసం రేపు కేసీఆర్ హాజరయ్యే ఛలో నల్గొండ సభ ఏర్పాట్లను జగదీశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంతో కాంగ్రెస్ లోపాయకారి ఒప్పందం చేసుకుంది. అందుకే రేవంత్ అప్పనంగా కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పారు. కాంగ్రెస్ అంటేనే మోసం.. నిండు సభలో అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్‌కు అలవాటే. సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు సాగర్ ప్రాజెక్టును ఆక్రమించడానికి ఏపీ వస్తే తామే తరిమేశాం అని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ సీఎం, మంత్రులు సాగర్ ప్రాజెక్టుకు ఎందుకు వెళ్లడం లేదు.? అక్కడ కేంద్ర బలగాలు ఎందుకు ఉన్నాయి..? అని ప్రశ్నించారు. కృష్ణా జలాల హక్కులపై బీఆర్ఎస్ పోరాటంతోనే కేఆర్ఎంబీకి అప్పగించలేదని కాంగ్రెస్ తీర్మానం చేసింది. కేసీఆర్ బయలుదేరారు అనగానే కాంగ్రెస్ వాళ్లకు వెన్నులో వణుకు పుట్టిందన్నారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల నుండి ప్రజలు, అన్నదాతలు సభకు భారీగా హాజరు కానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ తీరుపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు జగదీష్ రెడ్డి. సభ చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందన్నారు. అన్నదాతలు పార్టీలకు అతీతంగా తరలి వస్తున్నారు. ఇది రైతు గర్జన సభ అని అన్నారు. రైతులు పిడికిలి బిగిస్తే ఎంత పెద్ద పార్టీ అయినా భస్మం అవుతుందన్నారు. తమ కళ్ల ముందే నీళ్లు పోతుంటే రైతులు తట్టుకోలేక పోతున్నారని చెప్పారు. రేపు మధ్యాహ్నం 3 గంటలకు కేసీఆర్ సభకు వస్తున్నట్లు తెలిపారు జగదీష్ రెడ్డి.

# ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం

### ప్రమాదంలో ఐదుగురు సజీవదహనం

**మధుర,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు సజీవదహనమయ్యారు. ఈ విషాద ఘటన మధుర పరిధిలోని మహావాన్ వద్ద యమునా ఎక్స్ ప్రెస్ వే పై సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. 40 మంది ప్రయాణికులతో బీహార్ నుంచి ఢిల్లీ వైపు వెళ్తున్న బస్సు.. కారును ఢీ కొట్టడంతో ఐదుగురు మృతి చెందారు. వీరంతా సజీవ దహనమైనట్లు సమాచారం. బస్సు కారును ఢీ కొట్టడంతో మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. బస్సులో ఉన్న ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు.

కాగా.. సిక్కింలోని గ్యాంగ్ టక్ లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. రాణిపోల్ ప్రాంతంలో ఒక పాల ట్యాంకర్ రోడ్డుపై నిలబడి ఉన్న జనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి



చెందగా.. మరో 150 మంది గాయపడ్డారు. వారిలో 30 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. రాణిపూల్ లోని తాంబ్లా గేమ్ ఫెయిర్ లో ఆదివారం రాత్రి సుమారు 7.15 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రాణిపూర్ టాటా మైదానం జనాలతో కిటకిటలాడుతుండగా.. సిక్కిం మిల్క్ యూనియన్ ట్యాంకర్ రోడ్డుపై ఉన్న నాలుగు కార్లను ఢీ కొని.. జనాలపైకి దూసుకొచ్చింది. దీంతో పలువురు ట్యాంకర్ కింద పడి నలిగిపోయారు. ముగ్గురు ఘటనా ప్రాంతంలోనే మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను రాణిపూర్ ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో హైదరాబాద్ వాసి మృతి చెందింది.

హిమాచల్ ప్రదేశ్ లోని కులూలో ఆదివారం పారా గ్లైడింగ్ చేస్తూ.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ కు చెందిన నవ్య(26) మరణించింది. మనాలి సమీపంలోని దోభీ గ్రామంలో పారాగ్లైడింగ్ కు వెళ్లగా.. టేకాఫ్ అయిన కొద్దినిమిషాలకే టెన్డం ఫ్లైట్ లో ఈ దదుర్ఘటన జరిగింది. పర్యాటకురాలికి అమర్చిన సేఫ్టీ బెల్ట్ ను తనిఖీ చేయకుండానే పారాగ్లైడింగ్ కు వెళ్లడం వల్లే ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పారాగ్లైడింగ్ పైలట్ ను అరెస్ట్ చేశారు.



## యువరైతును పెళ్లాడే యువతికి 5 లక్షలివ్వండి

### సీఎం సిద్ధరామయ్యను కోరిన రైతులు

### సీఎం సిద్ధరామయ్య రైతు సంఘాల నేతలతో సమావేశం

**కర్ణాటక,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్‌కు ముందు సంప్రదింపుల కసరత్తులో భాగంగా సీఎం సిద్ధరామయ్య రైతు సంఘాల నేతలతో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలపై సభకు హాజరైన నేతలు హర్షం వ్యక్తం చేయగా.. రైతు సంఘంలో పౌష్టికాహారం పెంపుదల, సరస్సుల అభివృద్ధి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ అధికారుల నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు రైతు వర్గాల యువతలో ఆశలు రేకెత్తించేలా బడ్జెట్‌లో కార్యక్రమాలు చేపట్టాలని ఈ భేటీలో రైతుల నుంచి చాలా డిమాండ్లు వచ్చాయి.అయితే, ముఖ్యంగా రైతు యువకుడిని పెళ్లి చేసుకునే యువతికి 5 లక్షల రూపాయల ప్రోత్సాహాన్ని ఇవ్వాలని సీఎం సిద్ధరామయ్యను రైతులు కోరారు. సేద్యాన్ని నమ్ముకుని, ఏటా లక్షల రూపాయల ఆదాయాన్ని గడిస్తున్నా.. 45 ఏళ్లు వస్తున్నప్పటికీ యువ రైతులకు వివాహం కావడం లేదని రైతు సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, రైతు రుణమాఫీతో పాటు రైతును వివాహం చేసుకునే అమ్మాయికి 5 లక్షల రూపాయల ప్రోత్సాహాన్ని ఇవ్వాలని సిద్ధరామయ్యకు రైతు సంఘాల నాయకులువినతి పత్రాన్ని అందించారు. రాష్ట్ర బడ్జెట్ లో సేద్యానికి, వ్యవసాయ కార్మికులకు, రైతులకు నిధుల కేటాయింపునకు సంబంధించి రైతు సంఘాలకు చెందిన 218 మంది రైతులతో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సమావేశం అయ్యారు.

## పాండిచ్చేరిలో కాటన్ క్యాండీలపై నిషేధం


### లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై నిర్ణయం

**పాండిచ్చేరి,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** కేంద్ర పాలిత ప్రాంతం పాండిచ్చేరిలో కాటన్ క్యాండీ (తీపి తినుబండారం) విక్రయాలపై నిషేధం విధిస్తున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రకటించారు. విషపూరిత రసాయనాలను ఉపయోగించి కాటన్ క్యాండీలను తయారు చేయడంతో వీటిపై నిషేధం విధించారు. ఒక వీడియోలో పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ.. కాటన్ క్యాండీలో విషపూరిత రోడోమైన్ బీ ఉన్నట్లు ఆహార అధికారులు కనుగొన్నట్లు తెలిపారు. ఈ రసాయనాలు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. తమిళిసై తన అధికారిక సోషల్ మీడియా పేజీలో దీనికి సంబంధించిన ఒక వీడియో క్లిప్ షేర్ చేస్తూ.. పిల్లల కోసం కాటన్ క్యాండీలను కొనుగోలు చేయడం మానుకోవాలని, అందులోని రసాయనాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని తెలిపారు. కాటన్ క్యాండీలు విక్రయించే అన్ని దుకాణాలలో తనిఖీ చేయాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ తెలిపిన వివరాల ప్రకారం.. రోడోమైన్ బీ ఆహార పదార్థాలకు రంగు వచ్చేందుకు ఉపయోగించే రసాయనం. ఇది శరీరంలోకి ప్రవేశిస్తే కణాలలో ఆక్సీకరణ ఉద్రిక్తతకు కారణమవుతుంది. ఫలితంగా కాలేయ వైఫల్యంతో పాటు క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణం అవుతోంది.

## కాంగ్రెస్‌కు అశోక్ చవాన్ రాజీనామా

### బీజేపీలో చేరే అవకాశం

**మహారాష్ట్ర,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** సార్వత్రిక ఎన్నికల వేళ మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు గట్టి దెబ్బ తగిలింది. సీనియర్ నేత, మాజీ సీఎం అశోక్ చవాన్ కాంగ్రెస్‌కు



షాకిచ్చారు. పార్టీకి గుడ్ బై చెప్పారు. ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేశారు. ఆ లేఖను స్పీకర్ రాహుల్ నర్వేకర్‌కు పంపారని తెలుస్తోంది. ఆదివారం స్పీకర్ రాహుల్ నర్వేకర్ ను అశోక్ చవాన్ కలిశారు. స్పీకర్ కు బర్త్ డే విషెస్ చెప్పేందుకు వచ్చానని ఆ సమయంలో తెలిపారు. త్వరలో మహారాష్ట్రలో రాజ్యసభ ఎలక్షన్స్ జరగనున్నారు. ఈ క్రమంలో అశోక్ చవాన్ రాజీనామా చేయడంలో హాట్ టాపిక్ గా మారింది. ఆయన కాషాయ కండువా కప్పుకుంటారని వార్తలు వస్తున్నాయి. అశోక్ చవాన్ కు బీజేపీ రాజ్యసభ సీటు ఆఫర్ చేసిందని వార్తలు వస్తున్నాయి. లోక్ సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ కు వరుసగా షాకులు తగులుతున్నాయి. కీలక నేతలు హస్తం పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే మిలింద్ దేవ్ రా, బాబా సిద్ధిఖీ కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పేశారు. అజిత్ పవార్ ఎన్సీపీలో బాబా సిద్ధిఖీ చేరారు. ఏక్ నాథ్ షిండే శివసేన పార్టీలో మిలింద్ దేవరా చేరారు. ఇప్పుడు చవాన్ బీజేపీలో చేరే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది.

## ఆపదలో ఆలోచన


అనగనగా నాగిల్ల అనే ఊరిలో భానుప్రియ, సహస్ర అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వారిద్దరూ ఎక్కడికి వెళ్లినా కలిసి ఉండేవారు. ఒకసారి అనుకోకుండా ఇద్దరు దొంగలు వారిని చూసి ఎత్తుక పోవాలని అనుకున్నారు. దొంగలు సమయం కోసం చూస్తున్నారు. భానుప్రియ, సహస్ర ఇద్దరు కూడా దొంగల రాకను గమనించారు. దొంగలు ఎలాగైనా మనల్ని ఎత్తుకుపోతారు అనుకున్నారు.

ఇద్దరూ ఎలాంటి కంగారు లేకుండా మామిడి చెట్టు దగ్గరికి వెళ్లారు. దొంగలు కూడా వారి వెనకాల వస్తున్నారు. మామిడికాయలు రాలగొట్టడానికి రెండు రాళు తీసుకుని వెనకాల తిరిగి దబిమని అని దొంగలను కొట్టారు. రాళ్లు సరిగా దొంగల తలకు తగలడంతో అబ్బా అంటూ కింద పడ్డారు. మామిడికాయల కోసం తెచ్చుకున్న ఉప్పు కారం ఇద్దరు దొంగల కండ్లకు పూసి దొంగలు దొంగలు అని అరిచారు. చుట్టుపక్కల వాళ్ళు వచ్చి ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. భానుప్రియ, సహస్ర తెలివికి అందరు మెచ్చుకున్నారు.

**నీతి:** ఆపద వచ్చినప్పుడు ఆలోచనలతో బయటపడాలి



**- కీర్తన**
**ఆరవ తరగతి**
**ZPHS హవేలీ ఘనపూర్**
**మెదక్ జిల్లా, 9010214106**



## జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విషాదం

### విద్యుదాఘాతంతో కానిస్టేబుల్ మృతి

**జయశంకర్ భూపాలపల్లి ,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో ఓ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కలకలం రేపింది. కాగా..వణ్య ప్రాణాల కోసం ఏర్పాటు చేసిన కరెంట్ వైర్లు తగిలి విధి నిర్వహణలో ఉండగానే కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన కాటారం మండల పరిధిలోని నస్తూర్‌పల్లిలో చోటుచేసుకుంది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఏం జరిగిందో తెలుసుకోవాలని పై అధికారులకు విచారణ ఆదేశించారు. కరెంట్ తీగలు ఎవరు అమర్చారో తెలుసుకునే పనిలో దర్యాప్తు చేస్తున్నారు.నస్తూర్‌పల్లి అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది. కానిస్టేబుల్ ప్రవీణ్ మరికొందరు సిబ్బందితో కలిసి అడవిలో కూబింగ్ కు వెళ్లాడు. ఈ క్రమంలో వన్యప్రాణులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన కరెంట్ వైర్లు తగిలి ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి కరెంట్ షాక్ ట్రాప్ వేసిన నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. కానిస్టేబుల్ మృతి విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు పోవడం విచారకరమని తెలిపారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కరెంట్ వైర్లు వేసిన దుండగులను పట్టుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ ఆదేశించారు.

## తమిళనాడు అసెంబ్లీలో అరుదైన ఘటన

### అసెంబ్లీలో ప్రసంగం చదవని గవర్నర్

**తమిళనాడు,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** తమిళనాడు సర్కార్ కు ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్ రవి షాక్ ఇచ్చారు. స్టాలిన్ ప్రభుత్వానికి గవర్నర్ కు మధ్య ఉన్న విభేదాలు మరోసారి బయటపడ్డాయి. సోమవారం తమిళనాడు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు గవర్నర్ ఆర్.ఎన్ రవి అసెంబ్లీకి



వచ్చారు. గవర్నర్ ప్రసంగం ప్రారంభించిన కొద్ది నిమిషాలకే తన ప్రసంగాన్ని ముగించారు.ఆయన ప్రసంగం ప్రారంభంలో సీఎం స్టాలిన్, స్పీకర్, ఎమ్మెల్యేలకు శు భాకాంక్షలు చెప్పారు. అనంతరం తాను ప్రసంగం చదవడం లేదని చెప్పి ముగించారు. ప్రసంగంలోని అంశాలు సరిగా లేవన్నారు. ప్రసంగం ప్రారంభించే ముందు, పూర్తయిన తర్వాత జాతీయ గీతం ఆలపించాలని తాను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశానని గవర్నర్ ఆర్.ఎన్ రవి అన్నారు. కానీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అందుకే తాను ప్రసంగం చదవ లేదని గవర్నర్ తేల్చి చెప్పారు.ప్రసంగంలోని చాలా అంశాలపై తనకు అభ్యంతరాలున్నాయని గవర్నర్ ఆర్.ఎన్ రవి తేల్చి చెప్పారు. అసలు నిజాలు, క్షేత్రస్థాయి పరిస్థితులకు ప్రసంగంలోని అంశాలు ప్రతిబింబించడం లేదన్నారు. ఇటీవల కేరళ రాష్ట్రంలోనూ ఇలాంటి ఘటన జరిగింది. అక్కడి గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ కూడా ప్రసంగంలోని కేవలం లాస్ట్ పేరా చదవి గవర్నర్ ప్రసంగాన్ని ముగించారు.

## 2.9 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్

### బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అస్సాం సర్కారు

**అస్సాం,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను అస్సాం ప్రభుత్వం సోమవారం 2.9 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను సమర్పించింది. 774.47 కోట్ల లోటును బడ్జెట్ అంచనా వేసింది. ఇందులో కొత్త పన్ను ఏదీ ప్రతిపాదించలేదు. అస్సాం ఆర్థిక మంత్రి అజంతా నియోగ్, వచ్చే ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆర్థిక నివేదికను సమర్పిస్తూ, సమాజం నుండి బాల్య వివాహాలను తొలగించడానికి ప్రభుత్వం 10 లక్షల మంది బాలికలకు పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయి వరకు విద్యకు మద్దతు ఇస్తుందని చెప్పారు. 2024-25 బడ్జెట్ అంచనా ప్రకారం.. రాష్ట్ర ఏకీకృత నిధి కింద రూ. 1,43,605.56 కోట్లు వసూలయ్యాయి. పబ్లిక్ అకౌంట్ కింద రూ.1,44,550.08 కోట్లు, కంటింజెన్సీ ఫండ్ కింద రూ. 2,000 కోట్లు కలిపితే మొత్తం రూ.2,90,155.65 కోట్లు వచ్చాయి.2024-25లో కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి మొత్తం వ్యయం రూ.1,43,890.62 కోట్లుగా అంచనా వేయబడింది, పబ్లిక్ అకౌంట్ కింద రూ. 1,42,670.09 కోట్లు, ఆకస్మిక నిధి కింద రూ. 2,000 కోట్లు. మొత్తంగా.. సంవత్సరానికి ఖర్చు రూ. 2,88,560.71 కోట్లుగా అంచనా వేయబడింది.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిమాణం గురించి ఆర్థిక మంత్రి మాట్లాడుతూ, అస్సాం స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 2023-24లో రూ. 5.7 లక్షల కోట్లతో పోలిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 6.43 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు.

## గన్నవరం భవిష్యత్తు మారుస్తా

### ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తా

### టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

**విజయవాడ,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు పర్యటించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం కార్యకర్తలతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ.. టీడీపీ ప్రకటించిన ఆరు హామీలపై ప్రచారం చేశారు. చంద్రబాబు హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించడంతో పాటు 2024లో అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. అంతే కాకుండా.. స్థానిక సమస్యలపై యార్లగడ్డ ఆరా తీశారు. యువతను ఉత్సాహ పరిచేందుకు గ్రామంలోని పలు వీధుల్లో మోటారు బైక్‌పై తిరుగుతూ అభివాదం చేశారు.రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా టీడీపీకి పట్టం కడుదామని ఈవీఎంల్లో బటన్ నొక్కుదామని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.

రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుపై ఓటేసి టీడీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## రేషన్ షాపుల్లో మోదీ పోస్టర్లు..

### వ్యతిరేకించిన కేరళ సీఎం

**తిరువనంతపురం,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ షాపుల్లో ప్రధాని నరేంద్ర మోదీ పోస్టర్లు, బ్యానర్లు పెట్టాలన్న కేంద్రం ఆదేశాలు సరికాదని, దాన్ని అమలుచేయడం కష్టమని కేరళ ముఖ్యమంత్రి





పినరయి విజయన్ అన్నారు.
రాష్ట్ర అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో రేషన్ దుకాణాల్లో మోదీ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటుచేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిందా అని అడిగిన ప్రతిపక్ష ఎమ్మెల్యే పి.అబ్దుల్ హమీద్ ప్రశ్నకు ముఖ్యమంత్రి ఈవిధంగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ "రాష్ట్రంలో రేషన్ వ్యవస్థ ఎప్పటినుంచో ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం కొత్త పబ్లిసిటీ పద్ధతిని అనుసరిస్తుందని స్పష్టమవుతోంది." అని మండిపడ్డారు. ఈ ఆదేశాలు సరికావని, వాటిని రాష్ట్రంలో అమలుచేయడం కష్టమని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఈ విషయాన్ని భారత ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలా, లేదా అనే నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కేరళ పౌరసరఫరాల శాఖ మంత్రి జీఆర్ అనిల్ మాట్లాడుతూ 14 వేలకు పైగా ప్రధాని పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ), రాష్ట్ర ఆహార శాఖకు బాధ్యత అప్పగించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 550 రేషన్ దుకాణాల్లో పీఎం సెల్ఫీ పాయింట్లను ఏర్పాటుచేయాలని కేంద్రం ఆదేశించిందని, వాటిని తనిఖీ చేయాల్సిందిగా ఎఫ్‌సీఐ అధికారులకు సూచించామన్నారు. ఆహార పదార్థాల పంపిణీకి కేంద్ర ప్రభుత్వ గుర్తులున్న క్యారీ బ్యాగ్‌లను సరఫరా చేయాలని చెప్పారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ప్రచారం కోసం రేషన్ పంపిణీ వ్యవస్థను ఉపయోగించుకోవడం సరికాదని మంత్రి దుయ్యబట్టారు.

### ఇష్టానుసారం విడిగా నివసించే స్త్రీకి

## భరణం అడగొద్దు

### భర్త నుంచి భరణం అడిగే హక్కు లేదు

### మధ్యప్రదేశ్ జబల్‌పూర్ ఫ్యామిలీ కోర్టు కీలక తీర్పు

**జబల్‌పూర్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
ఒక మహిళ తన ఇష్టానుసారం విడివిడిగా జీవిస్తుంటే భర్త నుంచి భరణం పొందే హక్కు ఆమెకు లేదని మధ్యప్రదేశ్ జబల్‌పూర్‌లోని ఫ్యామిలీ కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు భర్త నుంచి విడివిడిగా ఉంటున్న మహిళ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. భర్త నుంచి విడిగా జీవించాలని మహిళ నిర్ణయించుకున్నందున ఆమెకు భరణం అడిగే హక్కు లేదని కోర్టు పేర్కొంది. కోర్టులో మహిళ దరఖాస్తును విచారించినప్పుడు, వారిద్దరూ డిసెంబర్ 15, 2020 నుండి విడిగా ఉన్నారని ఆమె భర్త చెప్పాడు. ఆ సమయంలో భార్యే విడిపోయిందని భర్త చెప్పాడు. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 9 కింద పొందిన దాంపత్య హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భర్త కోర్టును ఆశ్రయించాడు. మరోవైపు భార్య కూడా అతనిపై వరకట్న వేధింపుల ఫిర్యాదు చేసింది. దీంతో పాటు ఒప్పందం ప్రకారం తన భర్త నుంచి వచ్చిన రూ.12 లక్షల చెక్కు కూడా బౌన్స్ అయిందని ఆ మహిళ కేసు పెట్టింది. ఈ విషయం కుటుంబ న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి కేఎన్ సింగ్ ముందుకు వచ్చినప్పుడు, ఆమె వాంగ్మూలం ప్రకారంమహిళ పిటిషన్‌ను తిరస్కరించారు. తన భర్తతో కలిసి జీవించడం ఇష్టం లేదని మహిళ స్వయంగా చెప్పిందని, అలాంటప్పుడు ఆమెకు మెయింటెనెన్స్ అలవెన్స్ పొందే హక్కు ఎలా ఉంటుందని న్యాయమూర్తి కేఎన్ సింగ్ అన్నారు. దీంతో న్యాయమూర్తి మహిళ డిమాండ్‌ను అంగీకరించేందుకు నిరాకరించారు. అహ్మదాబాద్‌లో విడాకుల నిర్ణయం తోసిపుచ్చిన కోర్టు..



మరోవైపు, హిందువులలో వివాహం చాలా పవిత్రమైనదని, ఇతర మతాలలో లాగా రాజీ లేదని అహ్మదాబాద్‌లోని సెషన్స్ కోర్టు హిందూ జంట విడాకులను తిరస్కరించింది. ఈ సూచనతో ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని సెషన్స్ కోర్టు తిరస్కరించింది. విడాకుల పిటిషన్‌ను వెంటనే మంజూరు చేయకుండా ట్రయల్ కోర్టు వివాహాన్ని కాపాడే ప్రయత్నం చేసి ఉండాల్సిందని సెషన్స్ కోర్టు ఆదేశించింది. భార్యాభర్తలు పరస్పర విభేదాలను పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని న్యాయమూర్తి కోరారు.

## నష్టాలతో ముగిసిన సూచీలు

### 500 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్

**ముంబయి,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలు చవిచూశాయి. దిగ్గజ షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాలు సూచీలను పడ గొట్టాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు, పెద్దగా ప్రభావం చూపే అంశాలు లేకపోవడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఫలితంగా నేటి ట్రేడింగ్‌లో సూచీలు పతనమయ్యాయి. సెన్సెక్స్‌ఏకంగా 500 పాయింట్లకు పైగా దిగజారగా.. నిఫ్టీ 166 పాయింట్లు కోల్పోయింది.క్రితం సెషన్ నాటి ముగింపు (71,595.49)తో పోలిస్తే.. ఈ ఉదయం సెన్సెక్స్ 71,722 వద్ద స్వల్ప లాభంతో ట్రేడింగ్‌ను ప్రారంభించింది. అయితే, బ్యాంకింగ్‌తో పాటు ఇతర రంగాల్లో ప్రధాన షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఒక దశలో 70,922.57 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. చివరకు 523 పాయింట్లు దిగజారి 71,072.49 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 166.50 పాయింట్లు పతనమై 21,616 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి రూ.83గా ఉంది. ఐటీ, హెల్త్‌కేర్ మినహా దాదాపు అన్నిరంగాల సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, లోహ, చమురు రంగ సూచీలు 1-4 మేర కుంగాయి. నిఫ్టీలో కోల్ ఇండియా, హీరో మోటార్స్, భారత్ పెట్రోలియం, ఓఎన్జీసీ, ఎన్టీపీసీ షేర్లు నష్టపోగా.. రెడ్డీస్ ల్యాబ్స్, అపోలో హాస్పిటల్స్, విప్రో, దివిస్ ల్యాబ్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు స్వల్ప లాభాలను దక్కించుకున్నాయి.

### జగన్ రాజకీయ లబ్ధికి

## కేసీఆర్ సహకరించారు

### నదీ జలాలపై గత ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది

### మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్న

**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
నదీ జలాల విషయంలో గత ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావుప్రశ్నించారు. నీటి సమస్యలు పరిష్కరించకుండా కేంద్రానికి ఎందుకు మద్దతు తెలిపారని నిలదీశారు. అసెంబ్లీలో కృష్ణా ప్రాజె క్టులు, కేఆర్ఎంబీ సంబంధిత అంశాలపై చర్చ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. "ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీలో కలిపినప్పుడు ఎందుకు



ప్రశ్నించలేదు? కేంద్రం వద్ద భారాస సర్కారు ఎందుకు మోకరిల్లింది? పదేళ్లపాటు భారాస సర్కారు న్యాయమైన తెలంగాణ వాటా సాధించలేకపోయింది. ఆ పార్టీ నేతలు తాము చేసిన తప్పులను అంగీకరించకుండా బుకాయిస్తు న్నారు. సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతి జరగలేదని హరీశ్‌రావు చెప్పగలరా? ప్రాజెక్టుల్లో రూ.వేల కోట్ల అవినీతి జరిగింది. దీనిపై నేను ఆధారాలు చూపిస్తా. అప్పట్లో విద్యాసాగర్‌రావు సాగునీటి మంత్రి అయితే ఈ పరిస్థితి ఉండేది కాదు. కేసీఆర్‌కు చంద్రబాబుకు రాజకీ యంగా సరిపడదు. ఆయన రెండోసారి సీఎం కాకూడదని కేసీఆర్ భావించారు. జగన్‌కు రాజకీయ లబ్ధి కలగాలనే కేసీఆర్ సహకరించారు. రాయలసీమ ఎత్తిపోతలకూ మద్దతిచ్చారు" అని జూపల్లి చెప్పారు.

### నరేంద్ర మోడీని ఆపబోయేది

## మీ మేనల్లుడే...

### నితీష్‌ను ఉద్దేశించి తేజస్వి యాదవ్ తీవ్ర విమర్శలు

**బీహార్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
బీహార్‌లో జేడీయూ బీజేపీ మద్దతుతో సర్కారును ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నితీష్ సర్కారు నేడు బలపరీక్షను ప్రవేశపెట్టింది. బలపరీక్షకు ముందు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ నితీష్ కుమార్‌పై తీవ్ర



విమర్శలు చేశారు. రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోడీని ఆపబోయేది మీ "మేనల్లుడే" అని నితీష్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. బీహార్‌లో బీజేపీని తాము ఎదుర్కొంటామన్నారు. ముఖ్యమంత్రి మళ్లీ పార్టీ మారరని ప్రధాని హామీ ఇవ్వగలరా అని మాజీ ఉప ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఒక టర్మ్‌లో మూడుసార్లు సీఎంగా ప్రమాణం చేసిన సీఎంగా నితీష్‌కుమార్ మిగిలిపోతారని తేజస్వీయాదవ్ పేర్కొన్నారు. ముఖ్య మంత్రి నితీష్ విషయంలో జేడీయూ ఎమ్మెల్యేలు బాధపడతారని.. ఎందుకంటే వారు ప్రజల్లోకి వెళ్తే.. ప్రజల నుంచి వచ్చే పలు ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుందన్నారు. మీ నాయకుడు మూడు సార్లు సీఎంగా ఎందుకు ప్రమాణ స్వీకారం చేశారని ఏం చెబుతారని ప్రశ్నించారు. గతంలో బీజేపీని తిట్టి.. ఇప్పుడు అదే పార్టీపై పొగడ్తలు కురిపిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తే ఏం సమాధానం ఇస్తారని జేడీ(యూ) ఎమ్మెల్యేలను తేజస్వీ ప్రశ్నించారు. సీఎం నితీష్‌కుమార్‌ను తాము ఎల్లప్పుడూ గౌరవిస్తామన్నారు. తాను బీహార్‌లో కొత్త ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడ్డానని, తొమ్మిది సార్లు ప్రమాణ స్వీకారం చేసి చరిత్ర సృష్టించినందుకు ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ అన్నారు. నితీష్‌ను తేజస్వి యాదవ్ మామా అని పిలుస్తారనే విషయం తెలిసిందే.

### విహారయాత్రలో

## విషాదం..

### సీతపల్లి వాగులో మునిగి ముగ్గురు విద్యార్థులు మృతి

**రంపచోడవరం,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
విహారయాత్రకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. ఈ విషాద సంఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం ఐ. పోలవరం గ్రామం సీతపల్లి వాగులో జరిగింది.. ఈ




ఘటనతో గోకవరం మండలం రంపఎర్రంపాలెం గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. ఈ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఆదివారం కావడంతో రంపచోడవరం విహారయాత్రకు వెళ్లారు. సీతపల్లి వాగులో సరదాగా దిగి స్నానం చేస్తుండగా వారిలో ముగ్గురు వాగు లోతుల్లోకి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోయారు. మిగిలిన ఇద్దరూ బయట పడ్డారు. పదహారేళ్ల వీర వెంకట అర్జున్ , అండిబోయిన దేవి చరణ్ , లావేటి రామన్ లు గల్లంతు అయ్యారు. వెంటనే సమాచారం తెలుసుకున్న రంపచోడవరం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలు వెలికితీశారు.. అనంతరం పోస్టుమార్టం కోసం రంపచోడవరం ఆసుపత్రికి తరలించారు. దీనితో రంప ఎర్రంపాలెంలో విషాదం అలముకుంది. ఈ ఘటన మూడు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది.. చిన్నారులు మృతిచెందడంతో.. వారి కుటుంబ సభ్యులను అదుపుచేయడం ఎవ్వరివల్లా కావడం లేదు.

### చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై

## విచారణ వాయిదా

### ఈనెల 26కు వాయిదా వేసిన ధర్మాసనం

**అమరావతి,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం ఈనెల 26కు వాయిదా వేసింది. సీనియర్ న్యాయవాది హరీశ్‌సాల్వే అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేయాలని చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరారు. మూడు వారాల తర్వాత విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సీఐడీ తరఫు న్యాయవాది రంజిత్‌కుమార్ స్పందిస్తూ కౌంటర్ దాఖలుకు గతంలో సమయం తీసుకుని ఇప్పుడు మళ్లీ వాయిదా కోరుతున్నారని కోర్టుకు తెలిపారు. చంద్రబాబు తరఫున కౌంటర్ దాఖలు చేశారని చెప్పారు. విచారణకు తేదీని నిర్ణయించాలని కోరారు. తొలుత రెండు వారాల తర్వాత లిస్ట్ చేయాలని ఆదేశించిన ధర్మాసనం.. రంజిత్‌కుమార్ విజ్ఞప్తితో ఈనెల 26కి వాయిదా వేసింది.






# నేరాల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకం

- కేసుల పరిష్కారంలోనూ కీలకంగా ఫుటేజి
- నిందితుల పట్టివేతలో తోడ్పడుతున్న దృశ్యాలు
- శాంతి భద్రతల పరిరక్షణలోనూ ముఖ్య భూమిక


**హైదరాబాద్, ఫిబ్రవరి12(వెలుతురు):**
శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. అందుకే వీటిని ఏర్పాటుఏ చేసేందుకు హైదరాబద్ సహా అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. ఇకపోతే హైదరాబాద్‌లో ఏర్పాటయిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం ద్వారా అన్ని జిల్లాలను అనుసంధానం చేస్తారు.



అప్పుడు జిల్లాల్లో కూడా ఎప్పుడు ఏం జరిగినా ఇట్టే పసిగట్టే అవకాశం ఉంది. ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటవుతున్నాయి. అలాగే కొందరు ఔత్సాహికుల ద్వారా కూడా ఏర్పాటు చేయిస్తున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. కేసులను పసిగట్టి కూపీ లాగడంలోనూ బాగా పనికి వస్తున్నాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహి స్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని పోలీస్ అధికారులు కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించ గలిగారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదన్నారు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమేరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయని డీజీపీ తెలిపారు. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రాన్ని నేరరహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తున్నది. ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు సాగుతున్నారు. ఇటీవల అనేక కేసుల పరిష్కారంలో సిసి కెమెరాల ఫుటేజీ కీలకంగా మారింది.

# కెఆర్ఎంబిపై అసెంబ్లీలో తీర్మానం

## మేం మద్దతు ఇస్తామన్న కవిత



**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు):** కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించ బోమంటూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. చేసిన తప్పును సరిదిద్దుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ లేనిపోని ఆరోపణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. అసెంబ్లీలో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణ నీటి హక్కులను వదులుకునే మనిషి కాదన్న సంగతి ప్రజలందరికీ తెలున్నారు. జలాల సాధన కోసమే తెలంగాణ ఉద్యమం చేశామని, కాబట్టి నీటి హక్కుల విషయంలో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ రాజీ పడబోదని తేల్చి చెప్పారు. కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడానికి జరిగిన సమావేశాల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రాజెక్టులను ధారాదత్తం చేసి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద తప్పు చేసిందని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి తమపై లేనిపోని ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పచెప్పే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటూ శాసన సభ, మండలిలో తీర్మానం తీసుకరావాలని, తమ పాపాలను ప్రక్షాళన చేసుకోవాలని చెప్పారు. తెలంగాణ హక్కుల విషయంలో బీఆర్ఎస్ సంపూర్ణ మద్దత్తు ఉంటుందని స్పష్టం చేశారు.

# అమెరికా చర్చిలో కాల్పుల కలకలం..

## పోలీసుల కాల్పుల్లో నిందితురాలి మృతి

### హూస్టన్ మెగా చర్చికి తుపాకీతో వచ్చిన మహిళ

### ప్రార్థనలు జరుగుతుండగా కాల్పులు

### వెంట వచ్చిన ఐదేళ్ల బాలుడికి బుల్లెట్ గాయాలు



**హూస్టన్,ఫిబ్రవరి12(వెలుతురు):**
అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం చోటుచేసుకుంది. ప్రార్థనల కోసం వేల మంది హాజరయ్యే చర్చిలో ఓ మహిళ తుపాకీతో కాల్పులు జరిపింది. దీంతో ప్రార్థనలు చేస్తున్న జనమంతా భయాందోళనలతో పరుగులు తీశారు. ఓ వృద్ధుడికి బుల్లెట్ గాయమైంది. చర్చిలో ఉన్న భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరపడంతో నిందితురాలు అక్కడికక్కడే చనిపోయింది. ఆమె వెంట వచ్చిన ఐదేళ్ల బాలుడికీ బుల్లెట్ గాయాలయ్యాయి. హూస్టన్ లోని మెగా చర్చిలో ఆదివారం ప్రార్థనల సమయంలో ఈ దారుణం జరిగింది.
హూస్టన్‌లోని లేక్ వుడ్ మెగా చర్చిలో ఆదివారం మధ్యాహ్నం ప్రార్థనలు జరుగుతుండగా ఓ 30 ఏళ్ల వయసున్న మహిళ పొడవాటి కోటుతో వచ్చింది. ఐదేళ్ల బాలుడితో పాటు వచ్చిన ఆ మహిళ.. తన కోటు వెనకాల తుపాకీని దాచి తెచ్చింది. లోపల అడుగుపెట్టిన కాసేపటికే తుపాకీ తీసి విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. పెద్దగా కేకలు వేస్తూ తన దగ్గర బాంబు ఉందని, దానిని పేల్చేస్తానని బెదిరించింది. దీంతో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు.
ఎదురు కాల్పులు జరిపి నిందితురాలిని మట్టుబెట్టారు. నిందితురాలు జరిపిన కాల్పుల్లో ఓ వృద్ధుడు గాయపడ్డాడు. నిందితురాలి వెంట వచ్చిన బాలుడికి కూడా బుల్లెట్ గాయాలయ్యాయని, ప్రస్తుతం బాలుడి పరిస్థితి సీరియస్ గా ఉందని పోలీసులు తెలిపారు. కాగా, నిందితురాలు ఎవరు, ఎందుకు కాల్పులు జరిపింది, ఆమె వెంట వచ్చిన బాలుడు ఎవరనే వివరాలు ఇంకా తెలియరాలేదని, విచారణ జరుపుతున్నామని హూస్టన్ పోలీస్ చీఫ్ మీడియాకు వెల్లడించారు.

# బలపరీక్షలో నెగ్గిన నితీష్ కుమార్ ప్రభుత్వం

## మద్దతుగా నిలిచిన 129 మంది ఎమ్మెల్యేలు

**బీహార్,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
బీహార్ అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో ముఖ్య మంత్రి నితీష్‌కుమార్ సర్కార్ విజయం సాధించింది. అసెంబ్లీలో జరిగిన ఫ్లోర్ టెస్ట్‌లో సీఎం నితీశ్ కుమార్‌కు 129 మంది ఎమ్మెల్యేలు మద్దతుగా నిలిచారు. దీంతో ఆయన బలపరీక్షలో సునాయసంగా గట్టెక్కేశారు. మరోవైపు అసెంబ్లీ నుంచి విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు.



అంతకముందు ఆర్జేడీకి మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేలందరినీ హైదరాబాద్‌లో ఉంచారు. జేడీయూకు చెందిన కొంత మంది ఎమ్మెల్యేలు నితీష్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తారేమోనని ప్రచారం జరిగింది. కానీ మొత్తానికి నితీష్ కుమార్ ఫ్లోర్ టెస్ట్‌లో నెగ్గారు. ఇటీవలే ఆయన ఎన్డీఏ కూటమిలో చేరారు. బీజేపీ ఎమ్మెల్యేలంతా నితీష్‌కు మద్దతుగా నిలవడంతో బలపరీక్షలో విక్టరీ సాధించారు. బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలున్నాయి. మ్యాజిక్ ఫిగర్‌కి 122 సీట్లు ఉండాలి. నితీష్ వర్గం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. దీంతో సభలో ఉన్న 129 మంది ఎమ్మెల్యేలంతా నితీష్‌కు మద్దతుగా ఓటు వేశారు. దీంతో అవిశ్వాస తీర్మానంలో నితీష్ సర్కార్ సునాయసంగా గట్టెక్కేసింది.ఇటీవలే ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాకూటమి నుంచి జేడీయూ బయటకు వచ్చి ఎన్డీఏతో జతకట్టింది.
ముఖ్యమంత్రి పదవికి నితీష్ రాజీనామా చేసిన రోజే.. కొన్ని గంటల్లో బీజేపీ మద్దతుతో నితీష్‌కుమార్ తొమ్మిదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి హిస్టరీ సాధించారు. సోమవారం జరిగిన బలపరీక్షలో కూడా ఆయన విజయం సాధించారు.

# రాజస్థాన్‌లో ఘోర ఘటన

## ఉద్యోగాల ఆశచూపి అంగన్‌వాడీలపై సామూహిక అత్యచారాం

## మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్లపై కేసులు

**జయపుర,ఫిబ్రవరి12(వెలుతురు):**
ఉద్యోగం ఆశ చూపించి 20మంది మహిళలపై ఇద్దరు అధికారులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘోర ఘటన రాజస్థాన్ లోని పాలి జిల్లా సిరోహిలో కేసు నమోదైంది. సిరోహి మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్ మహేంద్ర మేవాడా, మాజీ కమిషనర్ మహేంద్ర చౌదరిపై గ్యాంగ్ రేప్ కేసు ఫిర్యాదు వచ్చింది. రెండు నెలల క్రితం అంగన్ వాడీలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ పాలి జిల్లాకు చెందిన మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు డీవైఎస్పీ పరాస్ చౌదరికి ఫిర్యాదు చేసింది. తనతో పాటు మరో పది 15 మందికి ఓ చోట వసతి ఏర్పాటు చేసి, తినే ఆహారంలో మత్తు పదార్థాలు కలిపి ఇచ్చారని, తర్వాత చైర్మన్, కమిషనర్ వారిపై సామూహిక అత్యాచారం చేసినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. వీడియోలు తీసి ఒక్కొక్కరూ రూ.5లక్షలు ఇవ్వాలని లేదంటే వీడియోలను వైరల్ చేస్తామంటూ ఇప్పుడు బ్లాక్ మెయిల్ చేస్తు?న్నారని బాధితురాలు చెప్పింది. వారితో అక్రమ సంబంధం పెట్టుకోవాలని బెదిరించారని, ఉద్యోగాల సాకుతో ఖాళీ స్టాంప్ పేపర్లపై సంతకాలు తీసుకున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. సిరోహి మహిళా పోలీస్ స్టేషన్‌కు గతంలో కూడా ఇలాంటి కేసు వచ్చింది. కానీ, అది తప్పు అని తేలింది. దీంతో దానిపై కూడా ఇప్పుడు కేస్సు ÷ల్ చేయాలని రాజస్థాన్ హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

# తెలంగాణలో పలుచోట్ల వర్షాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి12(వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలో ఓమోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు. ఆదివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షం పడిందని చెప్పారు. అదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో వర్షం పడిందని తెలిపారు.
అందుకే ఉష్ణోగ్రతలు తగ్గుమొఖం పట్టాయని చెప్పారు. ఫిబ్రవరి 16 నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతాయని అంచనా వేశారు.
మరో వైపు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉన్నాయి. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ఎలానింగ్ సొసైటీ డేటా ప్రకారం చాలా ప్రాంతాలు 33 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉన్నాయి. అయితే, కొన్ని ప్రాంతాల్లో 34 డిగ్రీల సెల్సియస్‌ను అధిగమించిన ఎండ ప్రభావితం చూపలేక పోయింది.

# రాజయ్య రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం..!?

## కాంగ్రెస్‌లో చేరాలన్న ఆకాంక్షపై ప్రతికూలత



**జనగామ,ఫిబ్రవరి12(వెలుతురు):**
తెలంగాణ తొలి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే తాటకొండ రాజయ్య రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఆయనను గత పాపాలు వెన్నాడుతున్నాయి. కాంగ్రెస్‌లో చేరి రాజకీయంగా లబ్ధిపొందాలనుకున్న ఆయనకు సొంత నియోజకవర్గంలో గతంలో మహిళలను వేధించిన వ్యవ హారం వెన్నాడుతోంది. ఆయనను కాంగ్రెస్‌లోకి రానీయవద్దని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో రాజకీయంగా ఇక ఆయన చాప్టర్ క్లోజ్ అయినట్లేనని అంటున్నారు. దీంతో రాజయ్య పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. అటు కాంగ్రెస్‌లోకి వెళ్లలేక, బిఆర్ఎస్‌లో కొనసాగలేక ఇక నామ మాత్రంగా ఉండే పరిస్థితులు దాపురించాయి. ఈ నెల 3వ తేదీన బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన రాజయ్య.. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధమయ్యారు. కాంగ్రెస్‌లో రాజయ్య చేరికకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ఏడాది డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజయ్యకు గులాబీ పార్టీ టికెట్ ఇవ్వకుండా కేటాయించారు. టికెట్‌కు బదులు రాష్ట్ర రైతుబంధు చైర్మన్ పదవి ఇచ్చారు. మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి కావడంతో రాష్ట్రంలో గులాబీ పార్టీ అధికారం కోల్పోవాల్సి వచ్చింది. టికెట్ రాకపోవడంతో తాటికొండ రాజయ్య వరంగల్ ఎంపీ కోసం ప్రయత్నాలు చేశారు. ఎంపీ టిక్కెట్ రాదని తెలుసుకున్న రాజయ్య బీఆర్ఎస్ పార్టీ, పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్ లపై ఆరోపణలు చేస్తూ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా రోజు ఏ పార్టీలో చేరుతాననే విషయాన్ని చెబుతానని రాజయ్య మీడియాతో చెప్పారు. ఇంతలో సీన్ రివర్స్ అయ్యింది. రాజయ్యను కాంగ్రెస్ పార్టీలో తీసుకోవద్దని స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలోని ఆయా మండల పార్టీ అధ్యక్షులు అధిష్టానానికి విన్నవించు కున్నారు. అంతటితో ఆగకుండా రెండురోజుల క్రితం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని కాంగ్రెస్ భవన్ ఎదుట ఆందోళన చేశారు. కామాంధుడైన రాజయ్యను ఎట్టి పరిస్థితుల్లో పార్టీలోకి తీసుకు రావద్దని అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహలతో రాజయ్య మంతనాలు చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి ఒకే చెప్పారు. అయితే నియోజకవర్గ కాంగ్రెస్ నేతల నుంచి వ్యతిరేకత ఎదురవడంతో పాటు వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు రాజయ్యపై విముక్త వ్యక్తం చేస్తున్నారు. అయినా రాజయ్య తన ప్రయత్నాలను ఢిల్లీ కేంద్రంగా కొనసాగించిన ఢిల్లీ పెద్దలు మొహం చాటేసినట్లు సమాచారం. దీంతో రాజయ్య రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం నుంచి తాటికొండ రాజయ్య ఎమ్మెల్యేగా గెలిచారు. తెలంగాణ ఉద్యమం ఎగిసి పడుతుండడంతోపాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరిగే పరిస్థితి లేకపోవడంతో అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తాటికొండ రాజయ్య ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉద్యమ పార్టీ టిఆర్ఎస్‌లో చేరారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికలతో పాటు 2014, 2018 ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నుండి గెలిచారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన మంత్రివర్గ విస్తరణలో రాజయ్య తొలి ఉపముఖ్య మంత్రి పదవి వరించింది. అయితే కొద్ది రోజులకే వివిధ ఆరోపణలు ఎత్తడంతో పార్టీ అధినేత కేసీఆర్ రాజయ్య పదవికి రాజీనామా చేయించారు. దీంతో రాజయ్య ఎమ్మెల్యేకే పరిమితమయ్యారు. రాజయ్య పై సొంత పార్టీకి చెందిన మహిళ లైంగిక ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి వరంగ్ల లోక్‌సభకు పోటీచేయాలనుకున్నా పరిస్థితి ప్రతికూలంగా మారింది.

# పంజాబీ దమ్ ఆలూ రెసిపి





దమ్ ఆలూగా కూడా పిలిచే ఈ వంటకం చక్కగా ఉడికిన, మసాలా దినుసులన్నీ కూరబడిన ఆలూ, ఇంకా కస్తూరి మెంతులు, జీలకర్ర, జీడిపప్పు, ఏలకులు, దాల్చిన చెక్క, ఇతర భారతీయ దినుసులన్నీ వేసి నోరూరించే కూరల అద్భుతమైన కాంబినేషన్.



పంజాబీ దమ్ ఆలూ వంటకం ప్రపంచంలోనే నోరూరించే పంజాబీ ఆహార స్టైల్ నుంచి వచ్చింది. మొదటిసారి రుచి చూసినప్పటినుండి అందరికీ అభిమాన ఆలూ రెసిపి అయిపోయింది. ఇది సులభంగా వండుకోగలిగే వంటకం,పైగా ఆఖరున నోరూరించే కూర తయారైనప్పుడు మనకి ఇంకా ఇంకా తినాలనిపించే వంటకం కాబట్టి పంజాబీ ఆలూ ఎన్నటికీ బోర్ కొట్టదు. పంజాబీ ఆహారంలోనే ముఖ్య వంటకమైన పంజాబీ ఆలూ రెసిపి భారతీయ ప్రసిద్ధ వంటకంగా ప్రపంచంలో పేరు తెచ్చుకుంది.దీన్ని మీరు దాదాపు ఏ పెళ్ళిలోనైనా ,ఇతర ఫంక్షన్లలోనైనా చూడవచ్చు. ఈ రెసిపిలో ప్రత్యేకత ఏంటంటే ఇది మామూలుగా పెరుగుకి సంబంధించిన తడి కూర అయినా కూడా, మనం దీన్ని పొడి దమ్ ఆలూ మసాలాగా మార్చుకుని ముఖ్య భోజనం ముందు వంటకంలా వడ్డించుకోవచ్చు.

### కావలసినవి

1.చిన్న బంగాళదుంపలు 15–18 2.కొత్తిమీర చేతికి పట్టినన్ని 3.టమాటా ప్యూరీ 3/4 కప్పు 4.పెరుగు 3/4కప్పు 5.నూనె 5చెంచాలు 6.ఉల్లిపాయ 1 కప్పు 7.అల్లంవెల్లుల్లి పేస్టు 1 చెంచా 8.జీలకర్ర 1 చెంచా 9. జీడిపప్పు 6–7 10. దాల్చినచెక్క 1 ముక్క 11.ఏలకులు1 12.లవంగాలు1 13.ధనియాలు 1చెంచా 14.కస్తూరి మెంతులు 1 చెంచా 15. పంచదార 1 చెంచా 16.కారం 1 చెంచా 17.ఉప్పు1 చెంచా 18. ఇంగువ1 చెంచా 19. బిర్యానీ ఆకు 1 20.పసుపు 1 చెంచా

### తయారు చేసే విధానం:

1. మిక్సీ జార్‌లో ధనియాలు, దినుసులు, జీడిపప్పు, జీలకర్ర అన్నీవేసి మెత్తని పొడిలా మిక్సీ పట్టండి.
2. కుక్కర్ తీసుకుని నీళ్ళు పోసి, బంగాళదుంపలు వేయండి.
3. బంగాళదుంపలు మెత్తగా అయ్యేవరకు కుక్కర్ లో ఉడికించండి.
4. బంగాళదుంపల తొక్క తీసేసి, ఫోర్క్ తో ఆలూలలో గుచ్చండి. దానివలన దినుసులు లోపలి వరకూ వెళ్తాయని ఖచ్చితంగా తెలుస్తుంది.
5. ఒక పెనం తీసుకుని, నూనె వేసి, బంగాళదుంపల పైపొర గోధుమరంగులోకి మారేదాకా వేయించండి.
6. ఇంకో పెనం తీసుకుని, నూనె,బిర్యానీ ఆకు, అల్లం వెల్లుల్లి పేస్టు, ఉల్లిపాయ ముక్కలు వేసి ఉల్లిముక్కలు లేత బ్రౌన్ రంగులోకి మారేదాకా కలపండి.
7. టమాటా ప్యూరీని వేసి మళ్ళీ కలపండి.
8. ప్యూరీ గట్టిపడుతుంటే, మసాలా దినుసుల మిశ్రమాన్ని వేసి ఆపకుండా కలుపుతూ ఉండండి.
9. పెరుగు, కారం, ఉప్పు వేసి బాగా కలపండి
10. పసుపు, పంచదార వేసి 23నిమిషాలు కలిపి నీళ్ళు ఆఖరిలో పోయండి.
11. కస్తూరి మెంతులు వేసి ఒక నిమిషం కలపండి.
12. మూతలు ఉంచి కొన్ని నిమిషాలు ఉడకనివ్వండి, కూర గట్టిపడుతూ, అన్ని దినుసుల వాసన మీకు తెలుస్తుంది.
13. బంగాళదుంపలను ఈ కూరలో వేసి బాగా కలపండి.
14. బంగాళదుంపలు కూరలో వేసి ఉడికించాక, దమ్ ఆలూను బౌల్ లోకి తీయండి. 15.ఇక దీన్ని కొత్తిమీరతో పైన అలంకరించి చపాతీ లేదా పూరీకి పక్కన వంటకంలా వడ్డించండి.



## రుచికరమైన కాకరకాయ చిప్స్

**కావలసిన పదార్థాలు**

కాకరకాయలు – అరకిలో
ఎండుకొబ్బరి తురుము – పావుకప్పు
జీడిపప్పు – పావుకప్పు
పసుపు – 1 టీ స్పూన్
కారప్పూస – అరకప్పు
పంచదార – పావుకప్పులో సగం
జీలకర్ర 1 టీ స్పూన్
కరివేపాకు 1 కట్ట
కారం – 2 టీ స్పూన్లు
నూనె – అరకప్పు
ఉప్పు తగినంత

**తయారీ విధానం**

కాకరకాయలకు పొట్టు, లోపలి గింజలు తీసి గుండ్రంగా చిన్న ముక్కలు కోయాలి. వీటిలో ఉప్పు, పసుపు, మంచినీళ్లు పోసి ఉడికించి ఆ నీళ్లని వంపేయాలి. మళ్లీ వీటిలో పంచదార, మంచినీళ్లు పోసి ఉడికించి, మిగిలిన నీళ్లన్నీ పిండేయాలి.

బాండీలో నూనె వేడి చేసి జీలకర్ర, ఇంగువ, పసుపు, కరివేపాకు వేయించాలి. అందులోనే ఉడికించిన కాకరకాయ ముక్కలు కొద్దిగా వేయించాలి. తర్వాత ఎండుకొబ్బరి, కారప్పూస, వేయించిన జీడిపప్పు, కారం, ఉప్పు కలిపి చివర్లో కొత్తిమీర తరుగు చల్లాలి.

- పసుపు నీటితో వంటగదిని శుభ్రం చేయడం వల్ల ఈగలు దరి చేరవు.
- క్యాబేజీని ఉడికించే సమయంలో వాసన వస్తుంటుంది. వాసన రాకుండా ఉండాలంటే చిన్నం అల్లం ముక్క వేసి తేడాను గమనించండి.

## కాలీఫ్లవర్ రుచులు

### కాలీఫ్లవర్ వల్కానో

**కావలసినవి:** కాలీఫ్లవర్1 (పెద్దది), వైట్‌సాస్3 కప్పులు చీజ్అరకప్పు, ఉప్పుతగినంత మిరియాలపొడితగినంత వైట్‌సాస్ తయారీకి వెన్న ఒకటిన్నర టేబుల్ స్పూన్లు కార్న్‌ఫ్లోర్ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, పాలు 3కప్పులు

**తయారుచేసే విధానం:** ఒకసాస్‌లో వెన్నను కరిగించి, కార్న్‌ఫ్లోర్‌ను దానికి బాగా కలిపి పాలుపోయండి. సన్నని మంటమీద కలుపుతూ, సాస్ చిక్కబడేంతవరకూ ఉడికించండి. తగినంత ఉప్పును చేర్చండి వైట్‌సాస్ తయారవ్వతుంది. కాలీఫ్లవర్‌ను అడుగుచెక్కి శుభ్రంగా కడగండి. ప్రెషర్ కుక్కర్‌లో ఉంచి, ఉడికించండి. అరగంట ఉడికించి బయటకు తీయండి. ఉప్పు, మిరియాల పొడి దానిమీద చల్లండి. బేకింగ్ డిష్‌లో ఉంచి దానిమీద వైట్‌సాస్ పోయండి. తురిమిన చీజ్ చల్లి ఓవెన్‌లో ఉంచి, చీజ్ కరిగిన తరువాత బయటకు తీయండి. వేడిగా సర్వ్ చేయండి.



### షాహీ గోబీ మటర్

**కావలసినవి:** కాలీఫ్లవర్ ఒక కిలో పచ్చి బఠానీపావ్వకిలో, ఉల్లిపాయలు4 అల్లంఅంగుళం ముక్క, వెల్లుల్లిరేకలు10 జీలకర్రఒక టీ స్పూన్, గరం మసాలా ఒక టీస్పూన్ పచ్చిమిరపకాయలు4 లేక 6, ఆమ్‌చూర్అర టీస్పూన్ టమాటాలు అరకిలో, పెరుగుఅరకప్పు కోవాఒక టేబుల్‌స్పూన్ ఎండుద్రాక్ష రెండు టేబుల్ స్పూన్లు నెయ్యినాలుగు టేబుల్ స్పూన్లు కొత్తిమీరఒక కట్ట, ఉప్పురుచికి తగినంత


**తయారుచేసే విధానం:** బఠానీలను మెత్తగా ఉడికించి నీటిని వార్చి ఓ ప్రక్కన ఉంచండి. కాలీఫ్లవర్‌ను విడివిడిపూలుగా తరగండి. రెండు టేబుల్‌స్పూన్ల నేతిని వేడిచేసి కాలీఫ్లవర్ ముక్కలను కొంచెం ఎర్రబడేంతవరకు వేయించాలి. వెడల్పాటి పాన్‌లో మిగిలిన నేతిని వేడిచేసి అందులో తరిగిన ఉల్లిముక్కలు, రెండు పచ్చిమిరపకాయలు తరిగిన ముక్కలు, తరిగిన అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, ఆమ్‌చూర్ గరం మసాలా కలపాలి. తరిగిన టమాటా ముక్కలు వేసి, కలిపి వేయించి పెట్టుకున్న కాలీఫ్లవర్ ముక్కలు, ఎండు ద్రాక్ష, కోవాలను చేర్చి కలిపి, రెండు కప్పుల నీరు పోయండి. బఠానీలో వేసి పది నిమిషాలు ఉడికించండి. మిగిలిన పచ్చి మిరపకాయలను కొత్తిమీరను తరిగి పైన చల్లి వేడిగా వడ్డించండి.

## సూప్స్ అండ్ స్టాటర్స్

### బేబీ కార్న్ స్ట్రాటర్స్ ...

**కావల్సిన పదార్థాలు :** బేబీకార్న్ 15, పెరుగు సగం కప్పు, జీలకర్ర రెండు చెంచాలు, ఉప్పురుచికి తగినంత, మైదా 1/2కప్పు, మొక్కజొన్న పిండి సగం కప్పు, నిమ్మరసంఅరచెంచా, కారంఅరచెంచా, నూనె వేయించడానికి సరిపడా

**తయారీ విధానం:** ముందుగా బేబీ కార్న్ శుభ్రంగా కడిగి రెండు పొడవు ముక్కల్లా చేసుకోవాలి. ఓ గిన్నెలో సగం దాకా నీళ్ళు పోసి అందులో ఈ బేబీకార్న్ ముక్కలు వేసి స్టౌ మీద పెట్టాలి . నీళ్ళు కొద్దిగా వేడి అయ్యాక బేబీకార్న్ ముక్కల్ని వేయాలి. నీళ్లు మరిగాక దింపి బేబీకార్న్‌ని వేడినీటిలోనే ఉంచి పక్కకు పెట్టాలి. ఐదుని ముషాలయ్యాక నీటిని వంపేయాలి. ఓ గిన్నెలో పెరుగు, తగినంత ఉప్పు, చెంచా జీలకర్రపొడి తీసుకొని బాగా కలపాలి. ఇందులో బేబీకార్న్‌ని వేసి వాటిని పెరుగు బాగా పట్టేలా కలిని ఒక గంటసేపు అలాగే ఫ్రిజ్ లో ఉంచాలి. ఆలోపు మైదా, మొక్కజొన్న పిండి, మిగిలిన జీలకర్రపొడి, కారం, మరికొంచెం ఉప్పు, నిమ్మరసం ఓ గిన్నెలో తీసుకొని నీళ్ళు పోసుకుంటూ చిక్కని పిండిలా కలుపుకోవాలి. ఇప్పుడు ఫ్రిజ్ లో ఉంచిన బేబీకార్న్‌ని తీసి మైదా మిశ్రమంలో ముంచి కాగుతున్న నూనెలో వేయాలి. అన్ని వైపులా ఎర్రగా వేగిన తర్వాత పక్కకు తీసేయాలి. కచెప్‌తో వేడి వేడిగా తింటే రుచికరంగా ఉంటాయి.



### పాలకూర, స్వీట్ కార్న్ సూప్

**కావల్సిన పదార్థాలు:** స్వీట్‌కార్న్ రెండు కప్పులు, వెల్లుల్లి తరుగు టేబుల్‌స్పూను, ఉప్పు తగినంత, మిరియాలపొడి రుచికి సరిపడా, పాలకూర తరుగు కప్పు, నూనె రెండు చెంచాలు, క్రీం కొద్దిగా.

**తయారీ విధానం:** పొయ్యిమీద బాణలి పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక వెల్లుల్లి తరుగు వేయించాలి. నిమిషమయ్యాక స్వీట్‌కార్న్ వేసి వేయించాలి. అవి కాస్త వేగాక నాలుగు కప్పుల నీళ్లు పోసి మంట పెంచాలి. అవి మరుగుతున్నప్పుడు తగినంత ఉప్పూ, మిరియాలపొడీ వేసి దింపేయాలి. ఆ నీళ్ల వేడి తగ్గాక స్వీట్‌కార్న్‌ని మిక్సీలో తీసుకుని మెత్తని గుజ్జులా చేసుకోవాలి. దీన్ని మళ్లీ నీళ్లలో వేసి పొయ్యిమీద పెట్టాలి. రెండు నిమిషాల తరవాత పాలకూర తరుగు వేసి మంట తగ్గించాలి. కాస్త ఉడికాక దింపేసి క్రీం వేస్తే చాలు.

### చికెన్ టిక్కా

**కావల్సిన పదార్థాలు:** ఎముకల్లేని చికెన్ ముక్కలు అరకేజీ, సెనగపిండి ఒకటిన్నర టేబుల్‌స్పూను, పెరుగు కప్పు, కారం చెంచా, మిరియాలపొడి, గరంమసాలా అరచెంచా చొప్పున, పసుపు పావుచెంచా, ఉప్పు తగినంత, ధనియాలపొడి అర చెంచా, కసూరీమేథీ ముప్పావుచెంచా, నిమ్మరసం టేబుల్‌స్పూను, బిర్యానీ మసాలా అరచెంచా.

**తయారీ విధానం:**

పైన సిద్ధంచేసుకున్న పదార్థాలన్నింటినీ ఓ గిన్నెలోకి తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. ఈ గిన్నెను ఫ్రిజ్‌లో అరగంట నుంచి గంట ఉంచాలి. తరవాత ఇవతలకు తీసి ఇనుప చువ్వలకు గుచ్చి నిప్పులమీద కాల్చుకోవాలి. ■

## నోరూరించే వంటలు.... చేయటంలో మెళకువలు!

వంటగదిలో రుచికరమైన వంటలు చేయాలని చూస్తున్నారా? మంచి వంటకాలు ఎలా వుంటాయో మీరు ఊహించుకోవచ్చు. వంటగదిలో మీరు కొత్తగా ప్రవేశిస్తున్నారా? మీరు వంటలో నిపుణులైనా కాకపోయినా? మీరు వంటప్రక్రియలో, వండిన పదార్ధాలను నిల్వ వుంచటంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనాలి. వంట చేసే చిట్కాలు, మెళకువలు ఇంతవరకు మీకు తెలియలేదా? ఆందోళన చెందకండి. మేము మీకు వంటగదిలోని పెనాలు, కూరగాయలు కోయటం వంటి అంశాలపై కొన్ని ఉపయోగకరమైన చిట్కాలు, మెళకువలు అందిస్తున్నాం. పరిశీలించండి.

- వంటనూనె నిల్వ కంపు కొడుతూంటే, దానిలో ఎనిమిది లేదా పది నల్లటి మిరియాలు వేయండి. అది కొన్ని వారాలవరకు చెడు వాసన రాకుండా వుంటుంది.
- పంచదార డబ్బాకు చీమలు పడుతున్నాయా? చీమలు పట్టకుండా డబ్బాలో 3 లేదా 4 లవంగాలు పడేయండి. ఇక చీమలు అక్కడికిచేరవు.
- పప్పు దినుసులను డబ్బాలలో పోసే ముందు వాటిని వేయించండి. ఇలా చేస్తే వాటికి పురుగు, బూజు పట్టకుండా వుంటుంది.
- కొత్తిమీర కట్టలు ఫ్రిజ్‌లో పెట్టేటపుడు ఒక ప్లాస్టిక్ డబ్బాలో పెట్టి అందులో పెట్టండి. త్వరగా వాడకుండా వుంటాయి.
- బాండ్లీలో నూనె పొంగకుండా నూనె వేడి ఎక్కేటపుడే కొంచెం ఉప్పు వేయండి. నూనె పొంగకుండా వుంటుంది. లేదా అతి తక్కువగా పొంగుతుంది.
- పాలు త్వరగా తోడుకోవాలా? పాలలో కొద్దిగా జొన్న పిండి లేదా విటమిన్ సి టాబ్లెట్ వేయండి. గడ్డ పెరుగు తోడుకుంటుంది.
- యాపిల్ కోసిన తర్వాత దానిని ఉప్పు నీటిలో కడగండి. ఇక ఆ ఆపిల్ ముక్కలు ఎప్పటికి తాజాగా వుంటాయి.
- చికెన్ లేదా మటన్ లివర్‌ను పాలలో 15 నుండి 20 నిమిషాలు నానపెట్టి ఉడికించండి. అది మెత్తగా వుండటమే కాక, మంచి రుచిని కూడా ఇస్తుంది.
- ఆహారంలో గరిష్ట విలువ కొరకు కొద్ది చుక్కలు చింతపండు రసాన్ని వేయండి. పాలు అధికంగా మరిగి వాసనా? దానిలో కొద్దిగా ఉప్పు వేయండి. వాసన తగ్గుతుంది.
- గుడ్లు ఉడికించే ముందు అవి పగలకుండా కొద్దిగా ఉప్పు మరియు కొద్ది చుక్కలు వినేగర్ వేయండి.
- కేక్‌ను కోసేటపుడు, కత్తిని చల్లని నీటిలో కొంత సమయం వుంచండి. ఈ చర్య కేక్ సమంగా కోసేలా చేస్తుంది.
- ఉప్పును వర్షాకాలంలో గడ్డ కట్టకుండా వుంచటానికి గాను కొద్ది బియ్యాన్ని ఒక గుడ్డలో గట్టిగా కట్టి ఉప్పు డబ్బాలో వేయండి.
- పచ్చళ్ళు ఎపుడూ బూజు పడుతూంటాయి. బూజు పట్టకుండా ఒక చిన్న గుడ్డలో ఆవాలు మూట కట్టి దానిని పచ్చడి జాడీలో శుభ్రమైన చెంచాతో పెట్టి వుంచండి. పచ్చడి జాడీనుండి ఎపుడు బయటకు తీసినా, దానిని పొడి గరిటెతో తీయండి, గాలి చొరకుండా మూత గట్టిగా పెట్టండి.
- వెల్లుల్లి వలవకుండా వుండాలంటే, వాటి రెబ్బలు విడదీని వాటిని కొద్ది ఉప్పు, వినేగర్ తో కలిపి ఫ్రిజ్ లో వుంచండి. అవి చాలా రోజులు తాజాగా వుంటాయి.
- మీ ఫ్రిజ్‌లో చేపలు తాజాగా వుండాలంటే, పచ్చి చేపలను లేదా మాంసాన్ని బాగా కడగండి, పూర్తిగా ఎండపెట్టండి. వాటిని ప్లాస్టిక్ బేగ్‌లలో వుంచి రిఫ్రిజిరేటర్‌లో పెట్టండి.
- ప్రతిరోజూ వంట చేసే వారికి ఈ వంటింటి చిట్కాలు ఎంతో సహకరిస్తాయి. ఇవి ఆచరణలో పెడితే, వంట ఎంతో తేలిక. మీకు కనుక మరిన్ని చిట్కాలు తెలిసివున్నట్లయితే, మాకు వ్రాయండి. మీ అనుభవాలు మాతో పంచుకోండి.



## గోల్డెన్ బ్యూటీ
# హార్స్ రైడింగ్..

టాలీవుడ్ ఇండస్ట్రీలో గోల్డెన్ బ్యూటీ అంటే టక్కున గుర్తొచ్చే పేరు సంయుక్తా మీనన్. భీమ్లా నాయక్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అలరిస్తోంది. సంయుక్త ఇప్పటివరకు నటించిన అన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ కావడంతో ఈ బ్యూటీకి అవకాశాలు క్యూ కట్టాయి. ఆ తర్వాత బింబిసార, సార్, విరూపాక్ష చిత్రాల్లో నటించి మెప్పించింది. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుస సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉంటోంది. ఇటీవలే డెవిల్ మూవీతో అలరించింది సంయుక్త. నందమూరి కళ్యాణ్ రామ్ నటించిన ఈ మూవీ అంతగా మెప్పించలేకపోయింది. అయితే కొన్ని నెలలుగా కొత్త చిత్రాలకు సంయుక్త గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో.. త్వరలోనే ఈ బ్యూటీ తన బాయ్ ఫ్రెండ్ ను పెళ్లి చేసుకోనుందని వార్తలు వచ్చాయి. దీంతో ఈ అమ్మడు వాటికి స్పందించకపోయినా.. ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. సంయుక్తా మీనన్.. ప్రస్తుతం యంగ్ హీరో నిఖిల్ తో స్వయంభు మూవీ చేస్తోంది. పీరియాడికల్ బ్యాక్ డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాకు డైరెక్టర్ భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కోసం హీరో నిఖిల్ గుర్రపు స్వారీ నేర్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా సంయుక్త మీనన్ కూడా హార్స్ రైడింగ్ ప్రాక్టీస్ స్టార్ట్ చేసింది. ఈ విషయాన్ని చెబుతూ సోషల్ మీడియాలో ఒక స్పెషల్ పోస్ట్ పెట్టింది. గుర్రపు స్వారీ చేస్తున్న పిక్స్‌ను షేర్ చేసింది. "నా గురించి, నా జీవితం గురించి 2024 చాలా విషయాలు నేర్పించింది. జీవితంలో సాహసాలు చేయడమంటే నాకు చాలా ఇష్టం. నేనెప్పుడూ కంఫర్ట్ జోన్ లో ఉండాలనుకోను. ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకోవడానికి ప్రయత్నిస్తాను. నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవాలనుకుంటాను. ప్రస్తుతం



నా నెక్స్ట్ మూవీ స్వయంభు కోసం గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నాను. గుర్రంపై ప్రయాణం చేయడం నాకు చాలా ఇష్టం. నన్ను నమ్మండి.. ఈ ప్రయాణం కచ్చితంగా అద్భుతంగా ఉంటుంది" అంటూ సంయుక్త రాసుకొచ్చింది. స్వయంభు చిత్రాన్ని పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ చిత్రానికి కేజీఎఫ్ ఫేం రవి బస్రూర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రంలో నిఖిల్ యుద్ధ వీరుడిగా సర్ప్రైజింగ్ లుక్ లో కనిపించనున్నారు. మరి ఈ మూవీతో సంయుక్త ఎలాంటి హిట్ కొడుతుందో చూడాలి.




## వెన్నెల కిశోర్ హీరోగా చారి 111

టాలీవుడ్ స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'చారి 111'. తమిళ ముద్దుగుమ్మ సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. టీజీ కీర్తికుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా మార్చి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ఇప్పటినుంచే ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి కాన్సెప్ట్ టీజర్‌ను విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఫిబ్రవరి 12న సోషల్ మీడియా వేదికగా విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఒక పోస్టర్ కూడా విడుదల చేశారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే ఓ సీటీలో అనుమానాస్పద ఘటనలు జరుగుతుంటాయి. అవి చేధించే రహస్య గూఢచారి పాత్రలో వెన్నెల కిషోర్ కనిపించనున్నారు. ఇక సీనియర్ నటుడు మురళి శర్మ ఈ సినిమాలో మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. కిశోర్ సీక్రెట్ స్పైగా కనిపించనుండగా.. మురళి శర్మ స్పై ఏజెన్సీ హెడ్‌గా కనిపించనున్నారు. ఈ సినిమాను బర్కత్ స్టూడియోస్ బ్యానర్‌పై అదితి సోని నిర్మిస్తుంది.

## సితార నకిలీ ఇన్‌స్టా...

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కుమార్తె సితార పేరుతో కొందరు వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారు. సితార ఘట్టమనేని పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఖాతాలు తెరిచి ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ లింకులు పలువురికి పంపుతున్నట్లు జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ గుర్తించింది. ఇటువంటి వాటిని నమ్మొద్దని ఆ సంస్థ సోషల్ మీడియా వేదికగా పేర్కొంది. దీనికి సంబంధించి మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెలబ్రిటీల పేరుతో ఇలాంటి లింకులు వస్తే అప్రమత్తంగా ఉండాలని జీఎంబీ సంస్థ సూచించింది. సితార గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా కనిపించే ఆమె సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉంటుంది. అప్పుడప్పుడు తన తండ్రి పాటలకు స్టెప్పులేస్తూ సందడి చేస్తుంటుంది. తాజాగా గుంటూరు కారం చిత్రం నుంచి దమ్ మసాలా సాంగ్‌తో అలరించింది.



## సూపర్ స్టార్‌కి జోడీ
# ఇండోనేషియా అందమా!

'ఈగ'.. 'బాహుబలి'..' ఆర్ ఆర్ ఆర్- లాంటి సినిమాలకు పనిచేసిన కొంత మంది టెక్నీషియన్లను తెప్పించి అవసరం మేర విదేశాల నుంచి హాలీవుడ్ బృందాన్ని రంగంలోకి దించుతున్నారు. గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెం చర్ థ్రిల్లర్ నేపథ్యంలో కథ అంతా సాగడంతో? అందుకు తగ్గట్టు అన్ని రకాలుగా అంతా ఫిట్ అవుతారా? లేదా? అని భావించి రాజమౌళి ఈ రకమైన నిర్ణయంతో ముందుకెళ్తున్నారు. ఇక సినిమాలో మహేష్ కి జోడీగా ఏ హీరోయిన్ ని ఎంపిక చేస్తారు? అన్నది హాట్ టాపిక్ గా మారింది. బాలీవుడ్ భామని దించుతారా? హాలీవుడ్ నే దించేస్తారా? అని రకరకాల ప్రచారం సాగుతోంది. ఈ నేప థ్యంలోనే ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ పేరు తెరపైకి వచ్చింది. చెల్సియాని తీసు కుంటారనే ప్రచారం కొన్ని రోజులగా సోషల్ మీడియాలో జోరుగా సాగుతుంది. తాజాగా ఆ ప్రచారానికి ఈ సన్నివేశం మరింత బలం చేకూర్చింది. చెల్సియా సోషల్ మీడియాలో రాజమౌళిని మాత్రమే ఫాలో అవుతున్నారు. దీంతో ఆమె ఎంపిక ఖరారైందా? అందుకే ఆమె జక్కన్నని ఫాలో అవుతుందా? అన్న సందేహాలు మొదల య్యాయి. అయితే మహేష్ ని మాత్రం అనుసరించలేదు. అలాగే బాలీవుడ్ హీరోయిన్లు దీపికా పదుకొణే.. దిశా పటానీలను కూడా ఫాలో అవుతుంది. ఇలా టాలీవుడ్ తో సంబంధం ఉన్న ముగ్గుర్ని వ్యక్తుల్ని చెల్సియా అనుసరించడం నెట్టింట ఆసక్తికరంగా మారింది. మరి సూపర్ స్టార్ కి జోడీ ఆమె అవుతుందా? అన్నది కన్ఫమ్ అవ్వాల్సి ఉంది.





## దేవరలో
# శృతి మరాటే

టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న తాజా చిత్రం 'దేవర'. కొరటాల శివ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీదేవి గారలపట్టి జాన్వీకపూర్ 'దేవర'తో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అవుతుంది. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. పోర్ట్ మాఫియా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీ నుంచి అదిరిపోయే గ్లింప్స్‌ను షేర్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. కాగా దేవర పార్టు 1 ముందుగా నిర్ణయించిన ప్రకారం ఏప్రిల్ 5న విడుదల కావడం లేదన్న విషయం తెలిసిందే. సైఫ్ అలీఖాన్‌కు గాయం కావడంతో ఈ మూవీ షూటింగ్‌ను కొద్దిరోజులు నిలిపివేశారు. రీసెంట్‌గా ఈ సినిమా షూటింగ్ మళ్లీ మొదలయినట్లు సమాచారం. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి ఒక సాలిడ్ న్యూస్ వైరల్ అవుతుంది. ఈ మూవీలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే జాన్వీ కాకుండా మరో కొత్త కథనాయిక ఈ సినిమా నటిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంతో మరాఠీ హీరోయిన్ శ్రుతి మరాటే టాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై చిత్రయూనిట్ స్పందించాల్సి ఉంది. ఇక మల్టీ లింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

# బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తోంది

**బీజేపీపై సీపీఐ రామకృష్ణ తీవ్ర విమర్శలు**

**అమరావతి,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** బీజేపీపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తీవ్ర విమర్శలు గుప్పించారు. బ్లాక్ మెయిల్?తో బీజేపీ అందర్నీ లొంగ తీసుకుంటోందని ఆరోపించారు. సీబీఐ, జ్యూడిషియల్ ని గుప్పట్లో పెట్టుకుని అధికారంలోకి వస్తామంటున్నారని తెలిపారు. అధికారం కోసం పక్కా మైండ్ గేమ్ తో ముందుకెళు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, జగన్ లను మోడీ, అమిత్ షా బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు జైల్ కి వెళ్లడానికి కారణం మోడీ, అమిత్ షాలేనని రామకృష్ణ కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీలోని 90శాతం మందికి ఇది తెలుసు.. బీజేపీతో కలవద్దని వారు చెబుతున్నారన్నారు. మరోవైపు.. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ను సైతం ఎన్డీయే కూటమిలో చేరాలని మోడీ



భయపెడుతున్నాడని పేర్కొన్నారు. జగన్ వై నాట్ 175 అంటే.. మోడీ 370 అని అంటున్నారని తెలిపారు. కాగా.. రానున్న ఏపీ ఎన్నికల్లో ఏ పార్టీలతో ఎన్నికల్లో ముందుకెళ్లాలో సీపీఐ, సీపీఎం నిర్ణయించుకుంటాయని రామకృష్ణ తెలిపారు. అందుకోసం ఈనెల 20న విజయవాడలో సమావేశం అవుతున్నామని అన్నారు. మరోవైపు.. రాష్ట్రంలో ఓటర్ లిస్ట్ అవకతవకలకు కారణం ఐఏఎస్, ఐపీఎస్?లేనని పేర్కొన్నారు. దొంగ ఓట్లకు కారణం అయిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# శ్రీలంక, మారిషస్‌కూ యూపీఐ సేవల విస్తరణ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 (వెలుతురు న్యూస్):**
అంతర్జాతీయ ప్రయాణికుల సౌలభ్యం కోసం యూపీఐ సేవలను ప్రభుత్వం క్రమంగా విదేశాల్లోనూ ప్రారంభిస్తోంది. ఇటీవలే ఫ్రాన్స్‌లో మొదలైన వీటిని తాజాగా శ్రీలంక, మారిషస్‌కూ విస్తరించింది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన వర్చువల్ సమావేశంలో మారిషస్ ప్రధాని ప్రవింద్‌కుమార్ జగన్నాథ్, శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేతో కలిసి ప్రధానమంత్రి మోదీ పాల్గొన్నారు. మారిషస్‌లో రూపే కార్డులను సైతం ప్రారంభించడం విశేషం.శ్రీలంక, మారిషస్ ప్రజలతో భారత్‌కున్న ప్రత్యేక సంబంధాల దృష్ట్యా ప్రారంభిస్తున్న యూపీఐ సేవలు చాలామందికి ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధాని




కార్యాలయంఓ ప్రకటనలో తెలిపింది. ఎలాంటి అడ్డంకులు లేని డిజిటల్ లావాదేవీలకు ఇది దోహదం చేస్తుందని పేర్కొంది. తద్వారా డిజిటల్ అనుసంధానం సైతం మెరుగవుతుందని చెప్పింది. ఇకపై భారత్ నుంచి శ్రీలంక, మారిషస్‌కు వెళ్లేవారు యూపీఐతో చెల్లింపులు చేయొచ్చు.

మారిషస్ నుంచి భారత్‌కు వచ్చేవాళ్లూ ఈ సేవలను ఉపయోగించుకోవచ్చు. త్వరలో మారిషస్ బ్యాంకులు రూపే కార్డులనూ జారీ చేయొచ్చు. వాటిని ఆ దేశంతో పాటు భారత్‌లోనూ ఉపయోగించుకునే వెసులుబాటు ఉంటుంది. ఫ్రాన్స్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌ను సందర్శించే పర్యాటకులు యూపీఐ ద్వారా రుసుమును చెల్లించే సౌలభ్యాన్ని భారత్ ఫిబ్రవరి 2న ప్రారంభించింది. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఫ్రాన్స్ మంత్రి ప్రిస్కా డెవెనో హాజరయ్యారు. యూపీఐని ప్రపంచమంతటా వ్యాపింపజేయాలన్న మోదీ స్వప్నం సాకారమవుతోందని ఫ్రాన్స్‌లోని భారత రాయబార కార్యాలయం 'ఎక్స్'లో పేర్కొంది. ఫ్రాన్స్‌తో పాటు ఐరోపాలోని మరిన్ని దేశాల్లోనూ పర్యాటక, రిటైల్ రంగాలకు ఈ చెల్లింపుల విధానాన్ని విస్తరించనున్నట్లు తెలిపింది.

# ఎమ్మార్వో హత్య ఘటనపై రెవెన్యూ ఉద్యోగుల పెన్‌డౌన్

**అమరావతి,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** విశాఖ రూరల్ ఎమ్మార్వో రమణయ్య హత్య ఘటన ఆంధ్రప్రదేశ్‌లో కలకం రేపుతోంది.. ఇప్పటికే ఈ కేసులో దర్యాప్తును ముమ్మరం చేశారు పోలీసులు..ఎమ్మార్వో రమణయ్య హత్యకు దారితీసిన కారణాలను వెలుగులేకి తీసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.. అయితే, రమణయ్య హత్య ఘటన రెవెన్యూ అధికారుల గుండెల్లో గుబులు రేపుతోంది.. దీంతో పెన్‌డౌన్‌కు పిలుపునిచ్చారు రెవెన్యూ ఉద్యోగులు.. ఇవాళ్టి నుంచి రెవెన్యూ ఉద్యోగులు పెన్‌డౌన్‌కు పిలుపునిచ్చారు. ఎమ్మార్వో హత్య జరిగి 10 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది రెవెన్యూ అసోసియేషన్.. రమణయ్య హత్యపై రెవెన్యూ అసోసియేషన్ సమావేశంలో చర్చించిన ఉద్యోగులు.. ప్రభుత్వం స్పందించే వరకు సహాయ నిరాకరణ చేస్తామని హెచ్చరించింది. అందులో భాగంగా ఇవాళ్టి నుండి పెన్ డౌన్ చేసేందుకు ఏకగ్రీవ తీర్మానం చేశారు.. ఏమర్జెన్సీ కేసులు, పాత కేసులు తప్ప కొత్త వాటిని ప్రారంభించకూడదని ఉద్యోగులు నిర్ణయించారు. ఎమ్మార్వో కుటుంబ సభ్యులకు ప్రభుత్వమే రక్షణ కల్పించాలని రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. రమణయ్య పిల్లలకు చదువు, రమణయ్య భార్యకు గ్రూప్ 2 ఉద్యోగం కల్పించాలని పేర్కొంది. ఇక, రమణయ్య హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తోంది రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్.

# రామమందిరంలో ఢిల్లీ, పంజాబ్ సీఎంలు పూజలు

**ఆయోధ్య,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కుటుంబం, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ కుటుంబం ఆయోధ్యలో పర్యటించారు. ఇటీవల ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రాణప్రతిష్ఠ జరిగిన రామమందిరాన్ని ముఖ్యమంత్రుల కుటుంబాలు సందర్శించి.. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయంలో ప్రార్థనలు చేసిన అనంతరం ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు.. రామమందిరంలో ప్రార్థనలు చేసిన తర్వాత తాను వర్ణించలేని ప్రశాంతతను అనుభవించినట్లు తెలిపారు. ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు ఇక్కడకు వస్తున్నారని.. వారి ప్రేమను చూడటం నిజంగా హృదయపూర్వకంగా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఎంతో భక్తితో భక్తులు మందిరాన్ని సందర్శిస్తున్నారని ఆయన కొనియాడారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్ మాట్లాడుతూ.. రాముడ్ని దర్శించుకోవాలనే కోరిక చాలా కాలంగా ఉందని.. అది ఇప్పుడు నెరవేరిందని తెలిపారు. దేశ సంక్షేమం కోసం ప్రార్థించినట్లు ఆయన చెప్పుకొచ్చారు.

# ప్రస్తుతానికి ఏపీ రాజధాని అమరావతే

**ఆ తర్వాతే మూడు రాజధానులు..!**

**జనసేన ఎవరితో పొత్తులో ఉంది..?**

**బీజేపీతో నా? టీడీపీతో నా..?**

**మంత్రి అంబటి రాంబాబు నిలదీత**

**అమరావతి,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):**
ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయంలో పొత్తుల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారిపోయింది.. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులపై ఢిల్లీస్థాయిలో చర్చలు సాగుతోన్న తరుణంలో.. అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ.. విమర్శలు గుప్పిస్తోంది.. అసలు జనసేన ఎవరితో పొత్తులో ఉంది..? బీజేపీతో నా? టీడీపీతో నా..? అని ప్రశ్నించారు మంత్రి అంబటి రాంబాబు.. పల్నాడు జిల్లా పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో



మాట్లాడుతూ.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌వి అనైతికమైన పొత్తులు అని దుయ్యబట్టారు.. మా ప్రత్యర్థులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారు అంటూ ఎద్దేవా చేసిన ఆయన.. అసలు జనసేన ఎవరితో పొత్తు లో ఉంది బీజేపీ తో నా, టీడీపీ తోనా? అని నిలదీశారు.. వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. నరసరావుపేట ఎంపీ స్థానాన్ని బీసీకి కేటాయించారని.. సిట్టింగ్ ఎంపీగా ఉన్న లావు శ్రీ కృష్ణ దేవరాయలు పార్టీ విడిచి వెళ్లిపోయారని మండిపడ్డారు.. బీసీలకు సీటు ఇస్తే తట్టుకోలేక ఇంకో పార్టీలోకి వెళ్తున్న లావు ఒక బీసీ ద్రోహిగా ఫైర్ అయ్యారు.. వచ్చే ఎన్నికల కోసం పార్టీ అసంతృప్తులు సరి చేసుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. ఇక, ఏపీ రాజధానిపై కీలక వ్యాఖ్యలుచేశారు మంత్రి రాంబాబు.. ప్రస్తుతానికి ఏపీకి రాజధాని అమరావతే అని స్పష్టం చేసిన ఆయన.. కోర్టు స్టే తొలగిన వెంటనే ఏపీలో మూడు రాజధానులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు ఏపీ ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు.

# వైసీపీ తరపున ముగ్గురు నామినేషన్లు దాఖలు

**అమరావతి,ఫిబ్రవరి12(వెలుతురు న్యూస్):** వైసీపీ తరపున రాజ్యసభ అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్ దాఖలు చేశారు. వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి, గొల్ల బాబురావు.. అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ, రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. అంతకుముందు ఈ ముగ్గురు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిశారు. వీరికి సీఎం బీఫాం అందజేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా జగన్ పార్లమెంట్ మెట్లు ఎక్కించే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికీ అవకాశం కలిపిస్తున్నారని తెలిపారు. తమకు ఇచ్చిన ఈ అవకాశంతో ముగ్గురం కూడా విజయం సాధిస్తామని అన్నారు. అలాగే రాబోయే ఎన్నికల్లో కూడా వైసీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మళ్ళీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలుఅందరు కోరుకుంటున్నారని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గొల్ల బాబురావు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అశీసులతో తాము నామినేషన్ వేసామన్నారు. సమ సమాజం కోసం ఎంత వరకు వెళ్లాలన్నది జగన్ కి మాత్రం సాధ్యమని తెలిపారు. బడుగు బలహీన వర్గాల వారికి పెద్ద పీట వేశారని చెప్పారు. తనలాంటి సామాన్య వ్యక్తులను రాజ్యసభకి పంపిస్తున్న ఘనత జగన్ కి మాత్రమే దక్కుతుందని పేర్కొన్నారు. అలాగే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 175 సీట్లని కూడా కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబుకి, సీఎం



జగన్ కి చాలా తేడా ఉంటుంది..

గతంలో చంద్రబాబు ఎస్సీలకు చాలా మందికి అవకాశం ఇవ్వలేదన్నారు. చంద్రబాబు సొంత వర్గం అయిన కనకమేడలని రాజ్యసభకి పంపించారని.. కానీ జగన్ మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. మేడా రఘునాధ రెడ్డి మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం ఇచ్చిన సీఎం జగన్ కి ధన్యవాదాలు తెలిపారు. తాము కష్టపడి ప్రజల కోసం పనిచేస్తాం.. అలాగే రాబోయే ఎన్నికల్లో కూడా వైసీపీ విజయం సాధించేలా కృషి చేస్తామని ఆయన చెప్పారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

**కేంద్రాన్ని నిలదీయలేకపోతున్న జగన్**

**అభివృద్ధి పక్కకు పోయిందన్న సిపిఎం**

**విజయవాడ,ఫిబ్రవరి12, వెలుతురు:**
టిడిపి,జనసేనతో పాటు కమ్యూనిస్టులు కూడా అమరావతి, విశాఖ స్టీల్ తదితర విషయాలపై గట్టిగానే పోరాడుతున్నారు. ఈ విషయంలో కమ్యూనిస్టులు కొంత వీధిపోరాటాలు ఎక్కువగానే చేస్తున్నారు. ఉద్యోగుల ఆందోళనలకు మద్దతు ఇవ్వటం ద్వారా సమస్యను బాగాను హైలెట్ చేశారు. ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అరచేతిలో వైకుంఠం చూపించారు. వాస్తవంలో ఆర్థిక సంక్షోభం తీవ్రతరమైంది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్య ప్రజల ఆదాయాలు కుంచించుకుపోతున్నాయి. ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రతరమవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించటంలో జన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని సిపిఎం నేత వి.శ్రీనివాసరావు ఘాటుగా విమర్శించారు. అప్పులు చేయడం పంచి పెట్టడం అన్నరీతిలో పాలన సాగుతోంది. దీనిని ఎప్పటికప్పుడు కమ్యూనిస్టులు గట్టిగానే విమర్శిస్తున్నాయి. అమరావతి, విశాఖ స్టీల్, కృష్ణపట్నం తదితర అంశాల్లో పెరుగుతున్న ప్రజా ఉద్యమాలు ఆటంకంగా మారుతున్నాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం, విద్యార్థుల పోరాటాలు, మహిళ, దళిత, ఆదివాసీ ఉద్యమాలు, తాజా ఉద్యోగుల ఆందోళన ఇవన్నీ అందులో భాగమే. సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం ఆందోళనలను నిరంకుశంగా అణచటానికి ప్రయత్నం చేస్తున్నదని వి.శ్రీనివాస రావు అన్నారు. నష్టపోతున్న



శ్రామికుల పక్షాన కమ్యూనిస్టులు, కార్మిక తదితర ప్రజాతంత్ర సంఘాలు నిలబడి పోరాడుతున్నాయి. ప్రజల మధ్య ఐక్యత కోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారు. వారిని చీల్చి ప్రజా ఉద్యమాలను బలహీన పర్చటానికి పాలక వర్గాలు కుట్ర పన్నుతున్నాయి. అందుకు కులం, మతం, ప్రాంతం లాంటి ఏ ఒక్క అంశాన్ని అధికార పార్టీ వదలటం లేదు. ఎపి కూడా అదానీ, అంబానీలకు స్థావరంగా మారింది. గంగవరం పోర్టు వాటాను అదానీపరం చేయటం తాజా ఉదాహరణ. కృష్ణపట్నం ఓడరేవు ఎప్పుడో వారి పరమైపోయింది. ఈ విధానాలను వ్యతిరేకిస్తున్న కమ్యూనిస్టుల ప్రాబల్యాన్ని, ప్రతిష్టను దెబ్బ తీయడానికి ఎర్రజెండాలపై అక్కసు వెళ్లగక్కారని సిపిఎం ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస రావు మండిపడ్డారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి చేసిన ద్రోహం చేసినా పోరాడలేని అశక్తతలో సిఎం జగన్ ఉన్నారని మండిపడ్డారు. అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం వారికి లొంగిపోయి మతోన్మాద రాజకీయాలకు వంత పాడుతున్నాయి.

బిజెపి మతోన్మాద ఎజెండాకు ప్రజా ఉద్యమాలు చెక్ పెడుతు న్నాయి. 2019 ఎన్నికల తరువాత బిజెపి ద్రోహంపై ఒక్కసారి కూడా నోరు విప్పని జగన్ మోహన్ రెడ్డి పనిగట్టుకొని కమ్యూనిస్టులపై దాడికి దిగారని అన్నారు. నాడు చంద్రబాబు నాయుడు ప్రపంచబ్యాంకు సంస్కరణలు తీసుకు వస్తే, అవే విధానాలను మరో పేరుతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఇద్దరూ తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారని చెప్పారు. రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేసినా ప్రశ్నించటం లేదు. అందుకే కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేస్తుంటే అధికార వైసిపికి కంటగింపుగా వుందన్నారు.

# లోక్‌సభ ఎన్నికలకు సన్నాహకాలు ప్రారంభించిన తెలంగాణ బీజేపీ

**బలమైన అభ్యర్థులు లేని చోట చేరికలను ప్రోత్సాహించాలని నిర్ణయం**

**ఈటల రాజేందర్ ఎక్కడ నుంచి పోటీచేయాలనే దానిపై ఉత్కంఠ**

**హైదరాబాద్ ఫిబ్రవరి 12 (వెలుతురు న్యూస్):**
లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ బీజేపీ సన్నాహకాలు ప్రారంభించింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల కమిటీ బీజేపీ కార్యాలయంలో సమావేశం అయింది. ఈ భేటీలో కిషన్‌రెడ్డితోపాటు లక్ష్మణ్, డీకే అరుణ, జితేందర్ రెడ్డి, మురళీధరరావు, ఈటల రాజేందర్, ఇన్చార్జ్ అరవింద్ మీనన్ తదితరులు సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల కమిటీ ఒక్కో స్థానం నుంచి మూడు పేర్లు అధిష్ఠానానికి పంపనుంది. కాగా ఇప్పటికే ఒకసారి ఢిల్లీలో బీజేపీ ఎన్నికల కమిటీ సమావేశమైంది. సిట్టింగ్ స్థానలపై స్పష్టతకు వచ్చింది.సికింద్రాబాద్ నుంచి కిషన్ రెడ్డి, కరీంనగర్.. బండి సంజయ్, నిజామాబాద్.. ధర్మపురి అరవింద్, చేవెళ్ల.. కొండా విశ్వేశ్వరెడ్డి, భువనగిరి.. బూర నర్సయ్య గౌడ్ పేర్లు దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈటల రాజేందర్ ఎక్కడ నుంచి పోటీచేయాలనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మల్కాజ్‌గిరి స్థానం నుంచి పోటీకి ఆయన ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. అయితే మెదక్ లేదా జహీరాబాద్ నుంచి పోటీ చేయాలని ఈటలకు బీజేపీ నాయకత్వం సూచిస్తోంది. మల్కాజ్ గిరి సీటు చాడా సురేష్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, పన్నాల హరీష్ రెడ్డి, మల్కా కొమరయ్య, మురళీదర రావు ఆశిస్తున్నారు.మరోవైపు మహబూబ్‌నగర్ సీటు కోసం డీకే అరుణ, జితేందర్ రెడ్డి, శాంతికుమార్ పోటీపడుతున్నారు. నగర్ లోక్ సభ స్థానం కోసం



పార్టీలో ఉన్న ముఖ్యనేతల మధ్య పోటీ నెలకొంది. ఖమ్మం టికెట్ రేసులో ఈవీ రమేష్, గల్లా సత్యనారా యణ, రంగా కిరణ్, వాసుదేవరావులు ఉన్నారు. బల మైన అభ్యర్థులు లేని చోట చేరికలను ప్రోత్సాహిం చాలని బీజేపీ నిర్ణయించింది.

# వైసీపీ గుర్తింపును రద్దు చేయాలి

**మాజీ మంత్రి జవహర్ డిమాండ్**

**అమరావతి ఫిబ్రవరి 12(వెలుతురు న్యూస్):**
తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల అక్రమాలకు కారణమైన వైసీపీ గుర్తింపును రద్దు చేయాలని మాజీ మంత్రి జవహర్ అన్నారు. సోమ వారం టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ నేతలు గురుమూర్తి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలను రాబోయే ఎన్నికల్లో పాల్గొనకుండా అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జగన్ గతంలో నోట్ల కుంభకోణం చేశారని.. ఇప్పుడు ఓట్ల కుంభకోణం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమాలను ఏ విధంగా చేయాలనే దానిపై తిరుపతి ఉప ఎన్నికలు ఓ మోడల్‌గా నిలుస్తాయని విమర్శించారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 35 వేల ఓటర్ కార్డులను వైసీపీ నేతలు డౌన్ లోడ్ చేశారన్నారు. గిరీషా, చంద్రమౌళీశ్వర రెడ్డి లాంటి అధికారులు అక్రమాలకు పాల్పడ్డారంటే అది వారి కోసం కాదని.. వారి వెనుక వైసీపీ నేతలు ఉండే ఈ పని చేయించారని చెప్పారు.తిరుపతి ఉప ఎన్నికల్లో వైసీపీని గెలిపించడానికే అధికారిక లాగిన్ నుంచి ఓటర్ కార్డులను డౌన్ లోడ్ చేశారన్నారు. ఆ ఎన్నికల్లో గెలుపొందిన గురుమూర్తి మళ్లీ అక్కడి నుంచే పోటీ చేస్తున్నారన్నారు. గురుమూర్తి కూడా ఓ తోలు బొమ్మ అని ఎద్దేవా చేశారు. తెరవెనుక ఉండే తోలు బొమ్మలను ఆడించే మనుషులు పెద్దిరెడ్డి, చెవిరెడ్డి, భూమన, సజ్జల వంటి నేతలని విమర్శించారు. సీఈఓ కార్యాలయంలోనే జగన్ మనుషులున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. తిరుపతి ఉప ఎన్నికల తరహా అక్రమాలు ఇంకెన్ని చోట్ల జరిగి ఉంటాయి..? అని ప్రశ్నించారు. ?

ఇంకెంత మంది ఎన్నికల అధికారుల లాగిన్లు జగన్ చేతిలో ఉన్నాయోననే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఎన్నికల అక్రమాలకు పాల్పడిన గురుమూర్తి, పెద్దిరెడ్డి, భూమన, చెవిరెడ్డి వంటి వైసీపీ నేతలను ఎన్నికల్లో పాల్గొనకుండా అనర్హులుగా ప్రకటించాలని జవహర్ డిమాండ్ చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com